www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 49 పుటలు : 52

జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ భాద్రపద శుద్ధ ఏకాదశి

25 సెప్టెంబర్ - 01 అక్టోబర్ 2023

వెల : ₹20/-

సనాతన 'ధర్మయుద్ధం'

మూలాలను కించపరిస్తే నోళ్లు మూయించాలి

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

జి-20లో తెలుగు హస్తకళా ప్రాభవం

ఢిల్లీలో సెప్టెంబర్ 9,10 తేదీలలో జరిగిన జి-20 శిఖరాగ్ర సమ్మేళనంలో తెలుగు హస్తకళలకు విశేష గుర్తింపు లభించింది. ప్రగతి మైదానంలోని భారత్ మంటపంలో ఏర్పాటైన స్టాళ్లలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చోటు దక్కడం ఒక ఎత్తయితే, దాదాపు నాలుగు శతాబ్దాల చరిత్ర గలిగిన 'కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రి' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అశోకచక్రం ఆకారంలో వెండితీగతో తయారుచేసిన 'ఫిలిగ్రి' బ్యాడ్జీలు దేశవిదేశాల అధినేతలను ఆకట్టుకోవడం పట్ల సంబంధిత కళాకారులు ఆనందం, హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే యునెస్కో పురస్కారం, జాతీయస్థాయిలో నాలుగు పురస్కారాలు అందుకున్న 'ఫిలిగ్రి' బ్యాడ్జీలు ఈ సమ్మేళనానికి హాజరైన ఆయా దేశాల ప్రతినిధులు ధరించడం అపురూప సంఘటనగా భావిస్తున్నారు.

తెలంగాణ స్టాళ్లలో పోచంపల్లి, గద్వాల చేనేత వస్త్రాలు, నిర్మల్ బొమ్మలు, చేర్యాల పెయింటింగ్‌లు వంటివి ఉంచగా, ఆంధ్రప్రదేశ్ తరపున మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం చేనతే వస్త్రాలు, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణ వంటివి కొలువుదీరాయి.

డి.అరుణ

మహిళా బిల్లుకు కదలిక విపక్షాల తికమక

మహిళల సహనానికే పరీక్ష పెట్టిన 'మహిళా రిజర్వేషన్ బిల్లు'ను నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ కేబినెట్ సెప్టెంబర్ 18న ఆమోదించడంతో పాటు 19న లోక్‌సభలో ప్రవేశపెట్టడంతో రాజకీయ పార్టీలన్నీ షాక్‌కు గురయ్యాయి. అటు లోక్‌సభలోనూ, ఇటు అసెంబ్లీలోనూ 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు ఇచ్చేందుకు ఉద్దేశించిన బిల్లు ఇది.

ఈ సంచిక మీ చేతుల్లోకి వచ్చే సమయానికి ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదాన్ని పొంది వాస్తవ రూపం దాల్చే అవకాశం కూడా ఉంది. యూపీఏ కాలంలోనే రాజ్యసభలో ఆమోదాన్ని పొందిన ఈ బిల్లు లోక్ సభలో ప్రతిష్ఠంభనకు గురైంది. అంతే! దాన్ని కోల్డ్ స్టోరేజీలో పారేశారు. కేంద్రంపై కోపం వచ్చినప్పుడల్లా ప్రతిపక్ష మహిళా సభ్యులు తమ సహచరులను కలుపుకుని, మహిళా బిల్లును ఎన్డీయే ప్రభుత్వం ఆమోదించాలంటూ ధర్నాలు చేయడం కూడా మనం చూశాం. ఇకపై ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ఆ అవకాశం వారికి లభించదు.

చిత్రమైన విషయమేమిటంటే, మహిళలకు రిజర్వేషన్ల అంశం రాజ్యాంగ పరిషత్తులో చర్చకు వచ్చినప్పుడు, మహిళల ప్రాతినిధ్యం అనేది ప్రాంత పరంగా ఉండాలి తప్ప మహిళా సీట్ల రిజర్వేషన్ల పరంగా కాదు అని పరిషత్ సభ్యురాలైన రేణుకా రే వాదించారు. ఇంకా, ఈ దేశంలో మహిళా ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచీ, మహిళలు ప్రత్యేక హక్కులను ప్రాథమికంగా వ్యతిరేకిస్తున్నారని కూడా ఆమె వ్యాఖ్యానించడం గమనార్హం. మరొక సభ్యురాలు పూర్ణిమ బెనర్జీ అయితే, తమకోసం మహిళలు ఎటువంటి రిజర్వుడు స్థానాలను కోరుకోవడం లేదని స్పష్టం చేయదలచుకున్నానని అన్నారు.

ఇక ఆలిండియా మహిళా నదన్సలో ప్రసంగించిన సరోజినీ నాయుడు, ముందుగా తాను ఫెమినిస్టుని కాదని కుండబద్దలు కొడుతూ, ఆ మాట ఎందుకు అంటున్నానో వివరించారు. ఫెమినిస్టుగా ఉండడం అంటే, తమ జీవితాన్ని ఎవరో అణగ దొక్కారని అంగీకరించడమేనని, మహిళలను ప్రత్యేకంగా పరిగణించమని డిమాండ్ చేయడం అంటే, తాము ఇతరులకన్నా తక్కువ వారమని అంగీకరించడమేనని అన్నారు. భారతదేశంలో అటువంటి అవసరం ఏమీ లేదని, ఎందుకంటే, మహిళలు ఎప్పుడూ వారి సలహామండలిలోనూ, యుద్ధక్షేత్రాలలోనూ వారి సరసనే ఉన్నారంటూ వ్యాఖ్యానించారు.

ఇదంతా కూడా స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో మహిళా నాయకుల భావాలు. అయితే, 1987లో మహిళలను సామాజిక అణచివేత సంకెళ్ల నుంచి విముక్తం చేసేందుకు సూచనల కోసం నాటి మహిళ, యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ సహాయ మంత్రి మార్గరెట్ ఆల్వా నేతృత్వంలో 14మంది సభ్యుల కమిటీ వేశారు. ఈ కమిటీ మహిళల కోసం ప్రత్యేక ప్రణాళికను ఎన్‌పిపి 1988-2000ను రూపొందించడమే కాక ఉమ్మడి పౌర స్మృతి, ఆస్తి హక్కుల నుంచి శాసనసభల్లో మహిళలకు రిజిర్వేషన్లు తదితర అంశాలు సహా 353 సూచనలు చేసింది.

ఆ తర్వాతి చర్యగా 73 -74 రాజ్యాంగ సవరణ చట్టాలు ప్రవేశపెట్టారు. పంచాయతీరాజ్ సంస్థలు, అధ్యక్ష పదవుల్లో మహిళలకు మూడింట ఒకటి సీట్లను కేటాయిస్తూ ఈ సవరణలు చేశారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు అన్నింటికీ ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ బిల్లు అమలులోకి వచ్చిన అనంతరం స్థానిక సంస్థల్లో మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఇక శాసనసభ, పార్లమెంటులో రిజర్వేషన్ల కోసం మహిళా రిజర్వేషన్ బిల్లును 1996లో తొలిసారిగా దేవెగౌడ ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.నాడు కూడా కేబినెట్‌లో చర్చించి, సెప్టెంబర్ 9, 1996న 81వ రాజ్యాంగ సవరణ బిల్లుగా గౌడ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అది నెగ్గలేకపోయింది. తర్వాత మాజీ ప్రధాని ఐకె గుజ్రాల్ కూడా తన ప్రయత్నం చేసి చూశారు. ఫలితం లేకపోయింది.

కాగా, 2010లో యూపీఏ హయాంలో మహిళా రిజర్వేషన్ బిల్లును 108వ రాజ్యాంగ సవరణ బిల్లుగా రాజ్యసభ ఆమోదించింది. కానీ, దిగువ సభలో మాత్రం నెగ్గలేదు. సరిగా 13 ఏళ్ల తర్వాత ఈ బిల్లుకు ప్రాణం పోసి ఎన్డీయే ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.

మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆమోదం కోసం ప్రవేశ పెట్టబోతోందనే వార్త వెలువడడం ఏమిటి, ఆ ఘనత తమదంటే తమదని కొందరు ప్రతిపక్ష నేతలు సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టడం ప్రారంభించారు. ఈ దేశంలో ఏం జరిగినా, దాన్ని మొదలుపెట్టింది మేమే అని చెప్పుకోవడానికి అలవాటుపడి పోయిన క్రమంలో మొదట ప్రకటనలు కాంగ్రెస్ పార్టీ వారివే వచ్చాయి. తమ సంకీర్ణంలో భాగస్వాములుగా ఉన్న పార్టీలే ఆ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందకుండా అడ్డుకున్నాయన్న విషయాన్ని, రాజకీయ అవసరాల కోసం ఆ విషయంలో అప్పుడు తాము నోరు మూసుకుని ఊరుకున్న విషయాన్ని కాంగ్రెస్ చెప్పలేదు. ఇప్పుడు కూడా దాని పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క మాదిరే. ఈ బిల్లును వ్యతిరేకించిన పార్టీలన్నింటితో కలిసి ఇండియా కూటమిని కట్టిన కాంగ్రెస్‌కు ముందు నుయ్యి వెనుక గొయ్యి లాగా తయారైంది. పార్లమెంటులో బిల్లును సమర్థిస్తే, ఆ కూటమిలో ఎన్ని పార్టీలు మిగులుతాయో తెలియని స్థితి. ప్రస్తుతానికి కాంగ్రెస్, వామపక్షాలు బిల్లుకు సుముఖంగా ఉన్నాయి.

గతంలో బిల్లును వ్యతిరేకించిన లాలూ నేతృత్వంలోని ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు ఇప్పటికీ తమ వైఖరిని మార్చుకోలేదు. ఈ బిల్లులో ఓబీసీలకు ఉప రిజర్వేషన్లు ఇవ్వాలనే సాకుతో నానా రభస చేసి కిందటిసారి బిల్లును వాయిదా వేయించాయి. నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ ఈసారి కొంత సుముఖతను వ్యక్తం చేస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రాంతీయ పార్టీలన్నీ కూడా ప్రత్యేక సమావేశాలలో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని చేస్తున్న డిమాండ్‌తో ఆయన గొంతు కలపగా, అనేక ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా సమర్థిస్తున్నాయి.

కొత్తగా ప్రవేశపెట్టబోయే బిల్లులో యాభై శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పిస్తున్నారనే వదంతులు కూడా బయలుదేరాయి. ఇందులో కాస్త వాస్తవికత ఉండవచ్చు కూడా. ఎందుకంటే, ఆర్జేడీ వంటి పార్టీలు అడుగుతున్న రిజర్వేషన్లలో రిజర్వేషన్లను కల్పించడం అలాగే సాధ్యం అవుతుంది. కనుక, అదే జరిగినా మనం ఆశ్చర్యపోనవసరం లేదు. కొత్త పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రతిపక్షాలకు ఇంకే విషయాలలో మాస్టర్ స్ట్రోక్ ఇస్తారన్నది వేచి చూడాల్సిన విషయమే. ★

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/-** (వారానికి రూ. 12/-) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/- చెల్లించగలరు. ప్రస్తుత చందాదారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/- చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust,
920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

మరిన్ని వివరాలకు

040-27561453/9959997013 నెంబర్లలో సంప్రదించవచ్చు.

- సర్క్యులేషన్ మేనేజర్

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | **సంవత్సర చందా రూ.850**

చందా పంపవలసిన చిరునామా :

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి	అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్	**9959991304**

డిజైనర్ : సిహెచ్. కుమార్

ప్రపంచం నిద్రిస్తున్న వేళ భారత్‌లో స్వాతంత్ర్యోదయమైంది అంటూ ఆగస్ట్ 14, 1947 అర్ధరాత్రి ఈ పురాతన దేశ చరిత్రలోనే గొప్ప మొదటి రోజు గురించి ప్రథమ ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూ నుడివినదిక్కడే. అప్పటి నుంచి 75 ఏళ్ల స్వతంత్ర భారత భవ్య ప్రస్థానం కోసం మార్గదర్శకాలకు రూపకల్పన జరిగినదీ అక్కడే. కొన్ని అవాంఛనీయ పోకడలు కనిపించినా, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి కావలసిన వాదనలకూ వేదిక అదే. పాత పార్లమెంట్ భవనం ఘనత ఇదంతా. పరిణతి చెందిన ఎందరో రాజకీయవేత్తలకీ, రాజనీతిజ్ఞుల మేళవింపుకీ నిలయమది. 1927లలో వినియోగంలోకి వచ్చిన మన పాత పార్లమెంట్ భవనం ఇక మహోన్నత ఘట్టాలను దాచుకున్న ప్రదర్శనశాల. 95 సంవత్సరాల తరువాత, ఈ సెప్టెంబర్ 18వ తేదీతో తన సేవలను చాలించింది. నిన్నటిదాకా ప్రవహించిన నది, ఇవాళ అదృశ్యమైపోయినా, దాని గలగలల సవ్వడుల జాడలు, పరవళ్ల ముద్రలు చెవులను వీడిపోలేవు.

ప్రత్యేక సమావేశాలలో భాగంగా మొదటి రోజున పాత పార్లమెంట్ భవంతికి వీడ్కోలు ఇచ్చే కార్యక్రమం నిర్వహించారు. ఇది బ్రిటిష్ ఇండియా నాటి ఆ మహా భవంతి చుట్టు కొలతలూ, జమాఖర్చులూ పునశ్చరణ చేసుకోవడానికి మాత్రం కాదు. భారత ప్రజాస్వామ్యం మూడో ప్రపంచ దేశాలకు తలమానికంగా నిలిచిందంటే, అందుకు అవసరమైన తాత్త్వికతను ప్రసాదించినవి ఇక్కడ జరిగిన చర్చలే. ఇక్కడ నిర్మితమైన ఆలోచనలే. అవే ప్రధాని నరేంద్ర మోదీ గుర్తు చేసుకున్నారు. అసంఖ్యాకమైన ప్రజాస్వామిక సంప్రదాయాలకు పుట్టిల్లు ఇదేనన్నారాయన. అవన్నీ సమష్టి కృషి ఫలితాలనీ చెప్పారు. ఆ చరిత్ర అంతా సమష్టి వారసత్వమనీ, అందరికీ గర్వకారణమనీ శ్లాఘించారు. వెరసి అవన్నీ ఒక జాతిని నిర్మించి, భారత్‌ను నేడు 'విశ్వమిత్ర' స్థానంలో సగర్వంగా నిలిపాయని కైమోడ్పులర్పించారు ప్రధాని.

లోక్‌సభ, రాజ్యసభల సభ్యులు, వాటి అధ్యక్షులు, ప్రధానులు ఈ ఏడున్నర దశాబ్దాలలో అందించిన కృషి నిస్సందేహంగా అజరామరమైనది.

శాలివాహన 1945 శ్రీ శోభకృత్ భాద్రపద శుద్ధ ఏకాదశి

లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం

సనాతన 'ధర్మయుద్ధం'

మూలాలను కించపరిస్తే నోళ్లు మూయించాలి

6లో

మహమ్మారి

కేరళలో మరో దఫా 'నిఫా'

12లో



ధారావాహిక నవల

మహా సంకల్పం

- పి. చంద్రశేఖర ఆజాద్

20లో

జాగృతి

సంపాదకీయం

అద్భుతమైనది. మనతో పాటే స్వాతంత్ర్యం సాధించుకున్న కొన్ని దేశాలను పరిశీలిస్తే ఆధునిక యుగానికి అవసరమైన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడంలో భారత్ చేసిన పోరాటం, జరిపిన సమరం, చేసిన కృషి ఎంత సమున్నతమైనవో అర్థమవుతుంది. దీనికి కేంద్రబిందువు పార్లమెంటు. ఇందిర ప్రధానిగా ఉండగా, బంగ్లాదేశ్ ఆవిర్భావం వేళ; రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఓటు హక్కు వయోపరిమితిని 18 ఏళ్లకు తగ్గించిన సందర్భం, పీవీ నరసింహారావు సరళీకృత ఆర్థిక విధానాల రూపకల్పన, అటల్ బిహారీ వాజపేయి అణుపరీక్షలు నిర్వహించిన సందర్భంలోను మన పార్లమెంట్ చూపిన చొరవను పాత భవనంలో

ఇక సెలవు!

జరిగిన ఆఖరి సమావేశంలో ప్రధాని మోదీ ప్రస్తావించారు.

అవి ఎలాంటి అపురూప దృశ్యాలు! ఆంగ్ల సాహిత్య పరిమళంతో విలసిల్లిన ప్రథమ ప్రధాని కవితాత్మక, మేధోపూరిత ఉపన్యాసాలూ, మట్టివాసనతో గుబాళించిన అటల్‌జీ ఉపన్యాసాల వరకు దేశం మరచిపోలేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, శ్యామాప్రసాద్ ముఖర్జీ, పురుషోత్తమదాస్ టండన్, రామ్‌మనోహర్ లోహియా, ఓపీ త్యాగి, కమ్యూనిస్టు దిగ్గజాలు, సోమనాథ్ చటర్జీ, ఇంద్రజిత్ గుప్తాలు, పీలూ మోడీ, లాల్‌కృష్ణ ఆద్వాని, చంద్రశేఖర్, మధు దండావతే వంటి ఎందరో తమ వాగ్ధాటితో పార్లమెంటు సమావేశాలకు వన్నె తెచ్చినవారే. మధ్య తరగతి కోసం పోరాడిన వారు కొందరు, భారతీయత కోసం, మనదైన పాలనా వ్యవస్థ కోసం ఆక్రోశించినవారు కొందరు, రైతాంగం కోసం గళమెత్తినవారు ఇంకొందరు. కార్మికుల కోసం నినదించిన వారు మరికొందరు.

భారత జాతీయ కాంగ్రెస్ అప్రతిహతంగా వెలిగిపోతున్న కాలంలోను తమవైన చింతనలనూ వినిపించిన జనసంఘ్, భారతీయ జనతా పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్ట్ పార్టీ, ఎన్నో ప్రాంతీయ పార్టీలు భారత పార్లమెంటరీ వ్యవస్థను సుసంపన్న చేశాయి. ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్రాల విభజన, తలాక్ వంటి బిల్లులు బీజేపీ పాలనలో వచ్చాయి. సమాచార హక్కు చట్టం, ఆహారభద్రత చట్టం వంటివి కాంగ్రెస్ హయాంలో, డాక్టర్ మన్మోహన్ సింగ్ తీసుకువచ్చారని ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌధురి గుర్తు చేశారు.

గతమంతా ఎప్పుడూ ఘనం కాలేదు. అందులోని మంచిని స్వాగతిస్తూ, చేటునూ గుర్తించిన సమాజమే ఉన్నతమైనది. అందుకే మోదీ ఒక విషయం గుర్తు చేయక తప్పలేదు. ఓటుకు నోటు వంటి అవాంఛనీయ పరిణామాలు కూడా ఇదే సభలో, ఇంత సమున్నత సభలో చోటు చేసుకోవడం ఒక మచ్చ వంటిదేనని చెప్పవలసి వచ్చింది.

నరేంద్ర మోదీ ఉపన్యాసం ఉద్దేశం గతాన్ని గుర్తు చేయడం ఒక్కటే కాదు. ప్రజాక్షేత్రంలో, ఓట్ల సమరంలో ఓడినవారు పార్లమెంటు ఇచ్చిన హక్కుల చాటున మెజారిటీ తీర్పును అపహాస్యం చేసే తీరు బలపడుతున్నది. ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించేదికాదు. ప్రజలు ఎన్నుకున్న ఏ ప్రభుత్వానికైనా తనదైన విధానాలతో, పంథాలో పాలించే హక్కు ఉంటుంది. ఎన్నిక కావడం ద్వారా వారు ఆ హక్కును సాధించుకున్న సంగతిని ఎవరూ విస్మరించరాదు. ఆ హక్కును నిరాకరించే దుష్ట సంప్రదాయం ఇటీవలి సభా కార్యకలాపాలలో వెర్రితలలు వేస్తున్నది. పెద్దలసభ పేరుతో నగౌరవంగా పిలుచుకునే రాజ్యసభలోను ఇదే ధోరణి దురదృష్టకరం. ఒక్క మాటలో చెప్పాలంటే, దేశ అత్యున్నత చట్టసభలో ఉండవలసిన హుందాతనం అడుగంటిపోతున్నది. చర్చలలో మేధోపరమైన, హేతుబద్ధమైన, తర్కబద్ధమైన ధోరణులు నశించిపోతున్నాయి. ఈ సంస్కృతిని పాత భవనం ముంగిటనే వీడి, కొత్త పార్లమెంటు భవనంలో ప్రవేశిద్దామని మోదీ పరోక్షంగా చెప్పారు. ఇవి ప్రతిపక్షాలు గుర్తిస్తాయని కోరుకుందాం. ★

40లో

కథ

చిలుక

- దేశరాజు



అవినీతి రట్టు యత్నమా? కక్ష సాధింపా? (వేదిక) - 16
సమున్నత సందేశం వామనతత్వం (ప్రత్యేక వ్యాసం) - 24
సార్థక నామధేయురాలు 'ప్రతిభా'బోస్ (మహిళ) - 26
ఆచితూచి పెట్టుబడులు (ఆర్థిక అక్షరాస్యత అవగాహన) - 28
చరిత్ర వక్రీకరణ క్షంతవ్యం కాదు! (తెలంగాణ) - 30
కొత్త అడుగా? చివరి వెలుగా? (జాతీయం) - 36
ఆసియా క్రీడల్లో భారత్ 'బంగారు' వేట! (క్రీడ) - 43
ప్రేక్షకులకు చుక్కలు చూపిస్తున్న సినిమాలు! (సినిమా) - 50

సనాతన ధర్మం మీద వస్తున్న విమర్శలకు దీటుగా స్పందించాలని ప్రధాని నరేంద్ర మోదీ మంత్రివర్గ సమావేశంలో చెప్పినట్టు వార్తలు వచ్చాయి. దీనికి భుజాలు తడుముకోవలసిన వాళ్లంతా వెంటనే తడుముకున్నారు. అందులో మొదటి స్థానం తమిళనాడు మొదటి కుటుంబానిదే. వీళ్లు తాజాగా సనాతన ధర్మం మీద మొదలుపెట్టిన యుద్ధం ప్రమాదకరమైనది. భారతదేశాన్ని ఒక సంక్షోభంలోకి నెట్టివేయాలన్న కుట్రతో జరిగినది. దీని వెనుక ఉన్నవి ఇంకెన్ని?

సీతా మహాసాధ్వినీ, రైలు బోగీలో దయనీయంగా కన్నుమూసిన కరసేవకులనీ స్టాండప్ కమేడియన్‌ల పేరుతో ముస్లిం ఉన్మాదాలు ఎద్దేవా చేస్తారు.

జ్ఞానవాపి మసీదులో శివలింగం బయటపడితే అన్ని మర్యాదలు మరచిపోయి నాయకులు, ఆచార్యులు, పత్రికారచయితలు కోరస్‌గా అడ్డమైన కూతలూ కూస్తారు.

రామచరిత మానస్‌లో కొన్ని కులాలను అవమానించే వ్యాఖ్యలు ఉన్నాయంటూ దగ్ధకాండకు సిద్ధమవుతాడు ఇంకొకడు.

అయోధ్యలో గుడి ఎందుకు? కళాశాలో, ఆసుపత్రో కట్టొచ్చు అంటాడొకడు.

సనాతన ధర్మం డెంగీ, కరోనా వంటిది, నిర్మూలించాలంటాడు ఒకడు.

కళాశాల విద్యార్థులంతా దేశం మీద పడి సనాతన ధర్మాన్ని విమర్శించే ఉపన్యాసాలు ఇవ్వాలంటుంది ఒక పార్టీ.

సనాతన ధర్మం ఎయిడ్స్ వంటిది, ప్రపంచానికే ముప్పు అని పేలతాడు ఇంకొకడు.

భారతదేశంలో కింది కులాలకు, మైనారిటీలకు రక్షణ లేదంటూ అంతర్జాతీయ వేదికల మీద మాత్రమే లెక్చర్లు దంచుతాడు మరొకడు.

డిజ్‌మ్యాంటిలింగ్ గ్లోబల్ హిందుత్వ అంటూ విదేశీ విశ్వవిద్యాలయాలలో గోష్ఠులే పెడతారు పనీపాటా లేని దేశద్రోహులు.

ఈ సరస్వతి ఎవరు? ఈ లక్ష్మి ఎవరు? ఎవరికి పుట్టారు అని వాగుతాడొకడు.

కానీ, అల్లాను ఏమన్నా సర్ తన్‌సే జుదా అంటూ వీరంగం వేస్తారు.

దీనికంతటికీ ఉన్న ఒక పేరు భావ ప్రకటనా స్వేచ్ఛ.

ఈ ధోరణికి ఉన్న ఇంకా పెద్ద పేరు సెక్యులరిజం.

ఇలాంటి భావ ప్రకటనా స్వేచ్ఛ, సెక్యులరిజం వెర్రితలలు వేసి, ముదిరి దేశ సమైక్యతకు ముప్పు స్థాయికి ఎదిగిపోతున్న తరుణంలో ఇప్పుడు ప్రధాని మోదీయే నేరుగా ఎదురుదాడికి దిగారు. ఇది అనివార్యం.

సనాతన 'ధర్మయుద్ధం'

మూలాలను కించపరిస్తే నోళ్లు మూయించాలి

మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల పర్యటనలో (సెప్టెంబర్ 15) ప్రధాని ఘాటుగా, నూటిగా సనాతన ధర్మ ద్వేషులపై విమర్శలు చేశారు. 'దురహంకార కూటమి (ఇండియా కూటమి) ఇటీవలే ముంబైలో సమావేశమైంది. దానికి ఒక విధానం లేదు. ఒక నాయకుడు లేడు. సనాతన ధర్మం మీద దాడి చేస్తూ, నాశనం చేయాలన్న ఒకే ఒక్క అజెండా మాత్రం ఉంది' ఎలాంటి దాపరికాలూ లేకుండానే పెద్ద ఎత్తున విమర్శకు దిగారు మోదీ. 'సనాతన ధర్మం నుంచి గాంధీజీ స్ఫూర్తి పొందారు. ఆయన సాగించిన స్వాతంత్ర్య పోరాటం సనాతన ధర్మం కేంద్రంగానే సాగింది. గాంధీజీ జీవితాంతం అదే పాటించారు. రాణి అహల్యాబాయి హోల్కార్, ఝాన్సీ లక్ష్మీబాయి, స్వామి వివేకానంద, లోకమాన్య తిలక్ వంటి వారంతా సనాతన ధర్మాన్ని నమ్మి ముందుకు సాగారు.' మరిచిపోయారా? అన్నట్టు ప్రధాని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో వీరందరినీ అవమానపరుస్తూ విపక్ష కూటమి బహిరంగంగా నీచ విమర్శలకు దిగుతోంది. నిజానికి అవి విమర్శలు కావు. మెజారిటీ ప్రజల మనోభావాల మీద దాడులు. సనాతన ధర్మాన్ని అవలంబిస్తున్నవారంతా దీనిని గమనించాలి అని ప్రధాని గుర్తు చేశారు. అంటే భారత్‌లో తమ ఆటలు సాగాలంటే, మళ్లీ బొఫోర్సులు, ఆసియాడ్ అవినీతి, టూజీ అవకతవకలు జరగాలంటే ఇప్పుడు ప్రభుత్వం పోవాలి. గతంతో బీజేపీకి ఉన్న ప్రేమను తుంచాలన్నదే వాళ్ల కుట్రగా ప్రధాని భావిస్తున్నారు. అది నిజమే కూడా. సనాతన ధర్మాన్ని విమర్శిస్తున్నవాళ్లంతా అధికారం కోసమే ఇదంతా చేస్తున్నారు.

'భారత్‌ను, ప్రాచీన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కనుమరుగు చేయాలని చూస్తున్న విపక్ష ఇండియా కూటమి కుయుక్తుల పట్ల ప్రజలు నిత్యం జాగరూకులై ఉండాలి' అని ప్రధాని నేరుగా పిలుపునివ్వడంలోని అంతరార్థం ఇదే అనిపిస్తుంది. మన దేశానికి మన విశ్వాసాలకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతున్నదని కూడా అన్నారు. 'కొందరు అధికారం కోల్పోయాక ప్రజల పట్ల ద్వేషం పెంచుకున్నారు. అందుకే ప్రజల గుర్తింపుపై, సంస్కృతిపై దాడి చేస్తున్నారు. దేశంలో వేలాది సంవత్సరాలుగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న సంస్కృతిని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలన్నదే వారి లక్ష్యం. సనాతన ధర్మం వ్యక్తులకు కాదు, వారు చేసే కర్మకు (పనులకు) ప్రాధాన్యం ఇస్తుం'దని ప్రధాని లోతుగానే విమర్శించారు. ఆ క్రమంలోనే సనాతన ధర్మంపై సాగుతున్న దాడికి దీటుగా స్పందించాలని ప్రధాని నేరుగా పిలుపునిచ్చారు.

ప్రస్తుతం భారతదేశంలో హిందువులనూ, సనాతన ధర్మాన్నీ కించపరిస్తే కొన్ని నిర్దిష్ట ప్రయోజనాలు సిద్ధంగా ఉంటున్నాయి. మొదటి ప్రయోజనం, ఆ మాత్రం వాగుడు సామర్థ్యం ఉంటే అతడు రాత్రికి రాత్రే మేధావి స్థానానికి ఎదిగిపోతాడు. కొందరికి రాజకీయ పార్టీలలో గుర్తింపు వస్తుంది. కొందరికి ఉద్యోగాలలో పదోన్నతులు కూడా దక్కుతాయి. అన్నింటికీ మించి మైనారిటీల ఓట్లు రావాలంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతర సంకర రాజకీయ పార్టీలు అనుసరించిన ఏకైక వ్యూహం హిందూ వ్యతిరేకత. ప్రస్తుతం ఈ రకమైన ఓట్ల ఉన్మాదం, పదవీ దాహం హిందూ వ్యతిరేకతతో తీర్చుకోవాలన్న దురద నాయకులలో మితిమీరింది. బీజేపీ, ఒకటి రెండు దాని మిత్రపక్షాలు తప్ప హిందూ ద్వేషంతో ఓట్లు సంపాదించుకోవాలన్న విధానమే ఎక్కువ పార్టీలలో నేడు సుస్పష్టం. ఈ క్రమంలోనే తామంతా ఏకం కావాలన్న ఆలోచనకు హిందువులు రావలసిన అవసరం ఉందని ప్రధాని నిష్కర్షగానే చెప్పినట్టయింది. ఇప్పుడు హిందూధర్మం మీద వినపడుతున్న వ్యాఖ్యలు కఠోరమైనవి. కుసంస్కారం నిండి ఉన్నవే. వీటిని భావ ప్రకటనా స్వేచ్ఛగానో, ఇక్కడ సెక్యులరిజం అంటే ఇదే అని నమ్మించడానికో జరుగుతున్న కుట్రలాగే కనపడుతున్నది. అయితే ఇదంతా దేశంలో తమ తమ విశ్వాసాలను రుద్దాలని ప్రయత్నిస్తున్న ఎడారి మతాలకు వీరి వైఖరి సాయపడుతోంది.

దేశంలో తానొక సచ్ఛీలుడనైన రాజకీయవేత్తగా చెప్పుకునే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అనేకసార్లు హిందూత్వను విమర్శించినవాడే. ఆఖరికి రామమందిరం నిర్మాణం తథ్యమని తేలిన తరువాత కూడా, అంటే 2014లో కూడా అక్కడ ఆలయం కట్టడం సాధ్యమని మా నాయనమ్మ కూడా నమ్మడం లేదని సెలవిచ్చిన అహంకారి ఇతడు. అలాగే అయోధ్య వివాదాస్పద స్థలంలో ఆసుపత్రి, లేదా పాఠశాల వంటివి నిర్మించాలంటూ అనేక పర్యా

యాలు ఉచిత సలహా కూడా పడేశాడు. వీటన్నిటికీ పరాకాష్ట 2019లో ఇతడు సామాజిక మాధ్యమాలలో పెట్టిన బొమ్మ. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే స్వస్తిక్ మీద ఆమ్‌ఆద్మీ పార్టీ గుర్తు చీపురుతో ఒక వ్యక్తి దాడి చేస్తున్నట్టు ఆ చిత్రంలో ఉంది. మోదీ ప్రభుత్వం తన తప్పిదాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నదని చెబుతూ, జేఎన్‌యూకు నిప్పు పెట్టిన హనుమను, మోదీని చిత్రించిన ఒక వ్యంగ్య చిత్రాన్ని కూడా కేజ్రీవాల్ సామాజిక మాధ్యమాలలో ఒక సందర్భంలో ఉంచాడు.

నోటివాటంతో బతికే రాజకీయ నాయకులకు హిందూత్వయే పెద్ద ఆధారం. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మొహువా మొయిత్రా ఇందుకు మంచి ఉదాహరణ. జ్ఞానవాపి మసీదులో శివలింగం బయటపడిన మాట వాస్తవం. అది భారత పురావస్తు శాఖ కనుగొన్న శివలింగం. న్యాయస్థానాలు ధ్రువీకరించిన వాస్తవం. కానీ ఈమె ఒక ట్వీట్‌లో ఈసారి బాబా అటామిక్ పరిశోధన కేంద్రంలో తవ్వకాలు జరుగుతాయని ఆశిద్దాం అంటూ వ్యాఖ్యానించారు. జ్ఞానవాపి మసీదులో వజూఖానాలో దొరికిన శివలింగం మీద ఎవడి నోటికి వచ్చినట్టు వాడు వాగాడు. రాతలు రాశారు. వీటికి పరాకాష్ట ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చరిత్ర ఆచార్యుడు రతన్‌లాల్ పెట్టిన పోస్టు. ఆ శివలింగాన్ని చూస్తే శివుడికి కూడా ఆనాడు సున్నతి జరిగిందని అనిపిస్తుంది అన్నాడతడు. ప్రొఫెసర్ రవికాంత్ చందన్ అనే మరొక అజ్ఞాని మరొక విపరీత వ్యాఖ్య చేశాడు. కొందరు అర్చకుల చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఆగ్రహించే ఔరంగజేబు కాశీ ఆలయాన్ని నేలమట్టం చేశాడట. ఇలాంటి అజ్ఞానులకు ప్రొఫెసర్ ఎస్ఎల్ భైరప్ప రాసిన 'ఆవరణ' నవల చదివితే కాస్త జ్ఞానం వస్తుంది. కనువిప్పు కలిగే అవకాశం ఉంది. చిత్రం ఏమిటంటే, ఈ చరిత్ర ఆచార్యత్వం వెలగబెడుతున్న ఆ మూర్ఖుడు చందన్ ప్రస్తావించిన ఆ పుస్తకం, రచయిత కూడా విశ్వసనీయత కలిగినవి కావు. తాను ఈ పుస్తకం పూర్తి ఆధారాలతో రాయలేదనీ, కాబట్టి ఇందులోని విషయాన్ని లోతైనదిగా భావించవద్దని చెప్పుకున్నాడు. కానీ మాట్లాడడానికి ఏమీ లేని ఇలాంటి అజ్ఞానపు పీఠాధిపతులు వాటినే ఎంచుకుని వాగుతున్నారు. రఖీబ్ హమీద్ నాయక్ అనే మరొక ఉన్మాది కూడా తన అజ్ఞానం మొత్తం ప్రదర్శించుకున్నాడు. అమెరికా అధ్యక్ష భవనం, దాని ముందు నీటి ఫౌంటేన్ ఫోటో పెట్టి, ఇక్కడ నీటి ఫౌంటేన్ ఉన్నా శివలింగం దొరకలేదని పురావస్తు శాస్త్రవేత్తలు ప్రకటించారు అని రాసుకున్నాడు. ఇక్కడ ఒక విషయం ప్రస్తావించుకోవాలి. టీవీ చర్చలలో, లేదా కాలమ్‌లలో ఇలాంటి ముస్లిం మేధావులు, జర్నలిస్టులు తమవైన


ఉదయనిధి

ప్రొఫెసర్లు, ముల్లాలు, రోడ్డున పోయే ఆవారాలు అంతా కూడా హిందూధర్మం ప్రస్తావన వచ్చేసరికి ఒకే విధంగా స్పందిస్తున్నారు. ఒకే రకమైన అజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎక్కడ లేని తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ అనుబంధ జేఎన్ వైద్యకళాశాల ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ జితేంద్ర కుమార్ ఇందుకు మంచి ఉదా హరణ. లైంగిక అత్యాచారం గురించి విద్యార్థులకు వివరించ వలసి వచ్చినప్పుడు హిందూ దేవుళ్లను ప్రస్తావిస్తూ పాఠం చెప్పడం ఇతడి జబ్బు.

విశ్వాసాలు, మతం ఆధారంగానే మాట్లాడుతున్నారు తప్ప, వాస్తవం జోలికి పోవడం లేదు. యాంకర్ ప్రశ్నతో పనిలేదు. తాము దేశం మీద రుద్ద దలిచిన వాదననే ముందుకు తెస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు అయినా, పురావస్తు శాస్త్రవేత్తలు తేల్చిన సత్యమే అయినా వాళ్లకి పట్టదు. మత పరిధి నుంచి మాత్రమే దేనినైనా వారు చూస్తున్నారు. ఈ ధోరణికి ప్రస్తుతం ఉన్న పేరు సెక్యులరిజం.

ప్రొఫెసర్లు, ముల్లాలు, రోడ్డున పోయే ఆవారాలు అంతా కూడా హిందూధర్మం ప్రస్తావన వచ్చేసరికి ఒకే విధంగా స్పందిస్తున్నారు. ఒకే రకమైన అజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎక్కడ లేని తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ అనుబంధ జేఎన్ వైద్యకళాశాల ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ జితేంద్రకుమార్ ఇందుకు మంచి ఉదా హరణ. లైంగిక అత్యాచారం గురించి విద్యార్థులకు వివరించవలసి వచ్చినప్పుడు హిందూదేవుళ్లను ప్రస్తావిస్తూ పాఠం చెప్పడం ఇతడి జబ్బు. దీని మీద దర్యాప్తు జరిపిన అధికారులు వాస్తవాలు నిగ్గు తేలిన తరువాత సస్పెండ్ చేశారు. ఇతడు తరగతి గదిలో చెప్పినవి రాయడానికి కూడా సందేహించవలసి వస్తున్నది. అంత జుగుప్సాకరం.

దేశంలో ఎనభయ్ శాతానికి పైగా హిందువులు. వ్యాపారాలన్నింటికి వారి కొనుగోలు శక్తే ఆధారం. అయినా వ్యాపార సంస్థలకు హిందువు అంటే గౌరవం లేదు. ఇది నిజం. 2019లో రెడ్ లేబుల్ అనే టీ పొడిని మార్కెట్‌లోకి విడుదల చేసినప్పుడు ఒక వ్యాపార ప్రకటన వచ్చింది. ఒక హిందువు వినాయకుడి బొమ్మ కొనడానికి వెళతాడు. బేరం జరుగుతూ ఉండగా, వృద్ధుడైన బొమ్మల వర్తకుడు స్కల్ కేప్ తీసుకుని పెట్టుకుంటాడు. దీనితో ఆ హిందువు తాను ముస్లిం దగ్గర కొనుగోలు చేయనని వెళ్లిపోవడానికి సిద్ధపడతాడు. కానీ అప్పుడే ఆ బొమ్మల వర్తకుడు టీ ఇస్తాడు. వెంటనే అది తీసుకుని తాగుతాడు హిందువు. పైగా బొమ్మ కొనుగోలు చేస్తాడు. ఎంత అవమానం! తనిష్క బంగారు ఆభరణాల వ్యాపారులు లవ్ జిహాద్‌ను ప్రేరేపిస్తున్న తీరులో వ్యాపార ప్రకటన విడుదల చేసి, చివరికి ఉపసంహరించుకున్నారు.

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ వేదికల మీద చేసిన ప్రకటనలు మొత్తం భారత జాతిని అవమానించేవే. ఇటీవల కూడా నాలుగు ఐరోపా దేశాల పర్యటనలో ఆయన ఇదే చేశాడు. ఒకటే పాట – భారతదేశంలో మైనారిటీలకు రక్షణ లేదు. కింది కులాలవారికి దిక్కు లేదు. శాంతి భద్రతలు లేవు. ఫాసిజం రాజ్యమేలుతోంది. ఇవే. రాహుల్, ఈయన పార్టీ కాంగ్రెస్ కేంద్ర బిందువుగా ప్రస్తుతం ఇండియా కూటమి ఇరుసుగా సాగుతున్న రాజకీయాలు మొత్తం హిందూ వ్యతిరేక కార్యకలాపాలే. ఇందులో ఉన్న చాలా పార్టీలు హిందూ వ్యతిరేక భావజాలంతో ఉన్నవే. ఇవేనా! ఇండియా కూటమితో కలవక పోయినా హిందువుల ప్రయోజనాలు, విశ్వాసాలు, మనోభావాలు పట్టని పార్టీలు దేశం నిండా ఉన్నాయి. కేసీఆర్ బీఆర్ఎస్, జగన్ వైఎస్ఆర్ కూడా ఇలాంటివే. రాజకీయాలతో ప్రమేయం లేదని చెప్పుకుంటూ, సామాజిక కార్యకర్తలమంటూ, సాంస్కృతిక కార్యకర్తలమంటూ స్వయం ప్రకటిత మేధావులకు కూడా తక్కువ లేదు. వీరందరి లక్ష్యం ఒక్కటే– హిందూ వ్యతిరేక ప్రచారం. ఇందుకు తాజా ఉదాహరణ తమిళనాడు ఉదయనిధి స్టాలిన్ అనే మంత్రి, డీఎంకే ఎంపీ ఎ. రాజా చేసిన వ్యాఖ్యలు. వీటికి సమాధానం ఇవ్వక తప్పదు. గళం విప్పక తప్పదు. సామాజిక, న్యాయపోరాటం చేయకా తప్పదు. నిజానికి ఇందుకు మోదీ పిలుపునివ్వవలసిన అవసరం లేదు. ప్రతి భారతీయుడు అందుకు నడుం కట్టాలి.

భారతదేశ చరిత్రలో ఎప్పటికీ చీకటి దినాలుగా మిగిలిపోయే కొన్ని రోజులు ఉన్నాయి. సెప్టెంబర్ 17,1949 అలాంటి రోజే. ద్రవిడ మున్నేట్ర కళగం అనే ఒక వేర్పాటువాద, విధ్వంసక పక్షం ఆవిర్భవించినది ఆ రోజునే. అదే డీఎంకే. ఆ మరునాడే పార్టీని

ప్రారంభించిన సీఎన్ అన్నాదురై తన రాజకీయ, సైద్ధాంతిక గురువు గురించి మహత్తరమైన సత్యాలని తమిళులకి వెల్లడించాడు. ఆ గురువు పేరే ఈవీ రామస్వామి నాయకర్. కొందరు పెరియార్ అన్న బిరుదు కలిపి పిలుస్తారు. అన్నాదురై మాటల ప్రకారం పెరియార్ ఒక నియంత. తన వయసులో సగం కంటే తక్కువ వయసు ఉన్న మణియమ్మాళ్‌ను పెళ్లి చేసుకున్నాడు. అయితే తామందరి ఆశయం సోషలిస్టు ద్రవిడమ్ వికసించడమే కాబట్టి నాయకర్ చిరకాలం జీవించి ఉండాలనీ కూడా అన్నాదురై ఆకాంక్షించాడు. ఇంతకీ ద్రవిడమ్ అంటే దక్షిణ భారతదేశంలో స్వతంత్ర రాజ్యం. ఔను, డీఎంకే ఆద్యంతాలు విభజన రాజకీయాలు. వేర్పాటు ధోరణి.

పెరియార్ అభిప్రాయాలు, ప్రకటనలు ఎంత రాక్షసంగా, అవివేకంతో విరాజిల్లేవో చెప్పడానికి మాటలు చాలవు. ఆగస్ట్ 15, 1947న స్వాతంత్ర్యం రావడానికి కొద్ది ముందు (జూలై 27) ఆ స్వాతంత్ర్యం మూడు 'బి'లకు సంబంధించినది (బ్రిటిష్, బనియా, బ్రాహ్మణ) మాత్రమేనని ఎద్దేవా చేశాడు. 1939 నుంచి కూడా ద్రవిడ ఉద్యమం ఆ మూడు కులాలను శత్రువులగానే పరిగణించింది. కానీ అన్నాదురై మాత్రం ఆ మూడు కులాలలో ఒక 'బి'ని (బ్రాహ్మణ)ని వదిలేశాడు. మిగిలిన రెండింటి గురించి చెప్పాడు. కానీ ఈ సిద్ధాంతం ఓట్లు సంపాదించేవరకే. 1967లో అన్నాదురై రాజాజీతో చేతులు కలిపాడు. 1971లో కరుణానిధి ఇందిరాగాంధీతో చేతులు కలిపాడు. చిత్రంగా ఆ రెండు సందర్భాలలోను కట్టు తప్పి చేసుకున్న ఒప్పందం కారణంగా ఓడిపోయినది 'స్వచ్ఛమైన తమిళుడు' కామరాజ్ నాడార్ కావడం విశేషం. తరువాత అన్నాదురై డీఎంకేకి దూరంగా జరిగాడు. తరువాత ఒకసారి డీఎంకే, మరొకసారి అన్నాడీఎంకే గెలుస్తూ తమిళనాడును ఏలాయి. ఇప్పటికీ ఏలుతున్నాయి.

బురదలో దిగి కంకణం తీసుకోమని చెప్పే పంచతంత్రం కథలో ముసలి పులిలాగే మాట్లాడుతున్నాడు తమిళనాడు దేవదాయ ధర్మాదాయ మంత్రి శేఖర్ బాబు. ఇంత గొడవ జరిగిన తరువాత కూడా డీఎంకే హిందువులను హృదయ పూర్వకంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నదనీ, తమ పార్టీ సనాతన ధర్మాన్ని సమర్థిస్తుందనీ సిగ్గూ ఎగ్గూ లేకుండా చెప్పడం ఎంత విడ్డూరం! ద్రవిడ కళంకులు మొత్తం సనాతన ధర్మాన్ని టోకున వ్యతిరేకించరట. ఆ ధర్మంలో సతీసహగమనం ఉంది కాబట్టి డీఎంకే వ్యతిరేకమట! ఇప్పుడెక్కడ ఉంది, సహగమనం. అలాంటి పనే ఈ డీఎంకే సాక్షాత్తు తమిళనాడు శాసనసభలో చేసింది. జయలలిత వస్త్రాలు నిండు సభలో చింపిన పార్టీ అది. అలాగే సనాతన ధర్మంలో కులం గొడవ ఉందట. ఎంత భేషజం! డీఎంకేలో లేదా? కులం అనేది పురోగామి అంశం కాదట.

ఎ. రాజా

మొయిత్రా

తాత, తండ్రి, మనవడు అధికారం పట్టుకు వేలాడితే అది పురోగతి అవుతుంది కాబోలు. డీఎంకే ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఏమీ మిగలలేదు కాబట్టి సనాతన ధర్మం అనే అంశాన్ని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ప్రచారం చేస్తున్నారని శేఖర్‌బాబు అభిప్రాయం. సనాతన ధర్మంలో ఆడవారు శీలరక్షణ కోసం సతీసహగమనం చేసేవారని కొత్త చారిత్రక అంశాన్ని శేఖర్‌బాబు సృష్టించాడు. పైగా ఈ సూక్ష్మం అన్నామలైకి అర్థం కావడం లేదని కూడా తేల్చారు. ఇంతకీ ఉదయనిధి వాగిన వేదిక మీద ఆశీనుడై సర్వం మైమరచి విన్న శేఖర్‌బాబుకి హఠాత్తుగా ఇలాంటి జ్ఞానోదయం ఎందుకయినట్టు? ఏమీలేదు. ముంబై మైరారోడ్ పోలీసు స్టేషన్‌లో సనాతన ధర్మం మీద అవాకులూ చెవాకులూ వాగినందుకు ఉదయనిధిపై కేసు నమోదైంది. వెంటనే శేఖర్‌బాబు నాలుక మడత పడింది. బుర్ర పనిచేసింది. సామాజిక స్పృహ, భావ ప్రకటనా స్వేచ్ఛలకు వక్రభాష్యం చెప్పుకుంటూ ఇటీవల కొందరు బాధ్యతలేని రచయితలు కూడా ఈ విధ్వంసక శిబిరంలో భాగస్వాములు అవుతున్నారు. సనాతన ధర్మం మీద కారుకూతలు కూయడానికి ఉదయనిధి ఎంచుకున్న వేదిక ఇలాంటి రచయితలు సమకూర్చినదే. పేరు కూడా సనాతన ధర్మ వ్యతిరేక సభ. ధనిక, పేద వర్గాల మధ్య ఘర్షణ అనివార్యమన్న నమ్మకంతో ఉన్న ఎర్ర రచయితలు అది వట్టి భ్రమ అని తేలిపోయాక, కులాల మధ్య చిచ్చుతో అలాంటి ఘర్షణ తేవాలని, అంతిమంగా అదే సోషలిజాన్నీ వీలైతే కమ్యూనిజాన్ని తెస్తుందని నమ్ముతున్నారు. వీళ్లని ఉదయనిధి వంటివాళ్లు ఉపయోగించుకుంటారు. నిజానికి సినిమా, రచనారంగం, పత్రికారంగం మొదటినుంచి ద్రవిడ వాద ప్రచారానికి చెప్పుల మాదిరిగా ఉపయోగ పడ్డాయి. కరుణానిధి ఎంత నీచమైన మాట మాట్లాడినా దానిని ఖండించేవారూ, ఖండించని వారూ చివరికి చెప్పే మాట, ఆయనో గొప్ప రచయిత. అయితే ఏమిటి? రచయితల పని ఇదా? మనో

'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది

భావాలను గాయపరచడమా? సంస్కారహీనంగా వాగడమా? అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా, దిగిపోయాక ఒకరకంగా దేవుడి గురించి మాట్లాడ డమా? చిత్రంగా ఉదయనిధి వాగిన తరువాత కాంగ్రెస్ యువతరం కూడా దానిని అందుకున్నది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్ణాటక శాసనసభ సభ్యుడు ప్రియాంక్ ఖర్గే, రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ ప్రముఖుడు చిదంబరం కుమారుడు కార్తి కూడా ఉదయనిధి చెప్పిందాంట్లో సత్యం ఇబ్బడిముబ్బడిగా ఉందని తేల్చి పారేసినవారే. అందుకే ఇండియా కూటమి ఒక సనాతన ధర్మ వ్యతిరేక శిబిరం అని దేశం గుర్తించవలసి ఉంటుంది. ఈ దేశాన్ని తిలకం ధరించే కొందరు చీల్చారని ఆర్జేడీ నాయకమన్యుడొకడు కొత్త చరిత్ర ఉల్లేఖించాడు.

తమిళ భాషా సమాజానికి కొన్ని దశాబ్దాలుగా ఒకే విషయం వినడం అలవాటైపోయింది. అది హేతువు పేరుతో సాగిన నిర్హేతుక విషప్రచారం. పెరియార్ ఈవీ రామస్వామినాయకర్, సీఎన్ అన్నాదురై, తరువాత ఎం. కరుణానిధి ఊకదంపుడు అది. అంతా హిందూత్వం మీద నీచమైన దాడి. మాటల నిండా వెకిలి. అడుగుకో గుడి కనిపించే తమిళ నాడులో ఈ రకమైన వాగాడంబరం ఒక మత్తులా పనిచేస్తోంది. బ్రాహ్మణుల ఆధిపత్యం మీద పోరు అంటూ గాలితో యుద్ధం చేయడం, చెమటలు కక్కడం మరొక అంశం. దేవుళ్లని బూతులు తిట్టడం ఇంకొక జుగుప్సాకర ధోరణి. ఇలాంటి ఒక అధమాధమ ధోరణిని తమిళనాడులో ప్రవేశపెట్టిన వాడు రామస్వామి నాయకర్.

‘దేవుడే లేడు. అతడిని సృష్టించినవాడొక మూఢుడు. దేవుడు పేరు చెప్పుకునే వాడొక అజ్ఞాని. దేవుడిని ఆరాధించేవాడొక అనాగరికుడు’ ఇది రామస్వామి నాయకర్ మతం. ద్రవిడవాద భాష్యం. దీనికి కొనసాగింపు ఎంకె స్టాలిన్ కుమారుడు, తమిళనాడు యువజన సంక్షేమ, క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు. ఈ రకమైన ఒక విష సంస్కృతికి కారణం అడిగితే రొంబ పైత్యంతో కూడిన విశ్లేషణ ఒకటి చేస్తూ ఉంటారు. సనాతనం అంటే మిగిలిన భారతదేశానికంతటికీ ఒక రకంగాను, తమిళనాడు ప్రజలకు మాత్రం వేరే విధంగాను అర్థమవుతుందిట. సనాతన ధర్మానికి ద్రవిడనాడు దూరమని వారు చెబుతారు. కులం పేరు చెప్పి సమాజాన్ని విడదీసే దుష్టత్వం సనాతన ధర్మంలో ఉందట. ఇంతకాలం ఇలాంటి అబద్ధాలతో డీఎంకే బతికిపోయిందని, సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈ కాలంలో ఆ కట్టుకథలు చెల్లవని, జనం ఈ వేర్పాటువాద పైత్యాన్ని అర్థం చేసుకుంటు న్నారని బీజేపీ నాయకులు అంటున్నారు.

నిజానికి ఉదయనిధి ప్రేలాపన పట్ల డీఎంకేలోనే కొందరు అనంతృప్తితో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. సనాతన ధర్మం అంటే, అది చెప్పే సిద్ధాంతాలు సాధారణ ప్రజలకు అర్థం కాని మాట నిజమే. అయినా ఆ ధర్మాన్ని ఇష్టం వచ్చినట్టు తిడితే వాళ్లు సహించరు. రాజ్యాంగం అందరూ చదవరు. అందరికీ అర్థం కూడా కాదు. కానీ రాజ్యాంగాన్ని

దూషిస్తే ప్రతిస్పందన ఉంటుంది. సనాతన ధర్మం లేదా హిందూ ధర్మం మీద విమర్శ కూడా అంతే అంటున్నారు వారు. ఈ విషయం అర్థం చేసుకోవా లని డీఎంకేలోనే కొందరు అభిప్రాయపడడం విశేషం. ఎందుకంటే, ప్రస్తుత పరిస్థితులు వేరు. ఈ కాలం తీరు వేరు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే, అది బీజేపీకి లాభం చేకూర్చవచ్చు. అంటే నాస్తిక రాజ్యంలో బీజేపీ చొరబడవచ్చునని వారు భయపడుతున్నారు. ఉదయనిధి వ్యాఖ్యలతో ఒక వర్గం ఇకపై డీఎంకేకి దూరం కావచ్చు. ఇంకొన్ని వర్గాలవారు ఆ వ్యాఖ్యల కారణంగానే డీఎంకే వెనుక చేరవచ్చునని అంటున్నారు. ఈ వర్గాలు ఏవో ఊహించడం కష్టం కాదు. ఉదయనిధి ఒక క్రైస్తవుడు. ఆ వర్గం డీఎంకే చెంతకు చేరవచ్చు.

సనాతన ధర్మం మీద ద్వేషాన్ని ఒక సామాజిక సంక్షోభం దిశగా తీసుకువెళ్లాలన్న ఆలోచన డీఎంకేలో ఈసారి స్పష్టంగానే కనిపిస్తున్నది. ఉదయ నిధి డెంగ్యూ, కరోనా అంటూ విమర్శించాడు. కేంద్ర మాజీ మంత్రి అదే పార్టీ ఎంపీ ఎ. రాజా అయితే హెచ్ఐవీ అంటూ మరింత దిగజారి విమర్శలకు దిగాడు. ఈ వివాదాన్ని విద్యార్థుల మధ్యకు తీసుకుపోయి అశాంతి వాతావరణం సృష్టించే ప్రయత్నం కూడా జరిగింది.

తమిళనాడులోని తిరువారూర్ జిల్లాలోని ఒక ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను ఇందుకు ఉపయోగించుకోవాలని డీఎంకే చూసింది. తమిళ నాడు మాజీ ముఖ్యమంత్రి ద్రవిడవాద నాయకుడు అన్నాదురై జయంతి సందర్భంగా సెప్టెంబర్ 15న డీఎంకే కత్తూరు అనే చోట సనాతన ధర్మ వ్యతిరేక కార్యక్రమం నిర్వహించింది. తరువాత తిరువారూర్‌లో ఉన్న తిరు వి.కా. ఆర్ట్స్ ప్రభుత్వ కళాశాల ఒక నోటీసు జారీచేసింది. విద్యార్థులంతా సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను దేశం మీదకు వదలాలని ఆ నోటీసు సారాంశం. అయితే సామాజిక మాధ్యమాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ నోటీసును ఉపసంహ రించుకున్నారు. బీజేపీ నాయకుడు రాజ్యవర్ధన్ సింగ్ ఆరోపణ ప్రకారం విద్యార్థులంతా కత్తూరులో నిర్వహించిన కార్యక్రమం ఆధారంగా ఉపన్యాసాలు తయారు చేసుకుని ఉపన్యాసాలు దంచాలని నోటీసులో కళాశాల యాజమాన్యం పేర్కొన్నది. యూదుల మీద వ్యతిరేకతను పెంచడానికి సరిగ్గా ఇదే పంథాలో అడాల్ఫ్ హిట్లర్ కూడా జర్మన్లను రెచ్చగొట్టాడని సింగ్ గుర్తు చేశారు.

బహుభాషా నటుడు ప్రకాశ్‌రాజ్ సనాతన ధర్మం మీద అజ్ఞానాన్ని ప్రదర్శించడంలో, అవాకులూ చెవాకులూ పేలడంలో పేరుపొందాడు. ఆఖరికి ఉదయనిధి వివాదం తరువాత తాను వెనుకపడి పోకూడదన్నట్టు ఈ నటుడు సెప్టెంబర్ 10న కర్ణాటకలోని కలుబురిగిలో జరిగిన ఒక సమా వేశంలో అదే ధోరణి ప్రదర్శించాడు. ఎవరైతే సనాతన ధర్మాన్ని నిలబెట్టాలని తీవ్రంగా మాట్లాడతారో వారెవరూ హిందువులే కాదని తీర్పు ఇచ్చేశాడు. హిందుత్వ గురించి, సనాతన ధర్మం గురించి ఏ గాడిద ఏమి వాగినా హిందువులంతా మౌనంగా ఉండాలన్నదే ఇతడి కవి హృదయమనిపిస్తుంది. అసలు వీళ్ల బాధే ఇది. గతంలో రాముడి విగ్రహానికి చెప్పుల దండ వేసినా తలొంచుకు పోయిన హిందువు ఇప్పుడు అంతు చూస్తానని అంటున్నాడు. ఇలాంటి నీచులను న్యాయస్థానాలకు ఎక్కిస్తు న్నాడు. విద్యల దేవత సరస్వతీమాతను నగ్నంగా చిత్రించినా హిందువు కళ్లు మూసుకుని తప్పుకున్నాడే గాని, ప్రతిఘటించలేదు. కానీ ఇప్పుడు కన్నెర్ర చేస్తున్నాడు. సనాతన ధర్మం గురించి సానుకూలంగా మాట్లాడడ మంటే, ఒక దుష్ట రాజకీయాన్ని సమర్థించడమేనన్న విషయాన్ని వాళ్లకి గుర్తు చేయాలని ప్రకాశ్‌రాజ్ అదే

ఇండియా కూటమి ఒక విధ్వంసక కూటమి. దాని అసలు రూపం చాలా తొందరగానే బయట పడుతోందని అర్థం చేసుకోవాలి. ఇది హిందూ ధర్మానికి, సనాతన జీవనానికి బద్ధ శత్రువు. భారత సార్వభౌమాధికారాన్ని నిరంతరం విమర్శిస్తూ అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడేవాళ్లే దీనికి నాయకులు. అత్యవసర పరిస్థితి పట్ల దీనికి ఉన్న మోజు కూడా వెల్లడవుతున్నది.

'రామచరిత మానస్' పేజీలు చింపుతున్న మౌర్య అనుచరులు

వేదిక మీద ఉన్న రచయితలకీ, సామాజిక కార్యకర్తలకీ హితబోధ చేశాడు. ఇలాంటి అజ్ఞానపు మేళమంతా మొదట మాట్లాడేది హిందుత్వం వల్ల పురోగామి దృక్పథం నశించిపోతుందనే కదా! ఈ ధోరణిలో వీళ్లంతా ఇస్లాం మత మౌఢ్యానికీ, క్రైస్తవంలోని అనాకారితనానికీ భద్రత కల్పిస్తున్నారు. బురఖా నుంచి బయటకు రాలేని ముస్లిం స్త్రీ గురించి వీళ్లకి పట్టదు. మహిళలు చదువుకోకూడదని ఫత్వాలు విడుదలవుతున్నాయి. దాని గురించీ మాట్లాడరు. కొన్ని దేశాలలో అసలు పాఠశాల సమీపం వరకు కూడా మహిళను రానివ్వడం లేదు.

విదేశాల సంగతి ఎందుకు ఇక్కడ అనొచ్చు. కానీ అఫ్ఘానిస్తాన్ వంటి దేశాలలో మతోన్మాదులు అమలు చేస్తున్న సంప్రదాయాలనే కదా ఇక్కడ కూడా అమలు చేయాలని చూస్తున్నారు. ఇలాంటి వాళ్లకి మద్దతు ఇవ్వవద్దని మొత్తం భారతదేశం ప్రకాశ్‌రాజ్ వంటి వాళ్లకీ, రచయితల పేరుతో చలామణి అయిపోతున్న కిరాయి మూకలకీ తెలియ చెప్పవలసిన సమయంవచ్చింది. పాస్టర్ తాకగానే సర్వరోగాలు నయం అయి పోతున్నాయని చూసే వేలాది ఏసు మహిమాన్విత వీడియోల గురించి ఈ ప్రకాశ్‌రాజ్ వంటి పక్షపాత రోగులకు తెలియదా? కొబ్బరినూనెను సర్వరోగ నివారిణిగా నమ్మమని చెప్పే క్రైస్తవ సన్యాసినులు, మత గురువుల సంగతేమిటి? పైగా సనాతన ధర్మం అందరికీ విద్య అన్న అంశాన్ని వ్యతిరేకిస్తుందట. ఇప్పుడు ఏ మతంలో అందరికీ విద్య అనే అంశం దారుణ అవమానాలకు గురి అవుతున్నదో ఈ దివాంధులకు తెలియదా? చదివితే ప్రశ్నిస్తారు కాబట్టి అక్షరాన్ని అందనివ్వరు, పేదరికం యథాతథంగా ఉండాలి కాబట్టి చదువుకోనివ్వరు, చదివితే శాస్త్రీయ దృక్పథం పెరుగుతుంది కాబట్టి ఆ పని చేయనివ్వరు ఇలాంటి అరిగిపోయిన రికార్డునే ప్రకాశ్ అక్కడ వేశాడు. అక్కడ కూర్చున్న వాళ్లంతా చదువుకున్న వాళ్లే. ప్రకాశ్‌రాజ్ కూడా చదువుకునే ఉంటాడు. కానీ వీళ్ల దృష్టి ఎంత పాక్షికమో ఈ మాటలను బట్టి అర్థం కావడం లేదా? అసలు ఇతడు స్త్రీలను అవమానించని సినిమాలలో, హీరోయిన్‌నీ, వాంప్‌నీ అర్ధనగ్నంగా చూపించే సినిమాలలో, సూపర్‌మేన్‌ను మించి పోయే హీరో వికృత విన్యాసాలు ఉన్న సినిమాలలో నటించకుండా ఉంటే అదే పదివేలు.

గతంలో ఉత్తర భారతంలో ఈ ధోరణి తక్కువ. కానీ ఇటీవల కాలంలో అక్కడ కూడా ఈ ధోరణి బలిసింది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ నాయకుడు స్వామిప్రసాద్ మౌర్య కూడా హిందూ వ్యతిరేక, హిందూ పవిత్ర గ్రంథాల వ్యతిరేక వ్యాఖ్యలతో పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాడు. ఇతడు హిందూధర్మమే ఒక మిథ్య అంటాడు. రామచరిత మానస్‌లో కొన్ని కులాలను కించపరిచే వ్యాఖ్యలు ఉన్న భాగాలు ఉన్నాయి కాబట్టి వాటిని దగ్ధం చేయాలంటూ కొద్దికాలం క్రితం హడావిడి చేశాడు. అందుకు ప్రయత్నించాడు. ఇతడి మీద కేసులు కూడా నమోదయ్యాయి. ఇతడి వంటి అవకాశవాది రాజకీయాలలో అరుదు. ఇతడు గడచిన యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో మంత్రి. ఇటీవల జరిగిన ఎన్నికలలో టిక్కెట్టు ఇవ్వలేదు. దీనితో సమాజ్‌వాది పార్టీలో చేరాడు. అక్కడ ఎంఎల్‌సీ అయ్యాడు. కాబట్టి హిందుత్వను దూషిస్తే, బీజేపీని వీడి వస్తే వాళ్లు తక్షణమే సెక్యులరిస్టులు అయిపోతారు. విపక్ష శిబిరంలో పెద్ద పీఠమే దక్కుతుంది. మౌర్య కూతురు ఇప్పటికీ బీజేపీ ఎంపీగానే ఉన్నారు. హిందుత్వ మీద మౌర్య చేసిన వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని మాత్రమే సమాజ్‌వాదీ పార్టీ ప్రకటించింది. అంతేతప్ప ఇలాంటి ప్రకటనలు సరికాదని హెచ్చరించలేదు. పార్టీ నుంచి పంపించలేదు.

దేశంలో అత్యవసర పరిస్థితి (1975) నాటి పరిస్థితులు ఉన్నాయని నిరంతరం విమర్శలకు దిగే కాంగ్రెస్ అండ్ కంపెనీ అలవాటు కొద్దీ అత్యవసర పరిస్థితిని అమలులోకి తెచ్చింది. 14మంది టీవీ యాంకర్లను, పత్రికా రచయితలను బహిష్కరించాలంటూ తీసుకున్న నిర్ణయం ఇందుకు సంబంధించినదే. వివిధ చానళ్లలో, వేదికలో వారు నిర్వహించే కార్యక్రమాలకు తాము హాజరు కాబోవడం లేదని ఇండియా సెప్టెంబర్ 15వ తేదీన ప్రకటించింది. ఇది ముందు రోజు తీసుకున్న నిర్ణయం. అత్యవసర పరిస్థితి కాలంలో పత్రికల కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తే, ఇప్పుడు అదే పార్టీ నాయకత్వంలో ఏర్పడిన ఇండియా మరొక రకంగా వారి కార్యక్రమాలను నిలిపివేయాలని చూస్తున్నది. ఆ యాంకర్లు, జర్నలిస్టుల పేర్లను కూడా విడుదల చేసింది. దీనికి న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్ నిరసన తెలిపింది.

ఇండియా కూటమి ఒక విధ్వంసక కూటమి. దాని అసలు రూపం చాలా తొందరగానే బయట పడుతోందని అర్థం చేసుకోవాలి. ఇది హిందూ ధర్మానికి, సనాతన జీవనానికి బద్ధ శత్రువు. భారత సార్వభౌమాధికారాన్ని నిరంతరం విమర్శిస్తూ అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడేవాళ్లే దీనికి నాయకులు. అత్యవసర పరిస్థితి పట్ల దీనికి ఉన్న మోజు కూడా వెల్లడవుతున్నది. క్రైస్తవ మిషనరీలు, ముస్లిం మతోన్మాదం ఈ దేశానికి చేసిన ద్రోహం పునరావృతం కావడానికి మాత్రమే ఈ కూటమి ఉపయోగపడుతుంది. షాహీన్‌బాగ్ మద్దతుదారులు, జార్జి సారోస్ చేతిలో కీలుబొమ్మలు, కుహనా సెక్యులర్ వాదులు దీనికి మార్గదర్శకులు. అందుకే 2024 ఎన్నికలు దేశానికి కీలకం కానున్నాయి. సనాతన ధర్మం మార్పునకు అంగీకరించేది. అది ముస్లిం మతోన్మాదం వంటిది కాదు. అది ప్రపంచ మంతటా మతాంతరీకరణలను ప్రోత్సహించదు. క్రైస్తవం వంటిది కాదు కదా! ఇప్పుడు బీజేపీ మీద వ్యతిరేకత అంటే, బీజేపీని ఓడించడం అంటే సనాతన ధర్మాన్ని ఓడించడమేనన్న నిర్ణయానికి ఇండియా కూటమి వచ్చింది. పేరు బీజేపీది. అసలు లక్ష్యం సనాతన ధర్మం. బహుపరాక్.

కొసమెరుపు: సనాతన ధర్మంపై సమ్యమనంతో మాట్లాడలని డీఎంకే అధిష్టానం ఆదేశించడం ఈ ధర్మంలో తొలి విజయం. ★

కేరళలో మరో దఫా 'నిఫా'

నిన్న కరోనా.. ఇవాళ నిఫా వైరస్.. కేరళను వణికిస్తున్నాయి. ఇప్పటివరకూ మూడుసార్లు కేరళలో నిఫా వ్యాపించింది. ఇది కరోనా కన్నా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది సోకిన వారు మరణించే ప్రమాదం ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్‌కు ఇప్పటి వరకూ మందుకానీ, వ్యాక్సిన్ కానీ లేవు. అప్రమత్తత, అవగాహనతోనే ఈ వైరస్ బారిన పడకుండా ఉండాలి. కేరళలో నిఫా తీవ్రతతో పొరుగు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కరోనా వెలుగులోకి వచ్చినప్పటి నుంచి రకరకాల వైరస్‌లు వెంటాడుతూనే ఉన్నాయి. రెండేళ్లు భయపెట్టి బాధపెట్టిన కొవిడ్ అదుపులో వచ్చిందనే సంతోషం కొంత కాలం కూడా నిలవకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం వెలుగు చూసిన నిఫా వైరస్ బంగ్లాదేశ్ వేరియంట్ అని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

కేరళను నిఫా వైరస్ తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటివరకు ఆరు కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యాధి సోకి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కోజికోడ్ జిల్లాలో మొదలైన వైరస్, 30 నగరాలకుపైగా వ్యాపించింది. ఈ వైరస్ రోజు రోజుకు విస్తరిస్తుండడం పట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేరళ ఆరోగ్యశాఖ పొరుగు రాష్ట్రాలను సైతం అప్రమత్తం చేసింది. వైరస్ ప్రభావిత ప్రాంతాలకు దూరంగా ఉండాలని, అత్యవసరమైతేనే ఆయా ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

సరిహద్దు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటక అప్రమత్తమయ్యాయి. అత్యవసరమైతేనే కేరళకు వెళ్లాలని ఆ ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. సరిహద్దుల్లో పరీక్షా కేంద్రాలు, వైద్య శిబిరాలుకూడా ఏర్పాటు చేస్తున్నాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో నిఫా ప్రబలే అవకాశం ఉంది. ఇందులో కేరళ ప్రధానమైనది. అక్కడ సెప్టెంబర్ 18 వరకూ మొత్తం 1,233 మందిని నిఫా సోకిన వ్యక్తులతో పరిచయాలున్న వారిగా గుర్తించారు. ఇందులో 352 మందిని హైరిస్క్ కాంటాక్ట్‌లుగా గుర్తించింది. వీరిలో ఆరోగ్య కార్యకర్తలు కూడా ఉన్నారు. వీరంతా ఐసోలేషన్‌లో ఉన్నారు.

కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంది. మలప్పురం, కన్నూరు, త్రిసూర్, వాయనాడ్ ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. అధికార యంత్రాంగం అప్రమత్తమై, కోజికోడ్ జిల్లాలోని 7 గ్రామాలను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించింది. వైరస్ కట్టడికి చర్యలు చేపట్టింది. ముందు జాగ్రత్తగా అక్కడి బ్యాంకులు, పాఠశాలలను, ఇతర కార్యాలయాలకు సెప్టెంబర్ 24 వరకూ సెలవు ప్రకటించారు.

నిఫా వైరస్ బంగ్లాదేశ్ వేరియంట్ అని, దీని వ్యాప్తి తక్కువే అయినప్పటికీ మరణాల రేటు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు నమోదైన కేసులన్నీ అటవీ ప్రాంతానికి 5 కిలో మీటర్ల దూరంలోనే ఉన్నాయి. వైరస్‌పై పోరాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. నిఫా ప్రోటోకాల్ ప్రకారం కోర్ కమిటీలో 19 బృందాలను ఏర్పాటు చేసింది., దీనిని 2021, 2023లో సవరించారు. కేంద్ర బృందాలు రంగంలోకి దిగి సంబంధిత అన్ని ప్రదేశాలను సర్వే చేస్తున్నాయి.

నిఫా వైరస్ ఉనికిని కనుగొనడానికి దాదాపు 36 గబ్బిలాల నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. కేరళలో కనుగొన్న వైరస్ ఇండియన్ జెనోటైప్ లేదా ఐ-జెనోటైప్‌గా గుర్తించబడింది. ఇది బంగ్లాదేశ్ రకమని పిలుస్తారు. నిఫావైరస్‌లో రెండు జాతులు ఉన్నాయి – ఒకటి మలేషియా, మరొకటి మరొకటి బంగ్లాదేశ్.

2018లోనే బయటపడింది

మన దేశంలో నిఫా వైరస్ తొలికేసు మే 19, 2018లో వెలుగుచూసింది. అప్పటి నుంచి రాష్ట్రంలో ఈ వైరస్ మూడుసార్లు వ్యాప్తిలోకి వచ్చింది. ఆ తర్వాత మరోసారి 2021లో ఉనికిని ప్రదర్శించింది. 23 మందికి ఈ వైరస్ నిర్ధారణ కాగా, వారిలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలోనే ఈ వైరస్ తరచూ ఎందుకు వెలుగు చూస్తుందనేది స్పష్టంగా తెలియడం లేదు. అయితే, నిఫా వైరస్ వర్షాకాలంలోనే ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కోజికోడ్‌లో నిఫా కేసులు బయటపడటం ఇది



మూడోసారి. ఆ ప్రభుత్వం కూడా ఈ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ వైద్యులతోపాటు, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులకూ నిపుణులతో అవగాహన తరగతులు నిర్వహించింది. ఏ చిన్న అనుమానం వచ్చినా, నిఫా నిర్ధారణ పరీక్షలు చేయడంతోపాటు, ఫలితం తేలేంత వరకు వారిని ఐసోలేషన్‌లో ఉంచేలా చర్యలు తీసుకుంటోంది. కాగా, తాజాగా సోకిన ఈ వైరస్‌ను గుర్తించడంలో కాస్త ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఎంఐఎంఎస్ ఆస్పత్రిలో ఓ రోగి మరణించాడు. దానిని సాధారణ మరణంగా భావించి పెద్దగా పరీక్షించలేదు. మరునాడు మరో ఇద్దరు చిన్నారులు ఇదే లక్షణాలతో ఆస్పత్రిలో చేరేసరికి నిఫా వైరస్ అనే అనుమానం కలిగి వైద్యులు అప్రమత్తమయ్యారు.

కేరళలో నిఫా వైరస్ కారణంగా ఆగస్ట్ 30న తొలి మరణం సంభవించింది. సంబంధిత వ్యక్తి అంత్యక్రియల్లో పాల్గొన్న 17మంది ప్రస్తుతం ఐసోలేషన్లో ఉన్నారు. ఇలా ఉండగా, భవిష్యత్‌లోనూ ఈ వైరస్ కేసులు రాష్ట్రంలో కొనసాగవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

శబరిమల యాత్రికులకు మార్గదర్శకాలు

నిఫా వైరస్ కలకలాన్ని దృష్టిలో పెట్టుకొన్న కేరళ హైకోర్టు, శబరిమల యాత్రికులకు కొన్ని మార్గదర్శకాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంపై ఆరోగ్యశాఖ కార్యదర్శితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డును కోర్టు కోరింది. ప్రతి మలయాళ నెలలో పూజల కోసం శబరిమల ఆలయం ఐదు రోజులపాటు తెరుచుకుంటుంది. మరోవైపు, నిఫా వైరస్ కేసులతో హైఅలర్ట్ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న కోజికోడ్ జిల్లాలో ఇప్పటికే ఆంక్షలు విధించినట్లు , వైరస్ వ్యాప్తి కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు కోర్టుకు వివరించింది.

కొవిడ్ కన్నా ప్రమాదకరం

కొవిడ్-19 కన్నా నిఫా అత్యంత ప్రమాదకరమైందని భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తాజాగా హెచ్చరించింది. కాకపోతే ఇది వేగంగా వ్యాపించకపోవడం ఒక్కటే ఊరటనిచ్చే అంశం. కొవిడ్ కేసుల్లో మరణాలు 2 -3 శాతం మాత్రమే ఉండగా, నిఫా వైరస్‌లో 40-75 శాతం వరకూ ఉంటాయని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ తెలిపారు. కేరళలో నిఫా కేసులు ఎందుకు పెరుగుతున్నాయో తెలియడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ వద్ద 10 మంది రోగులకు సరిపడా మాత్రమే మోనోక్లోనల్ యాంటీబాడీ మందు ఉందని, మరో 20 డోసుల మందులను ఆస్ట్రేలియా నుంచి కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. ఇన్ఫెక్షన్ ప్రారంభ దశలో ఉన్నప్పుడు ఈ మందును వాడాల్సి ఉంటుందని, ఇప్పటికే విదేశాల్లో ఈ వైరస్ బారిన పడిన 14మంది రోగులకు మోనోక్లోనల్ యాంటీబాడీ మందును ఇచ్చారని, చికిత్స తర్వాత వారు పూర్తిగా కోలుకున్నార రాజీవ్ బహల్ తెలిపారు.

నిఫా ఎక్కడ పుట్టింది?

మెదడును అత్యంత తీవ్రంగా దెబ్బతీసే నిఫా వైరస్‌ను 1999లో తొలిసారి గుర్తించారు. ఈ వైరస్‌ను జునోటిక్ వ్యాధి అని కూడా అంటారు. మలేసియా, సింగపూర్‌లోని పందుల పెంపకం దారుల్లో ఈ ఇన్‌ఫెక్షన్ బయటపడింది. దీనికి మలేసియాలోని 'సున్‌గాయ్ నిఫా' గ్రామం పేరు పెట్టారు. ఈ వైరస్ ఆతిథ్య జీవుల జాబితాలో

'కార్టూన్ పోటీ - 2023'లో ప్రోత్సాహక బహుమతికి ఎంపికైనది



పందులు, ఫ్రూట్ బ్యాట్ అనే గబ్బిలాలు, కుక్కలు, మేకలు, గొర్రెలు, పిల్లులు, గుర్రాలు ఉన్నాయి. ముఖ్యంగా ఫ్రూట్‌బ్యాట్స్‌లో ఇవి సహజంగానే ఉంటాయి. వాటిపై ఎటువంటి ప్రభావం చూపించలేవు.

ఎలా వ్యాపిస్తుంది?

జంతువుల నుండి ప్రజలకు ఈ వైరస్ వ్యాపిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పింది. ప్రపంచ వ్యాప్తంగా కలకలం సృష్టించిన కొవిడ్ తరహాలోనే ఇదీ ఉంటుంది. తొలుత జంతువుల నుంచి మనుషులకు సోకుతుంది. కలుషిత ఆహారం ద్వారా, ఈ వ్యాధి బారినపడిన వారి నుంచి ఇది నేరుగా మరో వ్యక్తికి సంక్రమిస్తుంది. ముఖ్యంగా తుంపర్లు, ముక్కు నుంచి, నోటి నుంచి వచ్చే ద్రవాల ద్వారా సోకుతుంది. ఈ వైరస్ లక్షణాలు తొందరగా బయట పడవు. ఈ వైరస్ కొందరిలో మెదడువాపునకు కారణమవుతుంది. ఒకసారి ఈ వైరస్ ఒంట్లోకి ప్రవేశించాక సాధారణంగా నగటున తొమ్మిది రోజుల్లో లేదా 4 నుంచి 15 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి.

నిఫా లక్షణాలు

నిఫా వైరస్ సోకిన వారికి జ్వరం, తలనొప్పి, దగ్గు, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటం, అలసట లాంటి లక్షణాలు ఉంటాయి. ఈ వైరస్ లక్షణాలు స్వల్పంగా ఉండొచ్చు. లేదా ప్రాణాంతకంగా కూడా ఉండొచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఉపిరితిత్తుల్లో స్వల్పంగా సమస్యల నుంచి ప్రమాదకరమైన ఎన్సిఫిలైటిస్ వరకు ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయి. కానీ వ్యాధి ముదిరితే మాత్రం.. ఊపిరి పీల్చుకోవడం కూడా చాలా కష్టమవుతుంది.

తొలుత జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, గొంతు బొంగురు పోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఆ తర్వాత రోగి పరధ్యానంగా ఉండటం, మత్తుగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెదడు దెబ్బతినడం, వణికిపోవడం,

నిమోనియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యాధి తీవ్రత పెరిగిన 24 గంటలు నుంచి 48 గంటల్లో సంబంధిత మనిషి కోమాలోకి జారుకునే ప్రమాదం కూడా ఉందని డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. వైరస్ సోకిన వారిలో దాదాపు 75% మంది మరణించే అవకాశముంది.

వైరస్ బారినపడకుండా ఉండేందుకు పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాతనే తీసుకోవాలని, అలాగే భోజన సమయానికి చేతులను శానిటైజ్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మాస్క్‌లు ధరించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం.

వ్యాధి నిర్ధారణ ఎలా?

నిఫా వైరస్‌ను గుర్తించడానికి ఆర్టీపీసీఆర్ పరీక్షను నిర్వహిస్తారు. దీంతోపాటు పాలిమరైజ్ చైన్ రీయాక్షన్ పరీక్షలో కూడా కచ్చితమైన సమాచారం తెలుస్తుంది. ఈ పరీక్షలో అత్యంత సున్నితమైన మార్పులను గుర్తించే అవకాశం ఉంది. పీసీఆర్ పరీక్షకు ప్రాధాన్యమిస్తారు. ఈ వైరస్ విషయంలో కూడా కరోనా వలే కాంటాక్ట్ ట్రేసింగ్, క్వారంటైన్, ఐసోలేషన్ వంటి చర్యలు తీసుకొంటారు.



చికిత్స, వ్యాక్సిన్ లేనట్లేనా?

నిఫా వైరస్‌కు ప్రస్తుతానికైతే ప్రత్యేకించి ఎలాంటి చికిత్స లేదు. ఇప్పటి వరకు అనుమతి పొందిన ఏ ఔషధం, వ్యాక్సిన్ అందుబాటులోకి రాకపోవడం ఆందోళన కలిగించే విషయమే. ఐసీయూలో పెట్టి చికిత్స మాత్రమే అందిస్తారు. రోగిని వేరుగా ఉంచుతున్నారు. తగినంత నీరు అందిస్తున్నారు. నిఫాపై వాడేందుకు పలు యాంటీవైరల్ డ్రగ్స్‌ను సీఈపీఐ ప్రయోగాత్మకంగా పరీక్షించింది. కానీ, అవి జంతువుల్లో మాత్రమే మంచి ఫలితాలను చూపించాయి. అయితే ఈ వైరస్ తీవ్రత తగ్గించేందుకు మోనోక్లోనల్ యాంటీబాడీ డోసులను వాడుతారు. ఈ వ్యాధి సోకిన 14 రోజులు- 45 రోజుల మధ్యలో వ్యాధి నయమవుతుంది. ఈ వ్యాధి నుంచి కోలుకున్న వారిలో చాలా మంది ఆరోగ్యంగా ఉంటారు. కానీ 20 శాతం మందిలో నరాలకు సంబంధించిన సమస్యలు ఎదురవుతాయని డబ్ల్యూహెచ్ తెలిపింది.

టీకాల పరిస్థితి ఏమిటి?

1999లో వెలుగులోకి వచ్చిన నిఫా వైరస్‌కు ఇప్పటి వరకు ఎటువంటి ఔషధం లేదు. అంతేకాదు టీకాను తయారు చేయలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ టీకా తయారీ ప్రాధాన్యాల బ్లూప్రింట్‌లో నిఫా వైరస్ కూడా ఉంది. నిఫా వ్యాప్తి కేవలం స్థానికంగా పరిమితం కావడంతో దీని టీకాలపై పెద్దగా దృష్టిపెట్టలేదు.

నిఫా వైరస్ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో వెలుగు చూసింది. ఇప్పటికే మలేసియా, భారత్, సింగపూర్, బంగ్లాదేశ్‌ల్లో మనుషులకు సోకింది. అదే సమయంలో కాంబోడియా, ఇండోనేసియా, మడగాస్కర్, థాయ్‌లాండ్, తిమోర్ వంటి దేశాల్లోని గబ్బిలాల్లో ఈ వైరస్ జాడ బయటపడింది. సిలుగురిలో 2001 జనవరి-ఫిబ్రవరి మధ్య 66 నిపా కేసులు నమోదయ్యాయి. వ్యాధి సోకిన ప్రతి నలుగురిలో ముగ్గురు మరణించారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

ఎవరి ప్రాణమైనా విలువైనదే...

వినిమయ సంస్కృతిలో ఏదైనా సరుకే, దేనికైనా ఖరీదు ఉంటుంది... అది ప్రాణమైనా సరే. అందుకే, సియాటిల్‌లో చదువుకుంటున్న మన భారతీయ యువతి జాహ్నవి కందుల ప్రాణానికి అమెరికా పోలీసు అలా వెల కట్టేశాడు. భారతీయుల పట్ల కొంత ఈర్ష్య, అసూయలు ఇటీవలి కాలంలో బాగానే నెలకొం టున్నాయి. అత్యంత క్రమశిక్షణతో చదువును పూర్తి చేసుకొని, ఏదో ఒక సంస్థలో చేరిపోయి, బుద్ధిగా ఉద్యోగాలు చేసుకుంటుంటే సహించలేక పోతున్నారు. ముఖ్యంగా, తమ సంస్కృతికి అను గుణంగా నడచుకోవడం కూడా వారికి సహింప రానిది అయిపోతోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవీ కందుల సౌత్ లేక్ యూనియన్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ క్యాంపస్ విద్యార్థిని. 2021లో స్టూడెంట్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాం కింద బెంగళూరు నుంచి ఆమె యూఎస్ వెళ్లింది. డిసెంబర్‌లో తన డిగ్రీని పూర్తి చేసుకోనుంది. ఆమె అక్కడకు సమీపం లోని థామస్ స్ట్రీట్‌లో నడుస్తుండగా, శరవేగంతో పోలీసుకారు వచ్చి ఆమెను ఢీకొంది. కారును డ్రైవ్ చేస్తున్న కెవిన్ దేవ్ అన్న అధికారి కళ్లు మూసుకుని డ్రైవింగ్ చేస్తున్నట్టున్నాడు. ఎందుకంటే, జాహ్నవిని ఢీకొనే క్షణం ముందు మాత్రమే బ్రేకులు వేయడంతో, వాహనం ఆగలేదు. వేగంగా వాహనం ఢీకొనడంతో ఆమె శరీరం 138 అడుగుల దూరంలో పడింది. ఆమె నడుస్తున్న ఆ వీధిలో ఏ వాహనమైనా 40 కిమీల వేగానికి మించి ప్రయాణించకూడదన్న నియమం ఉంది. అంతేకాదు, పోలీసు వాహనాలు ఈ నియమాన్ని ఉల్లంఘించ వచ్చు కానీ ఎవరి ప్రాణమైనా ప్రమాదంలో ఉన్నప్పుడు కాదు.

ఇదంతా ఒక ఎత్తు అయితే, జాహ్నవి కందుల ప్రాణాలను బలికొన్న పోలీసు అధికారి, ఆమె ప్రాణానికి వెలకట్టేసి, హేళనగా మాట్లాడడం సహించరాని విషయం. 'ఆమె చచ్చిపోయింది. ఓ మామూలు వ్యక్తేలే.ఒక పదకొండు వేల డాలర్లకు చెక్కు రాస్తే చాలు.. ఆమెకు 25 ఏళ్లు ఉంటాయేమో.. విలువ తక్కువేలే' అంటూ గట్టిగా నవ్వుతూ వ్యాఖ్యా నించడం వారి బాడీ కామ్‌లో రికార్డు అయింది. ఆమె జీవితానికి, 'పరిమిత విలువ మాత్రమే ఉంది' అంటూ కెన్ జోకులు వేయడం పట్ల భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ యుఎస్ ప్రభు త్వానికి ఫిర్యాదు చేసింది. కాగా, ఈ వ్యవహారంలో సత్వరమైన, నిజాయితీతో దర్యాప్తు నిర్వహిస్తామంటూ వారు హామీ ఇచ్చారు. జహ్నవి మరణం పట్ల ఆ పోలీసు చూపిన నిర్లక్ష్య వైఖరితో అక్కడి భారతీయ సమాజం ఖంగుతిన్నది. ముఖ్యంగా భారత సంతతికి చెందిన ప్రజా ప్రతినిధులు దీని పట్ల తీవ్రంగా స్పందించారు. మానవ జీవితానికి పరిమిత విలువ ఉంటుందని భావించేవారు ఎవరూ ప్రభుత్వంలో పని చేయరాదని రో ఖన్నా అన్న భారతీయ సంతతికి చెందిన కాంగ్రెస్ సభ్యుడు అన్నారు.

కందుల మరణం పట్ల ఆవేదనను వ్యక్తం చేస్తూ, లేఖ రాసిన సియాటిల్ సిటీ మేయర్ బ్రూస్ హారెల్ సమాజంలో ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలు ఆ మొత్తం సమాజపు భావనలను ప్రతిఫలించవంటూ పేర్కొ న్నారు. ఆ బాధను తాను అర్థం చేసుకోగలనని ఆయన అన్నారు. అలాగే, ఈ కేసును తీవ్రంగా పరిగణించి, దర్యాప్తు చేస్తున్నామని అమెరికాలోని భారత రాయబారి తరణ్‌జిత్ సింగ్‌కు యూఎస్ అధికారులు తెలిపారు. కాగా, భారతదేశంలో జాహ్నవి కుటుంబం శోక సముద్రంలో మునిగి పోయింది. అపురూపంగా పెంచుకున్న కుమార్తె హఠాన్మరణం చెందడంతో జాహ్నవి తల్లి తీవ్ర వేదనతో తల్లడిల్లుతోంది. ఎన్ని కోట్లు ఇచ్చినా, తమ పిల్ల ప్రాణాలకు సరికావంటూ ఆమె కుటుంబ సభ్యులు అన్న మాటలు అక్షరసత్యాలే కదా!

రోడ్డు ప్రమాదాలు కొత్త కాదు. వాటి వెనుక నిజంగానే కుట్ర ఉండకపోవచ్చు. కానీ రోడ్డు ప్రమాదంలో చిక్కి నెత్తుటి మడుగులో ఉన్న మనిషి గురించి ఇంత దారుణంగా వ్యాఖ్యానించడమే, జోకులు వేసుకోవడమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారిపోయింది.

యథాప్రకారం అమెరికా పోలీసులు ఆ పోలీసు మాటలన్నీ వింటే అసలు సంగతి అర్థ మవుతుందని, జాహ్నవిని కించపరిచే ఉద్దేశం అతడికి లేదని వివరణ ఇచ్చారు. అమెరికా పోలీసుల, చాలామంది పౌరుల జాత్యహంకారం గురించి తెలిసిన వారు, ఆ చరిత్రతో పరిచయం ఉన్నవారు ఇలాంటి సంజాయిషీలను అంత తొందరగా విశ్వ సించలేరు. జాహ్నవి ఆత్మకు సద్గతులు కలగాలని ఆశిద్దాం.

- జాగృతి డెస్క్

వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపు రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలను క్షీణింపచేస్తూ, సమాజంలో అశాంతిని కలిగిస్తున్నాయి. దీనికి కారణం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ పథకం అమలులో రూ.241 కోట్ల అవినీతి జరిగిందని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేయడం. ఈ వ్యవహారంలో డబ్బు ఎవరి ఖాతాల్లోకి వెళ్లిందన్న ప్రాథమిక సాక్ష్యాధారాలు సైతం లేకుండా అరెస్టు చేసి విచారణ చేస్తామని ఏపీ సిఐడీ చెప్పడం చట్ట విరుద్ధంగా ఉందని విమర్శలొస్తున్నాయి. ఎవరైనా ప్రాథమిక ఆధారాలు సేకరించి పూర్తి వివరాల కోసం విచారణ చేసేందుకు నిందితులను అరెస్టు చేస్తారు. కాని ఇక్కడ దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. పథకాన్ని అమలుచేసే అధికారులను కాకుండా విధాన నిర్ణయాలను చేసిన ముఖ్యమంత్రిని బాధ్యుడిని చేయడంపై విమర్శలొస్తున్నాయి. సీఐడీ అధికారులు చెప్పిన అంశాలు అసత్యాలని ప్రతిపక్షం వాదిస్తోంది. అయితే, కొన్ని విషయాల్లో సీఐడీ కూడా వాస్తవాలను ఒప్పుకుంది. మొదట సీమెన్స్ కంపెనీ అనేది ప్రభుత్వంతో అగ్రిమెంట్ చేసుకోలేదని చెప్పి చివరికి కొద్ది మొత్తంలో సరుకు కొన్నారని పేర్కొంది. ఆ పథకానికి మంత్రివర్గ ఆమోదం లేదని సీఐడీ చెబుతుండగా, అన్నీ ఉన్నాయని ప్రతిపక్షం చెబుతోంది. ఏకపక్ష వాదన చేస్తున్న సీఐడీ దేనికీ స్పందించడం లేదు.

అవినీతి రట్టు యత్నమా?

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు గమనిస్తే అసలు ఈ కేసులో అవినీతిని బయట పెట్టాలను కుంటున్నారా? లేదా దాని పేరుతో కక్ష సాధింపునకు దిగాలనుకుంటున్నారా? అనే ప్రశ్న ఉత్పన్నమవు తోంది. ఏదైనా అవినీతిని బహిర్గతం చేయాలంటే నిందితుడు అక్రమంగా డబ్బు పొందిన వివరాలు తెలియ చేయాలి. అయితే ఇక్కడ ఆరోపణలే కాని వాస్తవాలు మాత్రం బహిర్గత పరచలేకపోయారు.

ఇటీవల నంద్యాలలో సమావేశం నిర్వహించిన తర్వాత చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసి విజయవాడలోని తమ కార్యాలయానికి తరలించారు. అనంతరం మీడియాతో సీఐడీ చీఫ్ సంజయ్, ఆంధ్రప్రదేశ్ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నాల సుధాకరరెడ్డి వెల్లడించించిన అంశాలు ఇలా ఉన్నాయి:

'కేబినెట్ ఆమోదం లేకుండానే రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్డీసీ)ను చంద్రబాబు ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రాతిపదిక లేకుండా బడ్జెటు ఆమోదించారు. పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలన్న ప్రతిపాదనను బేఖాతరు చేస్తూ ఏక పక్షంగా ఆరుచోట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఏపీ ఎస్ఎస్డీసీ ప్రాజెక్ట్, అందుకోసం ఒప్పందం గురించి సీమెన్స్ కంపెనీకి తెలీదు. చంద్రబాబు కేవలం నిధులు కొల్లగొట్టడానికే ఆ కంపెనీ పేరును వాడుకుని మోసానికి పాల్పడ్డారు. జర్మనీలోని సీమెన్స్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు ఆ జీవో గురించి, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని వెల్లడించింది. ఏపీఎస్ఎస్‌టీసీ చెబుతున్న రూ. 3,300 కోట్ల ప్రాజెక్ట్‌తో తమకు సంబంధం లేదని, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని స్పష్టం చేసింది. తాము 90 శాతం నిధులను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తామని ఎవరికీ చెప్పలేదని.. అసలు ఆ వ్యవహారంతో సీమెన్స్ కంపెనీకి సంబంధం లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా వివరించడంతో పాటు న్యాయస్థానంలో 164 సీఆర్పీసీ కింద వాంగ్మూలం కూడా ఇచ్చింది. సీమెన్స్ కంపెనీ అంతర్గతంగా కూడా దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ఏపీఎస్ఎస్డీసీ, సీఐడీలకు అందించింది. భారత్‌లో సీమెన్స్ కంపెనీ ప్రతినిధిగా ఉన్న సుమన్ బోస్ మరికొందరు నిందితులతో కలసి జర్మనీలోని ప్రధాన కార్యాలయానికి తెలియకుండా ఈ కుట్రలో భాగస్వాములయ్యారని నిర్ధారించింది. ఈ మేరకు సుమన్ బోస్, ఇతరులు డిలీట్ చేసిన ఈ మెయిల్స్, వాట్సాప్ మెసేజ్‌లు మెసేజ్‌లు, ఇతర డాటాను రిట్రైవ్ చేసి సీఐడీకి అందించింది. డిజైన్ టెక్ కొరితే తాము రూ.58.80 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే ఆ కంపెనీకి విక్రయించామని తెలిపింది. ఎవరైనా తమ వద్ద నుంచి సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసుకోవచ్చని, అంత మాత్రాన తాము ఆ ఒప్పందంలో భాగస్వాములమైనట్టు కాదని వెల్లడించింది. సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఇచ్చిన వాంగ్మూలంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కేవలం రూ.58 కోట్ల ప్రాజెక్టును రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌గా చూపిస్తూ చంద్రబాబు భారీగా ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు పన్నాగం పన్నారు. అందుకోసమే జీవోకు విరుద్ధంగా నకిలీ ఒప్పందాన్ని తీసుకు వచ్చారు. డిజైన్ టెక్ అనే కంపెనీని భాగస్వామిని చేశారు. సీమెన్స్ కంపెనీ నుంచి 90 శాతం నిధులు రావని తెలుసు. ఎందుకంటే వారికి అసలు ఒప్పందం గురించే తెలియదు. అందుకే ప్రభుత్వ వాటా 10 శాతం నిధులను నిబంధనలకు విరుద్ధంగా డిజైన్ టెక్ కంపెనీకి చెల్లించి.. పీవీఎస్పీ అనే షెల్ కంపెనీకి మళ్లించి.. అక్కడి నుంచి వివిధ షెల్

సీఐడీ వాదనలను టీడీపీ నాయకులు తోసిపుచ్చుతున్నారు. ఇది ముమ్మాటికి తమ అధినేతపై కక్షసాధింపు చర్యేనని చెబుతున్నారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు కేసులో చంద్ర బాబును అరెస్టు చేసేందుకు సీఐడీ పక్కా ప్రణాళిక రచించి, అప్పటికప్పుడు ఆయనను నిందితుడిగా చేర్చిందని తెలుగుదేశం పార్టీ వాదిస్తోంది. ఆయనపై చేసినవి నిరాధార ఆరోపణలని, కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని తెలిపింది.

కక్ష సాధింపా?

కంపెనీల ద్వారా చంద్రబాబు రూ.241 కోట్లు దక్కించుకున్నారు. జీవోలో పేర్కొన్నట్టు రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ 90 శాతం వాటాలో ఒక్క రూపాయి కూడా రాలేదు. కానీ ప్రభుత్వ వాటా 10 శాతం జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లను డిజైన్ టెక్ కంపెనీకి ఏకపక్షంగా విడుదల చేశారు. దీనిపై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ విషయాన్ని నోట్ ఫైళ్లలో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లు విడుదల చేయాలని అప్పటి సీఎం హోదాలో చంద్ర బాబు ఆదేశించారు. అదే విషయాన్ని అధికారులు నోట్ ఫైళ్లలో స్పష్టంగా పేర్కొంటూ.. సీఎం చంద్ర బాబు ఆదేశాలతోనే నిధులు విడుదల చేస్తున్నట్టు స్పష్టం చేశారు. అనంతరమే నిధులు విడుదల చేశారు. ఈ అవినీతి బయట పడకూడదనే ఉద్దేశంతో ఏపీఎస్ఎస్డీసీ ప్రాజెక్టుకు సంబంధించిన నోట్ ఫైళ్లను ఉద్దేశ పూర్వకంగా గల్లంతు చేశారు. ఏపీఎస్ఎస్డీసీ ఏర్పాటు జీవోకు సంబంధించిన నోట్ ఫైళ్లు, నిధుల విడుదలకు సంబంధించిన ఆదేశాల నోట్ ఫైళ్లను మాయం చేశారు. కానీ సీఐడీ వాటిని రిట్రైవ్ చేసింది. ఏపీఎస్ఎస్డీసీ ఏర్పాటు గురించి జీవో 4, సీమెన్స్‌తో ఒప్పందం గురించి జీవో 5 జారీ చేశారు. కానీ ఆ రెండు జీవోలకు సంబం ధించిన నోట్ ఫైళ్లను మాయం చేశారు. కానీ జీవో 8 ద్వారా అంతకు ముందు ఇచ్చిన జీవోలు 4, 5లలోని అంశాలను సీఐడీ గుర్తించి వెలికి తీయ డంతో ఈ అవినీతి బయటవడింది. షెల్ కంపెనీల ద్వారా దారిమళ్లించిన నిధులు చంద్రబాబు తన ముఠా మనుషుల ద్వారా పొందారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా ఇందులో కీలక పాత్ర పోషించారు. డిజైన్‌టెక్‌కు చెల్లించిన రూ. 371 కోట్లలో రూ.241 కోట్లు వివిధ షెల్ కంపెనీల ద్వారా యోగేశ్‌గుప్తాకు చేరాయి. ఆయన ఆ రూ.241 కోట్లు డ్రా చేసి నగదును మనోజ్ పార్థసానికి ముంబయిలో అందించారు. మనోజ్ పార్థసాని ఆ రూ.241 కోట్ల నగదును హైదరాబాద్ తీసుకువచ్చి చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాసుకు అందిం చారు. ఆయన ఆ నగదును చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.

సీఐడీ నమోదు చేసిన కేసుపై విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం పది గంటల పాటు సుదీర్ఘంగా విచారించింది. ఇరుపక్షాల వాదనలను పూర్తిగా ఆలకించింది. అనంతరం ఏపీఎస్ఎస్డీసీ ప్రాజెక్టులో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారనడానికి పూర్తి ఆధారాలు ఉన్నాయని సంతృప్తి చెందడంతోనే ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది.'

పక్కా ప్రణాళికతోనే: టీడీపీ

అయితే సీఐడీ వాదనలను టీడీపీ నాయకులు తోసిపుచ్చుతున్నారు. ఇది ముమ్మాటికి తమ అధినేతపై కక్షసాధింపు చర్యేనని చెబుతున్నారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు కేసులో చంద్ర బాబును అరెస్టు చేసేందుకు సీఐడీ పక్కా ప్రణాళిక రచించి, అప్పటికప్పుడు ఆయనను నిందితుడిగా చేర్చిందని తెలుగుదేశం పార్టీ వాదిస్తోంది. ఆయనపై చేసినవి నిరాధార ఆరోపణలని, కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని తెలిపింది. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు వల్ల కొన్ని లక్షల మంది ప్రయోజనం పొందారని, దానిలో చంద్రబాబుకు దురుద్దేశాలు ఆపాదించేందుకు వీల్లేదని పేర్కొంది. ఆయన ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందినట్టు

వేల్లూరు జయప్రకాష్ నారాయణ

దర్యాప్తు సంస్థలు నిరూపించలేకపోయాయని న్యాయస్థానం ముందు చంద్రబాబు తరుపు న్యాయ వాదులు వివరించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల కేసు ఎఫ్ఐఆర్‌లో అసలు చంద్రబాబు పేరు లేకుండా సీఐడీ అధికారులు ఆయనను ఎలా అరెస్టు చేస్తారని వాదించారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 40 నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో 2.30 లక్షల మంది శిక్షణ పొందారు. ఆ కేంద్రాల్లో నెలకొల్పిన సౌకర్యాలపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ ఆడిటింగ్ చేయిం చారు. దానిపై పలువురు ఐఏఎస్ అధికారులు, నిపుణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేశారు. వారు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అన్నీ సవ్యంగా ఉన్నాయని నిర్ధారించాకే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అలాంటప్పుడు అవకతవకలకు తావే లేదని న్యాయాధికారి దృష్టికి తెచ్చారు.

మంత్రి మండలి నిర్ణయాన్ని తప్పుపట్టడమా?

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐడీ దర్యాప్తు తీరు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందనేది సర్వత్రా వినిపిస్తున్న అంశం. మంత్రివర్గ నిర్ణయాన్ని తప్పుబట్టే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉండదని రాజ్యాంగ నిపుణులు సైతం అంటున్నారు. అమలు తీరులో తప్పులు జరిగితే సంబంధిత అధికారినే బాధ్యుడిని చేయాలని, ముఖ్యమంత్రిని లేదా మంత్రిని నిందించడం రాజ్యాంగ విరుద్ధమే అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

వ్యాసకర్త: చైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ

ఆదర్శ 'జనకుడు'

రామాయణంలో జనక మహారాజు మనకు కనిపించేది కొన్ని సందర్భాలలోనే అయినప్పటికీ ఆయనది చాలా కీలకమైన పాత్ర. ఆయన ఆదర్శపాలకుడు, తండ్రి, సోదరుడు, మామగారు కూడా. ఏ పాత్రలో ఎలా ఉండాలో, ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలిసిన ఆత్మజ్ఞాని, వివేకవంతుడు. పరిపాలనా వ్యవహారాలు, కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే తామరాకు మీద నీటిబొట్టులా జీవించిన మహా తాత్వికుడు. స్వభావంలో దశరథ మహారాజుకు పూర్తి భిన్నం అయినవాడు. రాముడి ధర్మాచరణకు ఆయన కన్నతండ్రి అయిన దశరథుడెంతటి స్ఫూర్తిప్రదాతో, పిల్లనిచ్చిన మామగా జనకుడు కూడా అంతటి స్ఫూర్తిమంతుడు. సాక్షాత్తూ, శ్రీమహావిష్ణు స్వరూపుడయిన రాముడి కాళ్లు కడిగి కన్యాదానం చేసిన భాగ్యశాలి.

యజ్ఞం చేయడం కోసం భూమిని దున్నుతున్న జనక మహారాజుకు నాగేటిచాలులో ఒక పేటికలో ఆడశిశువు దొరికింది. సంతానం లేని తనకు ఆ శిశువు దొరకడం భగవత్ప్రసాదంగా భావించాడు. ముద్దులు మూటగడుతున్న ఆ శిశువుకు సీత అని పేరు పేరుపెట్టారు. జనక, సునయన దంపతులు ఆమెను దొరికిన బిడ్డగా భావించక, కన్నబిడ్డ కన్నా మిన్నగా ఎంతో అపురూపంగా పెంచారు. సీత దొరికిన తర్వాత ఊర్మిళ జన్మించింది. అయినప్పటికీ, సీతమీద అతడి ప్రేమాభిమానాలలో గాని, చూసే దృష్టిలో లవలేశమంత మార్పుగానీ లేదు. నిజం చెప్పాలంటే కన్నకూతురు ఊర్మిళ కంటే సీతనే ప్రాణాధికంగా ప్రేమించిన ఆదర్శ 'జనకుడు'.

తమ ఇంట తరతరాలుగా పూజలందుకుంటున్న శివ ధనుస్సును వందలాది అమిత బలాఢ్యులు అతికష్టంపై ఎత్త గలుగుతారు. అలాంటిది, సీత అవలీలగా జరిపిందని తెలుసుకున్న జనకుడు ఆమె శక్తి సామర్థ్యాలకు ఆశ్చర్య చకితుడవుతాడు. ఆమె సామాన్యురాలు కాదని గ్రహించి, ఆ విల్లును ఎక్కు పెట్టగలిగిన వాడినే ఆమెకు సరిజోడుగా తేవాలనుకుంటాడు. అలా స్వయంవరం ప్రకటిస్తాడు. ఎందరెందరో రాజులు ధనుస్సును ఎక్కుపెట్టేందుకు విఫలయత్నం చేస్తారు. అప్పుడు విశ్వామిత్రుడి ఆశీర్బలంతో రాముడు ఆ ధనుస్సును ఎక్కుపెట్టగా, ఫెళఫెళ మంటూ విరిగిపోతుంది. జనకుడు అమితానందభరితుడై, దశరథ మహారాజుకు విషయాన్నంతటినీ తెలియజేసి సగౌరవంగా వెంటబెట్టుకుని రమ్మంటూ తన పరివారాన్ని, ముఖ్యులను అయోధ్యానగరానికి పంపుతాడు. ఇక్కడే తెలుస్తుంది ఆయన సంస్కార వైభవం.

సీతారాముల కల్యాణంతో పాటు, ఊర్మిళను లక్ష్మణుడికి, ఇతర సోదరుల కుమార్తెలు మాండవి, శ్రుతకీర్తిని భరత శత్రుఘ్నులతో పరిణయం చేస్తానని చేసిన విన్నపానికి, దశరథుడు ఆనందంగా అంగీకరిస్తాడు. అంగరంగవైభవంగా కల్యాణం జరిపిస్తాడు.

'భగవాన్' భాష

❋ తాత్వి'కత' ❋

భగవాన్ రమణ మహర్షి దర్శనం కోసం రమణాశ్రమానికి కశ్మీర్ నుంచి ఒకరొచ్చారు. ఆయన వెంట ఉన్న నౌకరుకి మాతృభాష కశ్మీరి తప్ప ఇంకొకటి తెలీదు.

ఓరోజు రాత్రి అక్కడున్న మందిరంలో చీకటి అలుముకుంది. ఓ లాంతరు మాత్రం వెలుగుతోంది. అదీ గుడ్డిదీపంలా ఉంది. అప్పుడు నౌకరు రమణమహర్షి వద్దకొచ్చి ఆయనకు నమస్కరించి. తనలోతాను మాతృభాషలో ఏదో అనుకుంటున్నాడు. కాస్సేపు తర్వాత అతను రమణులవారికి నమస్కరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు రమణ మహర్షిని కలిసిన కశ్మీరి అతను 'భగవాన్! మీకు కశ్మీరీ భాషలో మాట్లాడటం వచ్చని నాకు చెప్పనే లేదు కదండీ' అన్నాడు. దానికి రమణులవారు 'నాకు నీ భాషలో ఒక్క మాట కూడా తెలీదుగా. నువ్వెందుకు అలా అడుగుతున్నావో నాకు తెలీడం లేదు' అన్నారు.

అప్పుడు ఆ వ్యక్తి 'నాతో వచ్చిన నౌకరు నిన్న రాత్రి పలు ప్రశ్నలు కశ్మీరీ భాషలో అడిగారు. ఆ ప్రశ్నలకు మీరు ఆ భాషలోనే జవాబిచ్చారు. అతని సందేహాలను నివృత్తి చేశారు. ఈ విషయం నా నౌకరు నాతో చెప్పాడు' అని వివరించాడు. నిజమైన ఆసక్తితో జవాబులు ఆశించే వారికి నిజమైన జ్ఞానుల మౌనం కూడా మాట్లాడే భాష కావచ్చు అనడానికి ఈ సంఘటన ఒక ఉదాహరణ. ★

దోర్బల పూర్ణిమాస్వాతి

రాముడికి సీతను కట్టబెడుతూ జనకుడు పలికిన పలుకులు 'ఇయం సీతా' ఇదిగో ఈమె సీత. సీతా... ఇదేం పేరు అని యెంచకు. ఈమె నాగేటిచాలుకి తగిలి, తనకు తానుగా పైకి లేచిన బాలిక. అయోనిజ. ఈమె సీత అని, నాకు కూతురు అవుతుందని అశరీరవాణి చెప్పింది. ఏ ఫలాపేక్ష లేక, కర్షకునికి భూమాత ఎట్లు ఫలములను కలిగించునో, అట్లే నా సీత కూడా ఫలాపేక్ష రహితంగా నీ ధర్మస్థాపనలో సహకరిస్తుంది. తల్లి భూదేవి వలెనె సహనంతో నీకు సహకరిస్తుంది. నీవు ఎట్లు నీ తండ్రి వాక్యం శిరసావహించి పాలించుచున్నావో, ఈమెయూ నీ వాక్యం పాలించి, నీవు నిర్వహించు ధర్మకార్యములన్నింటిలో నీకు తోడై యుండును. నీకు సహ ధర్మచారిణియై సహకరించడానికి అవతరించింది. ఈమెను నీవు స్వీకరించి, ధర్మస్థాపన చేయి' అంటాడు జనకుడు. మన హిందూ వివాహపద్ధతిలో వధూవరులు గృహస్థాశ్రమంలో ఆచరించవలసిన వాటిలో ధర్మానికే ప్రాముఖ్యం ఉంది. అందుకే వధువు తండ్రి వరునితో వివాహఘట్టమందు – 'నాయనా! ఈమె నా కుమార్తె. ఈమెను నీ భార్యగా స్వీకరించు. నీవు చేసే సకల ధర్మాచరణలయందు సహధర్మచారిణిలా నిన్ను అనువర్తిస్తుంది. నా కుమార్తె చేతిని అందుకుని, ప్రేమగా చూసుకో' అని వరునికీ, అలానే వధువునకు' – తల్లీ! నీవు నీ భర్తని ఛాయలా అనుసరించు. అతని పనులలో సహకరించు' అనే సందేశం ఉంటుంది.

జనకుడు అంటే తండ్రి అని అర్థం. ఆయన సీతకు మాత్రమే తండ్రి కాదు, సర్వులకు తండ్రే. ముఖ్యంగా వధువులందరికి ఆయన తండ్రే. కన్యాదానం చేస్తూ ఆయన చెప్పిన శ్లోకంలోని సందేశం వధూవరులందరికీ ఆచరణీయం. ఆ తర్వాత సీత రామునితో అడవులకు వెళ్లే సమయంలో కానీ,మరే ఇతర సందర్భంలో కానీ జనకుడి గురించిన ప్రస్తావన మనకు కానరాదు. ఏ పాత్రను ఎంతటితో ముగించాలో, ఏ పాత్రను ఎలా పండించాలో వాల్మీకి మహర్షికి బాగా తెలుసన్నది ఇక్కడ స్పష్టం అవుతోంది. ★



❄ పెరటి బంగారం ❄

చేదు శాకంలో ఔషధ గుణాలు మెండు

కాకరకాయను చూడగానే ముఖం చిట్లిస్తారు చాలామంది. కారణం దానిలో ఉండే చేదు. అయితే దానిని ఇష్టంగా తినేవాళ్లు కూడా ఉంటారనుకోండి. వాస్తవానికి కాకర చేదుగా ఉన్నా అది పనిచేసే గుణం చాలా ఎక్కువ. పెళుసుగా, గరకుగా ఉండే పైపొరతో చూడానికి ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటుంది కటిక చేదుగానూ ఉంటుంది. అయితే పుష్కలమైన ఔషధ గుణాలను కలిగి ఉన్న కాకరకాయ జ్వరాన్ని కూడా తగ్గిస్తుంది. ఆకలిని పెంచుతుంది. కడుపునొప్పిని తగ్గిస్తుంది. నులిపురుగులను సైతం నశింపజేయగల ఔషధంగా పనిచేస్తుంది.

శరీరంలో ఉన్న అధిక కొవ్వును తగ్గించడంలో ఇది చక్కగా పనిచేస్తుంది. ఇది విటమిన్–ఎ, రిబోఫ్లావిన్, విటమిన్–సి ధాతువులు ముఖ్యంగా ఐరన్ వంటివి సహజంగా ఉన్న కూరగాయ. మలబద్ధకాన్ని నివారించే గుణం ఉన్నది. కేన్సర్ లాంటి దీర్ఘవ్యాధులను అరికట్టడంలో చాలా ఉపకరిస్తుంది. సోరియాసిస్ వ్యాధిని నివారించడంలో మంచి ఫలితాలను ఇస్తుంది. కాకరను వీలైనంత ఎక్కువగా తింటే రోజు విడిచి రోజు తింటుంటే రక్తప్రసరణ చక్కగా జరిగి, కొవ్వు కరిగి,అధిక బరువు తగ్గుతారు. రక్తపోటు కూడా నియంత్రణలో ఉంటుంది. వారంలో ఒకసారి బెల్లం, చింతపండుతో వండిన కాకరకాయ కూర తింటే ఆకలి పెరిగి, అజీర్ణం తగ్గతుంది. అలవాటు తక్కువగా ఉన్నవాళ్లు మెల్లగా కాకరకాయను కూరగా అలవాటు చేసుకుంటుంటే అందులో రుచి పెరుగుతుంది. కాకర కాయ రసం చేదుగా ఉన్నా..ఈ చేదే ఎన్నో ఔషధాల సమ్మేళనం.ఇందులో బీ,సీ విటమిన్లతో పాటు పొటాషియం, మెగ్నిషియం, సోడియం, ఫాస్పరస్ వంటి ధాతువులు ఉన్నాయి. కాల్షియం ఆకుకూరల్లోకంటే కాకరలో రెండింతలు అధికంగా ఉంటుంది.

కాకరకాయ రసంతాగడం వల్ల డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. గ్లూకోజ్ స్థాయిలు కంట్రోల్ అవుతాయి.కాకరకాయ జ్యూస్‌లో ఉండే ఔషధ గుణాలు ఇన్సులిన్‌లా పనిచేస్తాయి. కంటి శుక్లం, దృష్టి లోపం సమస్యల నివారిణిగా పనిచేస్తుంది. అతిసారం, నులిపురుగులు, గజ్జి, తామర వంటి చర్మవ్యాధులకు ఔషధంగా ఉపయోగపడతాయి. శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అలెర్జీలు దరి చేరవు. వైరస్, బాక్టీరియాపై పోరాడుతుంది. ముఖ్యంగా మహిళల్లో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

తాజాగా తీసిన కాకర పసరును, నీళ్లతో కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే కామెర్ల వ్యాధి తగ్గుతుంది. రసంలో చేదు తగ్గాలంటే కొంచెం నిమ్మరసం కలుపుకుని తాగితే మంచిది.

ఈసారి కాకరకాయలు తెచ్చినప్పుడు వాటిలోని పండిన కాకర గింజలను పెరట్లో పాతి చూడండి. కుండీలలో లేదా సిమెంట్ గోతంలో మట్టి నింపి పెట్టినా కాకర బాగా పాతుకుంటుంది. ప్రయత్నం చేసి చూడండి. ★

"అలాగా..."

"ఏమీ తెలియనట్లు మాట్లాడొద్దు. నేను భువనకి సర్‌ప్రైజ్ ఇద్దాం అనుకున్నాను"

"ఇప్పుడయినా ఇవ్వవచ్చు. అమ్మకు తెలియదు. మళ్లీ మాట్లాడతా" తులసి వసుంధరకి చేసింది. స్విచ్డాఫ్.

ఇప్పుడు కారులో వెళ్తున్నారు. ఇంకోసారి ప్రయత్నం చేసింది. చివరికి మెసేజ్ చేసింది. నేను ఇండియా చేరుకున్నాను. ప్రస్తుతం ముంబయ్‌లో ఉన్నాను అంటూ...

ఇంటికి కాస్త దూరంలో కారు ఆపాడు ప్రభాత్.

"మీరు వెళ్లండి. లగేజ్ విషయం నేను చూస్తాను".

తులసి ఇంటికేసి కదిలింది. లాన్‌లో పని చేసుకుంటున్న వారు తులసిని చూడగానే ముందు నమ్మలేదు. చేతులు జోడించారు. చిన్నగా చిరునవ్వుతో తలూపి వెళ్లి డోర్ బెల్ మోగించింది.

అప్పుడు గాజుల చప్పుడు వినిపించింది.

మెల్లగా తలుపులు తెరుచుకున్నాయి.

భువనేశ్వరికి కొద్ది క్షణాలు అర్థం కాలేదు. ఆ తర్వాత నోటి వెంట మాట రాలేదు. క్రమంగా తేరుకుంది.

"నువ్వేనా అమ్మా" అంది.

"నేనే భువనా!"

"ఇప్పటికి మేం గుర్తు వచ్చామా?"

"గుమ్మం ముందు నుంచి తగాదాలు అవసరం లేదు భువనా...ఈ ఓల్డ్ లేడ ఎన్ని గంటలు ఈ ప్రయాణం చేసి వచ్చిందో గుర్తు చేసుకో".

"నీ లగేజ్ ఏది?"

"ప్రభాత్ ఆ సంగతి చూస్తున్నాడు".

"అంటే ఇంట్లో అందరికీ తెలుసు. నా దగ్గర మాత్రం రహస్యం".

"ప్రతి దాన్నీ ఇలా సమస్య చేయకు భువనా?"

"వసుంధర గారు రానిచ్చారా?"

"నన్ను ఒకరు రానిచ్చేదేమిటి! నువ్వు మాత్రం నన్ను లోపలకి రానిచ్చావా? గుమ్మం ముందు నిలేయలేదూ..."

"నువ్వు మా ఇంటికి వస్తావనుకోలేదమ్మా" అని ఏడ్చేసింది. అప్పుడు తులసికీ కళ్లు తడిసిపోయాయి. భువనను దగ్గరికి తీసుకుంది. ఆ దృశ్యాన్ని చూస్తూ ప్రభాత్ కర్చీఫ్‌ని ముఖానికి అడ్డుగా పెట్టుకున్నాడు.

కొంతసేపటి తర్వాత ఇద్దరూ విడివడ్డారు. లగేజ్‌ని పనిమనిషి కింద ఉన్న గదికి తీసుకుని వెళ్తోంది.

"స్నానం చేస్తావా? ముందు కాఫీ గాని, జ్యూస్ గాని తీసుకుంటావా?"

"కంగారుపడకు. నేను ఇక్కడ ఉంటున్నాను. మనం తీరిగ్గా మాట్లాడుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి" అని గది లోపలకి వెళ్లింది.

ఒకప్పటి తమ గది అది. అలా ఖాళీగా ఉంచారు.

"మనుషులందరూ మంచి వారే. భావోద్వేగాలకు గురవుతుంటారు. అప్పటి నుండి కోపం, కసి, నిస్సహాయతతో వచ్చిన ఆవేశాలు పెంచుకుంటారు. అయినా నేను ఇంతకాలం ఆలోచించలేకపోవటం నా బలహీనత. వసుంధరకి, భువనకీ చిన్న తేడా వుంది. వసుంధర గుంభనగా ఉంటుంది. దీనికి ప్రేమ వచ్చినా, కోపం వచ్చినా దాచుకోవటం చేతకాదు. అప్పటికప్పుడు బయటపడుతుంది" అనుకుంది.

ఓ రకంగా అదీ మంచిదే అనుకుంది.

* * *

శ్వేత హైదరాబాద్ నుండి ఇంటికి చేరుకుంది.

అప్పటికి శ్రీనివాస్ కూడా ఇంట్లో ఉన్నాడు. అమ్మ కేసి చిరునవ్వుతో చూసింది. తను ముభావంగా నవ్వింది తప్ప మాట్లాడలేదు. స్నానం చేసి, భోజనం చేసాక అప్పుడు తన గదికి వెళ్లబోతుంటే శ్రీనివాస్ పిలిచాడు-మనం కొంచెం సేపు మాట్లాడుకుందాం అంటూ...

"నువ్వు హైదరాబాద్ నుండి వస్తున్నావని మాకు తెలుసు. నువ్వు హైదరాబాద్ వెళ్లటం తప్పు అనటం లేదు. కనీసం ఓ మాట చెప్పాలి కదా... చెబితే వద్దంటాం అనుకున్నావా" అన్నాడు శ్రీనివాస్.

"అలాంటిదేం లేదు. నేను చెప్పి ఉండాల్సింది. నాది తప్పే".

"ఇలాంటప్పుడే సమస్యలు వస్తాయి. ఆద్య జైపూర్



ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

19

వెళ్లినప్పుడు ఇలానే చేసింది" అంది స్వప్న.

"ఇందులో ఆద్య తప్పు లేదమ్మా... ముందు ఇంట్లో చెప్పింది. మనం ఓ పక్కనే మాట్లాడకూడదు".

"నువ్వు నీ చెల్లిని చూడటానికి వెళ్లావు. అటు నుండి పిన్ని దగ్గరకు వెళ్లావు. మంచిదే... ఇప్పుడు నీకు గాని, ఆద్యకు గాని మీ తాత సమస్య ఎందుకు వచ్చింది. పిన్నిని ఎందుకు అడిగావు?"

"తాత గురించి అడిగితే తప్పా? ఆయన మన ఇంటి సభ్యుడు కాదా? ఇదేంటి నాన్నా... ఇంత ద్వేషం పెంచుకోవటానికి ఆయన మన శత్రువా?"

"అవన్నీ ఇప్పుడెందుకు? మీరు చదువుకుంటున్నారు. మీ బాధ్యతలు మీరు పూర్తి చేయండి" అన్నాడు శ్రీనివాస్.

"మేం చదువుకుంటున్నాం కాబట్టి కాస్త జ్ఞానం వచ్చింది. బంధువులు, స్నేహితులు అసలు మీ మధ్య ఏం జరిగింది అని మా ఇద్దరినీ కూడా ఇప్పటికీ అడుగుతుంటారు. మాకు తెలియదు అని చెబుతున్నాం".

"ఇప్పుడూ అదే చెప్పండి" అంది స్వప్న.

"అయినా మీకు తెలియకుండా ఎలా ఉంటుంది అంటారు. మనందరం అనామకులం కాదు కదా!"

"లక్ష మంది లక్ష రకాలుగా అనుకుంటారు. అవన్నీ మనం పట్టించు కుంటామా?" అంది స్వప్న.

"అంటే మేం కూడా లక్షమందిలో ఇద్దరం అంటావు?"

శ్రీనివాస్‌ని చూసింది స్వప్న.

"మీరు ఎవరి విషయాలూ పట్టించుకోవటం లేదా? మనం సమాజంలో బతుకుతున్నాం అమ్మా..."

"నువ్వు మాకు పాఠాలు నేర్పుతున్నావా?" అన్నాడు శ్రీనివాస్.

"పాఠాలు నేర్పండి మాకు అంటున్నాను".

"నీకు బాగా తెలివితేటలు పెరిగిపోయాయి" స్వప్న.

"ఐ.ఎ.యస్. కాబోతుందిగా" శ్రీనివాస్.

"మనం మాట్లాడుకుందాం అని మీరు అన్నారు. అందుకని ఇక్కడ కూర్చున్నాను. మీరు ఈరకంగా మాట్లాడటం నాకు నచ్చదు".

"అసలు నీ ప్రాబ్లమ్ ఏమిటి?"

"తాతగారికి, మీకూ మధ్య ఏం జరిగింది అన్నది నాకు కావాలి. నిజంగా తాత మనకు అన్యాయం చేసి ఉంటే మీకంటే ఎక్కువగా నేనూ, ఆద్య కూడా వ్యతిరేకిస్తాం. ఇప్పటి వరకు తాతతో రిలేషన్ వద్దు అన్నారు. మీకు అభిప్రాయ భేదాలు ఉంటే మేం ఎందుకని మాట్లాడకూడదు. మేం ఎందుకు తాతని చూడటానికి వెళ్లకూడదు"

''నా అనుమానం అక్కా-చెల్లి మనకు తెలియకుండా తాతని కలుస్తున్నారు. ఇవి అక్కడి నుండి వస్తున్న ప్రశ్నలు".

"అమ్మా... నువ్వు పొరపాటు మాట్లాడుతున్నావు. మేం తాతగారిని ఇంత వరకు కలవలేదు. ముందు ఆ మాటలు విత్ డ్రా చేసుకో" అంది సూటిగా.

ఇద్దరూ నిర్ఘాంతపోయారు.

"బెదిరిస్తున్నావా?" ఆశ్చర్యంగా స్వప్న.

"ఇది బెదిరింపా! ఇంతకు ముందు మాకు చెప్పకుండా ఎందుకు వెళ్లావు అన్నారు. అది నా తప్పు అన్నాను. మన ఎదురుగా లేని మనిషి గురించి

పి. చంద్రశేఖర ఆజాద్

9246573575

ఇష్టం వచ్చినట్లు మాట్లాడవచ్చా? చాలా క్లియర్‌గా అడుగుతున్నాను. మీరు తాత నుండి విడిపోయి నప్పుడు ఆస్తులు ఎందుకు పంచుకున్నారు. ఇది ఆయన సంపాదించిందే కదా!"

మళ్లీ షాకయ్యారు.

"తాత ఎవరయినా కావచ్చు. ఆయన లక్ష తప్పులు చేసి ఉండొచ్చు. కానీ నీకూ-పిన్నికీ ఆయన కన్న తండ్రి. అది మరిచిపోవద్దు. ఆయన మంచి మనిషి కాబట్టి మీకు ఆస్తులు పంచాడు. ఖాళీ చేతుల్తో ఇంటి నుంచి పంపలేదు. కొన్ని రోజులు కోపం ఉంటుంది. అది శాశ్వతం చేసుకుంటారా?"

"కూతుర్లు సరే. కట్టుకున్న భార్య వారికి దూరంగా ఎందుకు ఉంది. అది మేం చేసిందా?" అన్నాడు శ్రీనివాస్.

"ఇప్పుడు పాయింట్‌కి వస్తున్నారు. అమ్మమ్మకి కోపం వచ్చింది. అందుకు ఏదో జరిగింది. అదేంటో చెప్పమంటే మీరు చెప్పరు. ఇప్పుడు అమ్మమ్మ పరిస్థితి

గది లోపల ఆద్య నుండి తీసుకు వచ్చిన పుస్తకం చదువుతోంది శ్వేత . అప్పటి వరకు అయిన మాటల యుద్ధం ఇప్పుడు గుర్తు రావటం లేదు. నవలలో అలా లీనం అయిపోయింది. ఓ తాత, ఇద్దరు మనవరాళ్లు... చదువుతుంటే తమ బాల్యంలో జరిగిన విషయాలు గుర్తు వస్తున్నాయి.

అందరి బాల్యంలో ఇలాంటి పోలికలు ఉంటాయా అనుకుంది.

గది బయట...

అప్పటికప్పుడు స్నప్న ఓ నిర్ణయం తీసుకుంది.

"నేను అమ్మకు ఫోన్ చేస్తున్నాను శ్రీనివాస్" అంది.

ఇద్దరూ తమ గదికి వెళ్లారు. ఫోన్ చేసారు.

"అమ్మ... ఎక్కడ ఉన్నావు?" అంది.

"కాశీలో ఉన్నాను స్వప్నా..."

"ఇక్కడ పరిస్థితులు అంత బాగుండలేదు. నువ్వు వెంటనే బయలుదేరి వస్తే బాగుంటుంది".

ఇప్పటివరకు ఏం జరిగిందో అది జరిగింది. అవన్నీ మనందరం మరిచిపోతే బాగుంటుంది ప్రభాత్. నేను భువనకి కూడా అదే చెబుతున్నాను. మనందరం కొన్ని తప్పులు చేసాం. అది ఒప్పు కోవటానికి నేను సిగ్గుపడను. అంతే కాదు. చిన్న పిల్లల నుండి పెద్దవాళ్ల దాకా అందరినీ క్షమించమని అడగటానికి నేను వచ్చాను. ఇప్పుడు ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. సరయూ పెళ్లి అయిపో యింది. ఇంక రసజ్ఞ మిగిలింది.

ఏంటి? గుళ్లూ-గోపురాలు తిరుగుతోంది. అయినా ప్రశాంతత లేదు. ఓ మనిషిని అక్కడ, ఇంకో స్త్రీని ఇక్కడ ఒంటరిగా బతకమని వదిలేసారు. ఏం... మీ ఇద్దరి మధ్య గాని, పిన్ని, బాబాయి మధ్య అభిప్రాయ భేదాలు లేవా? ఎవరిని ఇంకొకరు ఒక్క మాటయినా అనుకోలేదా? మీరు ఎందుకు కలిసి ఉంటున్నారు?"

"ఇంక చాలు. ఆపు" అరిచాడు.

"మాట్లాడటం మొదలు పెట్టింది మీరు..."

"మళ్లీ చెబుతున్నాను. ఇంకా మాట్లాడితే చాలా దూరం వెళ్తుంది".

"ఇప్పుడు అర్థం అయింది. వాదనలో బలం లేనప్పుడు ఎదుటి వారి నోటిని మూయిస్తారు. కోపాలు వస్తాయి. ఈ కోపాలు, ఈ మాట పట్టింపులు మన కుటుంబాన్ని ఇలా నాశనం చేసాయి. మమ్మల్ని బెదిరించటం కాదు. మీరు ఆలోచించుకోండి. ఆ తర్వాత మీరు ఎంత దూరమైనా వెళ్లండి. మేం మేజర్లం. మాకు కూడా కొన్ని ఆలోచనలు ఉంటాయి" అని అక్కడి నుంచి విసురుగా వెళ్లి గది తలుపులు మూసి లాక్ చేసింది.

జోరున వర్షం కురుస్తున్నట్లుగా వుంది.

ఇద్దరూ శిలల్లా నిలబడి రగిలిపోతున్నారు.

* * *

"నాకు ఇక్కడి నుంచి రావాలనిపించటం లేదు స్వప్నా... నాలాంటి వారు ఇక్కడ చాలామంది వున్నారు. చావు కోసం ఎదురు చూస్తూ... ఇప్పుడు నాకు బతుకు మీద మమకారం లేదు. ఉన్నన్ని రోజులూ ఇక్కడే ఏదన్నా ఆశ్రమంలో చేరాలని ఉంది".

ఆమె మాటలు స్పీకర్‌లో శ్రీనివాస్‌కి వినిపిస్తు న్నాయి. ఇద్దరి ముఖాల్లో నెత్తురు చుక్క కనిపించటం లేదు.

"అయినా అక్కడ ఏం జరుగుతోంది? ఆ సమస్య లేవో మీరే పరిష్కరించు కోండి స్వప్నా".

"అమ్మా విను... ప్లీజ్ విను. ఇంతకు ముందు జరిగిన యుద్ధం ఇప్పుడు జరగబోతోంది".

"ఆ మనిషి ఇంకా మనల్ని వదలటం లేదా? చావు కోసం ఎదురు చూస్తున్న నన్ను ఇంకా సాధించాలనుకుంటున్నాడా? దేవుడా".

"అమ్మా... ఇది నాన్నతో సమస్య కాదు. ఇక్కడ శ్వేత, అక్కడ ఆద్య మా ఇద్దరితో చేయబోతున్న యుద్ధం. నువ్వు ఎలా అయినా వెంటనే బయలుదేరి రావాలి"

"అసలేం జరిగింది. ముందు ఫోన్ శ్వేతకి ఇవ్వు నేను మాట్లాడతాను"

"అమ్మా... అలాంటి స్థితి దాటిపోయింది. ఇది ఫోన్ల మీద మాట్లాడితే పరిష్కారం అయ్యేది కాదు. నిన్న అఖిల నీతో మాట్లాడతాను అంటే వద్దు. అమ్మని ప్రశాంతంగా ఉండనీ అన్నాను. అందుకని రేపు ఉదయం శ్రీనివాస్ నీకు ఫ్లయిట్ బుక్ చేస్తాడు. నువ్వు బయలుదేరి వచ్చేయ్".

"నిజంగానే అంత గొడవ జరిగిందా?"

"చిన్నదయితే నీకు ఎందుకు ఫోన్ చేస్తాను".

"సరే మీ ఇష్టం" అంది.

అప్పుడు అఖిలకి ఫోన్ చేసింది.

"చెల్లీ... ఇక్కడ శ్వేతతో పెద్ద గొడవ జరిగింది".

"నేను అనుకుంటూనే వున్నాను. ఇది చాలా రోజుల నుండి నడుస్తోందన్నాగా"

"సరే విను. ఇప్పుడే అమ్మకి ఫోన్ చేసాను. తను కాశీలో వుంది. వెంటనే బయలుదేరి రమ్మని చెప్పాను. ఇప్పుడు అమ్మ టిక్కెట్ల విషయం చూడాలి. నేను ఎప్పటికప్పుడు మాట్లాడుతుంటాను. శ్రీనివాస్ నా పక్కన ఉన్నాడు. నువ్వు గాని, ఆదర్శ్ గాని ఈ విషయాల గురించి ఆద్యతో మాట్లాడవద్దు" అంది.

* * *

రాత్రి తులసి, భువనేశ్వరి, ప్రభాత్ ముగ్గురూ లాన్‌లో కూర్చున్నారు.

"మీకు జెట్ లాగ్ ఉంటుందేమో.. మనం రేపు మాట్లాడుకుందాం" అన్నాడు ప్రభాత్.

"నాకు ఎప్పుడూ జెట్ లాగే... ఎప్పుడు నిద్ర పట్టిందని" అంటూ తులసి మొదలు పెట్టింది.

"ఇప్పటివరకు ఏం జరిగిందో అది జరిగింది. అవన్నీ మనందరం మరిచిపోతే బాగుంటుంది ప్రభాత్. నేను భువనకి కూడా అదే చెబుతున్నాను. మనందరం కొన్ని తప్పులు చేసాం. అది ఒప్పు కోవటానికి నేను సిగ్గుపడను. అంతే కాదు. చిన్న పిల్లల నుండి పెద్దవాళ్ల దాకా అందరినీ క్షమించమని అడగటానికి నేను వచ్చాను. ఇప్పుడు ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. సరయూ పెళ్లి అయిపో యింది. ఇంక రసజ్ఞ మిగిలింది. ఇప్పుడు కూడా మనం నిన్నటి విషయాలను పట్టుకుని వేలాడటం మంచిది కాదు అని నాకు అనిపిస్తోంది".

"నువ్వు చెప్పేది బాగుందమ్మా... అక్కా వాళ్లు మనతో కలిసి రావాలి కదా".

"మనం ఓ ప్రయత్నం చేద్దాం. ఇప్పటి దాకా నువ్వు అమ్మ అంటే వసుంధరకి మాత్రమే అనుకున్నావు. అయినా మీ నాన్నతో నాకు పట్టింపులు రాకపోతే, మేం ఇద్దరం కలిసి ఉండే వాళ్లం. ఆడపిల్లలుగా మా దగ్గరకి మీరు రావటమో, మీ దగ్గరికి మేం రావటమో చేసేవాళ్లం. ఆ బంధం దెబ్బతింది కాబట్టే ఇన్ని అనర్థాలు జరుగుతున్నాయి".

"నువ్వు నాతోనే వుంటే నీ ఆస్తి నేను రాయించు కుంటానని అనుకుంటుంది అక్క".

"ఇంతకు ముందు నువ్వు అనుకున్నావుగా".

భువనేశ్వరి మాట్లాడలేదు. **(సశేషం)**

ఒడిషాలో మరొక జలియన్‌వాలా బాగ్

అమ్మోసిమ్మో

వలసవాద భారతదేశ చరిత్ర అంతా కూడా బ్రిటిష్ పాలనకు వ్యతిరేక పోరాటాలు, ప్రతి ఘటనలకు సంబంధించిన కథలతో నిండి ఉంటుంది. ఇందులో కొన్ని ఘటనలు విస్తృత గుర్తింపును పొంది, స్వాతంత్ర్య సమర ఇతివృత్తంలో అంతర్భాగం కాగా, కొన్ని ఘటనలు చరిత్ర తెరల మాటున మరుగైపోయాయి. అటువంటి ఘటనలలో ఒకటే ఏప్రిల్ 25, 1939 లో ఒడిషాలోని జనజాతి కేంద్ర స్థానంలో జరిగిన 'అమ్మో సిమ్మో' ఘటన. ఇది అందరికీ పరిచితమైన జలియన్‌వాలా బాగ్ స్థాయిలో జరిగింది. అందుకే, దీనిని 'ఒడిషా జలియన్‌వాలా బాగ్' గా ప్రస్తావిస్తుంటారు. స్థానిక జనజాతి నాయకుడైన నిర్మల్ ముండా నేతృత్వంలో అక్కడి జనజాతీయులు బ్రిటిష్ వలసపాలకులు విధించిన అక్రమ భూపన్నులకు, కౌలుకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ శూరులైన జనజాతీయుల పోరాటం, వారి త్యాగాలను మనం గుర్తించవలసిన సమయం ఆసన్నమైంది. ఈ వ్యాసం అమ్మోసిమ్మో ఘటన, దాని చారిత్రిక ప్రాముఖ్యత, వీరులైన జనజాతీయుల త్యాగాలను గుర్తించి, గౌరవించవలసిన అవసరాన్ని గురించి వివరిస్తుంది.

1930ల చివరినాటికి ఒడిషాలోని గిరిజనులు బ్రిటిష్ పాలనలో తీవ్రమైన అణచివేత, దోపిడీకీ గురవుతూ, దానిని భరించలేని స్థితికి వచ్చారు. వలస పాలకులు భరించలేని స్థాయిలో భూమి పన్నులను, కౌలునీ విధిస్తుండడంతో, జనజాతీయులలో తీవ్రమైన అసంతృప్తి, ఆందోళన రగులుకున్నాయి. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా తోటి జనజాతీయులను కూడగట్టి నిర్మల్ ముండా నాయకుడిగా ఉద్భవించాడు. వారి డిమాండ్ అత్యంత స్పష్టం–ఈ పన్నుల నుంచి 36 గ్రామాలను మినహాయించాలి. ఆర్థిక, సామాజిక న్యాయాన్ని కోరుకుంటున్న ఈ జనజాతీయుల ఆకాంక్షలో ఈ డిమాండ్ వేళ్ళూనుకొని ఉంది.

పోరాటం, విషాదం

జనజాతీయులు ఏప్రిల్ 23, 1939న సుందర్‌గఢ్ జిల్లాలోని రాయ్‌బోగా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఆమ్మో సిమ్మో అనే గ్రామంలో తమ డిమాండ్లపై తీర్పు వినడం కోసం పోగయ్యారు. ఈ సమూహం స్థానిక బ్రిటిష్ అధికారుల, నిర్మల్ ముండా అనుచరుల దృష్టిని ఆకర్షించింది. అక్కడ ఉన్న కీలక వ్యక్తులలో గంగపూర్ రాజకీయ ఏజెంటు రాణీ జానకిరత్న, ఇతర బ్రిటిష్ అధికారులు ఉన్నారు. నిర్మల్ ముండా కోసం బ్రిటిష్ అధికారులు వెతకడం ప్రారంభించడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. ఆ తర్వాత చోటు చేసుకున్న విషాద ఘటనలు, క్రూరమైన వలసపాలనకు సంబంధించిన విషాద జ్ఞాపకాలు. బ్రిటిష్‌వారు స్థానికంగా స్థానిక ప్రజల ప్రయోజనాల కన్నా వలసపాలకుల ప్రయోజనాలకు ఎంత విలువ ఇచ్చారన్న విషయాన్ని ఇది పట్టి చూపుతుంది.

ఈ గందరగోళం, భయాల నడుమ, బ్రిటిష్ అధికారులకు, జనజాతీయులకు మధ్య ఘర్షణ ప్రారంభమైంది. నిర్మల్ ముండా ఇంట్లోకి అధికారులు ప్రవేశించడాన్ని ప్రతిఘటించిన ఒక బాలుడిని అక్కడికక్కడే కాల్చి చంపేశారు. ఈ విషాద ఘటన పలు ప్రతిచర్యలకు కారణమై, నిరాయుధులైన అనేకమంది జనజాతీయులపై క్రూరమైన, విచక్షణా రహిత కాల్పులకు దారితీసింది. అనధికారిక లెక్కలు మరణించిన వారి సంఖ్యను ఎక్కువగా చెప్తున్నప్పటికీ 49మంది మరణించినట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దాదాపు 90 మందికి పైగా గాయ పడ్డారు. ఇది భారతదేశంలో బ్రిటిష్ వలసపాలకుల అణచివేత చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా చెప్పవచ్చు.

చారిత్రిక ప్రాముఖ్యత, వారసత్వం

అమృత్‌సర్‌లో 1919లో జరిగిన కుఖ్యాత

జలియన్‌వాలా బాగ్ మారణ కాండకు అమ్మోసిమ్మో ఘటనకు అనేక పోలికలు కనిపిస్తాయి. శాంతియుతంగా సమావేశమైన భారతీయ ప్రజలపై కాల్పులు జరుపవలసిందని బ్రిటిష్ అధికారులకు జనరల్ డయ్యర్ ఉత్తర్వులు ఇచ్చినట్టే, అమ్మోసిమ్మోలో ఉన్న బ్రిటిష్ అధికారులు కూడా తమ హక్కులను మాత్రమే డిమాండ్ చేస్తున్న పేరులేని జన జాతీయులపై కాల్పులను, క్రూరమైన బలాన్ని ఉపయోగించవలసిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతటి చారిత్రక ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, ప్రధాన స్రవంతి చారిత్రిక ఇతివృత్తాలలో ఒకటిగా ఈ ఘటన గుర్తింపు పొందలేదు. భారత స్వాతంత్ర సమరంలో అమ్మో సిమ్మో ఘటన ఒక కీలక క్షణమన్న విషయాన్ని గుర్తించేందుకు విముఖత చూపడం అన్నది బలహీనవర్గాల పోరాటాలను గుర్తించడంలోని సంక్లిష్టతలను పట్టి చూపుతుంది. జనజాతీయులు అమ్మోసి మ్మోలో చేసిన త్యాగాలను గుర్తించి, స్మరించుకునేందుకు ప్రభుత్వం 2018లో ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసి, అమరవీరులను గౌరవించేందుకు స్మారక స్థూపాలను నిర్మించింది. వారి త్యాగాలను మరచిపోకుండా, వారి పేర్లను ఈ స్మారక స్థూపాలపై చెక్కారు.

ఆధునిక భారతదేశంపై అమ్మోసిమ్మో ప్రభావం

దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా భారతీయ జనజాతుల పోరాటాలు, త్యాగాలకు మరువలేని గుర్తుగా ఆమ్మోసిమ్మో కథనం నిలుస్తుంది. భూమి హక్కులు, పన్ను మినహాయింపుల కోసం పోరాడడాన్ని కేవలం ఆర్థిక ఆందోళనగా మాత్రమే చూడలేం. ఎందుకంటే, ఇది ఈ సమూహాలు ఆకాంక్షించే స్వయం ప్రతిపత్తి, గౌరవం, న్యాయంతో లోతుగా ముడిపడి ఉన్నది.

ఆమ్మోసిమ్మో ఘటనను ప్రజల జ్ఞాపకాలలో ఉంచేందుకు కృషి జరిగినప్పటికీ, ఈ చరిత్రను విస్తృత స్థాయిలో ప్రచారం చేసే దిశలో సవాళ్లు మిగిలే ఉన్నాయి. వలసపాలకులకు వ్యతిరేకంగా జనజాతీయుల పోరాటాలు, వారి అవిద్య, నాటి పక్షపాత ధోరణుల కారణంగా సరిగా గ్రంథస్థం చేయకపోవడం వల్ల చారిత్రిక ఘట్టాలలో ఇది నామకార్థం కనిపిస్తుంది. తక్కువగా ప్రాచుర్యం పొందిన ఘటనలపై వెలుగును ప్రసరించేందుకు సమ్మిళిత విద్య, పరిశోధన ద్వారా ఈ సవాళ్లను పరిష్కరించవలసిన అవసరాన్ని ఈ ఘటన పట్టి చూపుతుంది.

బ్రిటిష్ వారి అణచివేత పాలనకు వ్యతిరేకంగా నిలబడేందుకు సాహసించిన ఒడిషా జనజాతీయుల అణచివేయలేని స్ఫూర్తికి తార్కాణంగా నిలుస్తుంది. భారతదేశ స్వాతంత్ర సాధన దిశగా జరిగిన ప్రయాణంలో ప్రాచుర్యం పొందిన ఘటనలతో సమానంగా ఈ వ్యక్తులు చేసిన త్యాగాలను గుర్తించి, స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి గాథలను వెలికి తీసి, గ్రంథస్థం చేసి, కేవలం స్థానిక సమాజాలతోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

– ఆర్గనైజర్ నుంచి

అడిగినవన్నీ ఇవ్వగలను అనుకోవడం అజ్ఞానమైనట్లే, అవసరమైనంత వరకే స్వీకరించడం జ్ఞానం..' అనేది వామనావతార ఘట్టం పరమార్థం. 'నేను మహా చక్రవర్తిని. విద్వాంసుడను. మహాదాతను. కర్తను, భోక్తను...'అనే తదితర లక్షణాలతో విర్రవీగే వారికి ఏనాటికైనా ప్రతికూలత అనివార్యమని శ్రీమద్భవగీత పేర్కొంది. తమలోని ఉత్తమ, ఉన్నత లక్షణాలతో మనిషి 'మనీషి'గా ఎదగాలి తప్ప అహం కూడదనేందుకు ఈ ఘట్టాన్ని నిదర్శనంగా చెబుతారు. విజయ సాధనకు పట్టుదల అవసరం. ఆ విజయం లోక కల్యాణానికి ఉపకరించాలి తప్ప ధర్మవినాశనానికి, ప్రత్యర్థుల వేధింపులకు కాదు. బలి స్వర్గాధిపత్యం తరువాత ఆ అనుభవమే చోటు చేసుకుంది. ఆయన అనుచరులు దేవతలను హింసిస్తూ వామనరూపంలో ముప్పును కొని తెచ్చుకున్నారు.

ధర్మప్రతిష్ఠాపనలో భాగం తనను తాను సృష్టించుకునే దేవదేవుడు భాద్రపద శుద్ధ ద్వాదశి శ్రవణ నక్షత్రంలో అభిజిన్ముహూర్తంలో కశ్యప అదితి దంపతులకు వరపుత్రుడిగా ఉదయించాడు. ఆ రోజును వామన ద్వాదశి, బలి ద్వాదశి, దివ్య ద్వాదశి, విజయ ద్వాదశి, మహాద్వాదశి అని వ్యవహరిస్తారు. శ్రీమద్భాగవతం, వామన, భవిష్య పురాణాల ప్రకారం, ఒకసారి బలి చక్రవర్తి 'విశ్వజిత్'యాగం ద్వారా త్రిలోకాధిపత్యం పొందాడు (ఇంద్రుడిని ఓడించి స్వర్గాధిపతి అయ్యాడు) రాక్షసగణం విజయగర్వంతో దేవతాగణాన్ని హింసించ సాగింది. కలవరపడిన దేవతల మాతృమూర్తి అదితి భర్త కశ్యపుడి సూచనపై పయోవ్రతం ఆచరించి శ్రీమహావిష్ణువును ప్రసన్నం చేసుకుంది. ఫలితంగా, అండపిండ బ్రహ్మాండాలను నిక్షిప్తం చేసుకున్న విశ్వపురుషుడు శ్రీమన్నారాయణుడు వామనమూర్తిగా అవతరించాడు. ఉపనయన వేళ కశ్యపుడు ముంజి (మొలతాడు),దేవగురువు బృహస్పతి యజ్ఞోపవీతం, భూదేవి జింకచర్మం, సరస్వతి జపమాల, కుబేరుడు భిక్షాపాత్ర ప్రసాదించగా, సాక్షాత్ గాయత్రీ మాత గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించింది.

బలి అశ్వమేధ యాగం చేస్తున్న నర్మద నదీతీరంలోని 'భృగుకచ్ఛం' అనే ప్రదేశానికి చేరాడు. వామనుడు ఆయనను సమీపిస్తూనే, 'స్వస్తి జగత్రయీ భువన శాసనకర్తకు...'అనే ఆశీర్వచనంలో 'ముల్లోకాలను శాసించగల నీకు మంగళం' అంటూనే , ఆ శాసనానికి, నీకూ ఇక 'చెల్లు (స్వస్తి) చీటీ'అనే అంతరార్థం స్ఫురిస్తుంది.ఆయన దర్శనం రాక్షసరాజుకు అమితానందం కలిగించింది. ఆ వటువును సాదరంగా ఆహ్వానించాడు. ఉచితాసనం కల్పించి పాదాలను కడిగి శిరస్సున జలాన్ని చల్లుకున్నాడు.

సమున్నత సందేశం వామనతత్వం

డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

వామనబలి సంవాదంలో మానవాళికి ఉపకరించే ఎన్నో అంశాలు బోధ పడతాయి. ముఖ్యంగా అశాశ్వతమైన జీవితంలో అనంత సంపద కోసం వెంపర్లాట తగదనే హితవు దాగి ఉంది. సంపద, అధికారం శాశ్వతమని విర్రవీగితే పతనం తప్పదు. కోరికలు అనంతం. అవి తీరినకొద్దీ పుడుతూనే ఉంటాయి. ఎన్ని సద్గుణాలు ఉన్నా అహం ఏ రూపంలోనూ తగదనేందుకు బలిమర్దనమే ఉదాహరణ.

పరమ భాగవతోత్తముడు ప్రహ్లాదుడి మనవడు బలి, ఉత్తముడు, సత్యసంధుడు, అమిత శౌర్య పరాక్రమాలు కలవాడు. ఆయన పాలన సుభిక్షమై నదని, సకాలంలో వానలు కురిసి ధనధాన్యాదులు సమృద్ధిగా ఉండేవని, అన్ని వర్గాల వారు సుఖ శాంతులతో జీవించేవారని భాగవతం చెబుతోంది. ఆడిన మాట తప్పడు. దానం విషయంలో గురు నిరసనను భరించాడు తప్ప తన నిర్ణయం నుంచి వెనుకడుగు వేయలేదు. వామనుడిపై దండెత్తడానికి సిద్ధపడిన రాక్షసులను శాంతపరిచాడు. ఇంత సత్ ప్రవర్తకుడి వినాశనానికి అనుచరగణం అకృత్యాలు, ఆయన దానగుణం వెనుక గల ఎంతో కొంత దర్పం, అహం కారణంగా స్ఫురిస్తాయి. తాత ప్రహ్లాదుడి విష్ణుభక్తి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నప్పటికీ సాత్వికాహంకారం వీడలేకపోయాడని పెద్దలు చెబుతారు. స్వల్పభూమి దానమడిగిన వామనుడితో అన్నమాటలు ఆయన స్వాతిశయాన్ని చాటుతాయి. 'నా జపతపాలకు ఈషణ్మాత్రం (కొంచెం) భూమిని, అదీ మూడడుగులు కోరుతున్నాను' అన్న వామనుడి కోరికకు ఆశ్చర్యపడిన బలి... మడులు, మణులు, మాణిక్యాలు, రాజ్యం.. ఇలా 'ఏదైనా, ఎంతైనా ఇవ్వగల నా దగ్గర ఇంత అల్పమైన కోరికా? గ్రహీత, దాత స్థాయినైనా పరిగణలోకి తీసుకోవాలి కదా?' అనడంలో సాత్వికాహంకారం ధ్వనించింది. 'దాత ఎంతో ఇవ్వగలిగినా గ్రహీత అవసరం మేరకే స్వీకరించాలి' అంటాడు వామనుడు. కోరినవన్నీ ఇవ్వగలను అనే అహంకారం పనికిరాదనే భావనా ధ్వనిస్తుంది. 'మనిషికి తృప్తి ప్రధానం. దానికి మించిన సంపదలేదు. ప్రాప్తం కొద్దీ దక్కిన దానితో తృప్తిపడని వారు ఏడు ద్వీపాలలోని భూమిని ఇచ్చినా అదే పరిస్థితి. ('ప్రాప్తంబగు లేశమైన బదివేలనుచున్ దృప్తిం జెందని మనుజుడు నప్తద్వీపముల నైనన్ జక్కంబడునే'...) 'నాకు మూడడుగుల నేల చాలు. నా కోరిక నీ దృష్టిలో అల్పం, మేరు పర్వతం లాంటి నీముందు పరమాణువు కావచ్చు నాకు అది అనల్పం, అనంత సంపద' అనీ అన్నాడు.

వామన బలి సంవాదాన్ని వింటున్న కుల గురువు శుక్రాచార్యుడు ఆ వటువును విష్ణువుగా భావించి దాన ప్రక్రియకు అభ్యంతరం తెలిపినా బలి పట్టించుకోలేదు. దాతగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడం ('తిరుగన్ నేరదు నాదు జిహ్వా), ఆత్మాభిమానం కలవారు ఎన్ని కష్టాలు వచ్చిన, ఆఖరికి ప్రాణం పోయినా ఆడినమాట తప్పకపోవడం ('బ్రతుకవచ్చుగాక బహుబంధనములైన/వచ్చుగాక లేమి వచ్చుగాక/జీవధనములైన జెడుగాక పడుగాక/మాటందిరుగలేరు మానధనులు')ఒక కారణమైతే సాక్షాత్తు శ్రీకాంతుడి చేయి కిందయి, తన చేయి మీదవడం గర్వకారణం కాదా? అని ప్రశ్నిస్తాడు. అంతలోనే వైరాగ్యం ప్రదర్శిస్తాడు. ఎందరో రాజులు, చక్రవర్తులు పుట్టిగిట్టారు కానీ యశస్సును తప్ప భౌతిక సంపదలను వెంట తీసుకువెళ్లలేదు కదా? (కారే రాజులు రాజ్యముల్ కలుగవే గర్వోతిన్ పొందరే....'అని) అని సమాధాన పడ్డాడు.

వటువు అభీష్టాన్ని బలి మన్నించడంతో వామనుడు 'ఇతింతై వటుడింతై....' మహాత్రివిక్రముడై విరాట్ రూపాన్ని సంతరించుకుని భూమ్యాకాశాలను రెండు పాదాలతో (అడుగులతో) ఆక్రమించాడు. 'నీ తృతీయపదము నిజము నా శిరమున/నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ'అని బలి విస్పష్టంగా చెప్పడంతో మూడవ పాదంగా బలితలపై ఉంచి రాక్షసజాతి ఆవాసం రసాతలానికి అణగదొక్కాడు. 'అహం కారంతో కన్నులు మూసుకుపోయి ప్రవర్తించిన మాలాంటి దానవుల కళ్లను తెరిపించిన నీవు ఆదిగురువు లాంటివాడివి' అని బలి శ్లాఘించాడు.

వామన, బలి సంవాదంలో మానవాళికి ఉపకరించే ఎన్నో అంశాలు బోధపడతాయి. ముఖ్యంగా అశాశ్వతమైన జీవితంలో అనంత సంపద కోసం వెంపర్లాట తగదనే హితవు దాగి ఉంది. సంపద, అధికారం శాశ్వతమని విర్రవీగితే పతనం తప్పదు. కోరికలు అనంతం. అవి తీరినకొద్దీ పుడుతూనే ఉంటాయి. ఎన్ని సద్గుణాలు ఉన్నా అహం ఏ రూపంలోనూ తగదనేందుకు బలిమర్దనమే ఉదాహరణ. గర్వం, అహం నశించిన వారికి జ్ఞానం కలుగుతుందని ఈ ఉదంతం చెబుతోంది. దానధర్మాలు చేస్తూనే అనుచిత కార్యాలకు పాల్పడడం సరికాదన్నది ఇందులోని నిగూఢార్థం. 'అతిసర్వత్రవర్జయేత్' అనే ఆప్తవాక్యానికి బలి విపరీత 'దాతృత్వం' నిదర్శనం ('అతి దానాత్ బలిర్బద్ధో'..)గా పెద్దలు చెబుతారు. అడిగిన వారికి లేదనక (వెనుకా ముందు ఆలోచించక) దానాలు చేస్తూ, విష్ణువు 'మూడడుగుల' చోటు విచిత్ర కోరికను అంగీకరించి చేటు తెచ్చుకున్నాడని అంటారు. పురాణాల ప్రకారం, ఇదంతా అవతారతత్వమే అయినా అందులో నేర్వదగింది ఎంతో ఉంది.

మనుషులు ఎంత ధర్మవర్తనులైనా పదవీ, ఐశ్వర్యాల విషయంలో సర్వేశ్వరుని ఆలోచన మరోలా ఉంటుంది. 'సంపద గర్వంతో చాలామంది దేవుడిని, లోకాన్ని లక్ష్యపెట్టరు. ఆ గర్వం అంతరిస్తే మనసు స్థిరంగా ఉంటుంది. అందుకే నేను అనుగ్రహించ దలచిన వారి సంపదను ముందుగా హరించి వేస్తాను. సంపదలు పోయినా స్థిరచిత్తంతో ఉండే వాడే ఉత్తముడు. బలి అలాంటి వాడే. మూడవ అడుగుతో పాతాళానికి వెళతానని తెలిసినా చలించలేదు. గురువు శుక్రాచార్యుడు శపించినా, నేను కపటపు మాటలాడినా ఆ సత్యసంధుడు ధర్మాన్ని వీడలేదు. అందుకే దేవతలకు కూడా అలవికాని స్థానం పొందాడు. రానున్న సావర్ణి మన్వంతరంలో నా శరణు పొంది ఇంద్రపదవి అధిష్ఠించ గలడు. అంతవరకు విశ్వకర్మ నిర్మిత సుతల లోకం సకల శుభశాంతులతో నివాసంగా ఉంటుంది' అని త్రివిక్రమూర్తి అనుగ్రహించాడు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

నేతాజీ అనగానే రెండు మాటలు మనకు గుర్తుకొస్తాయి. స్వాతంత్ర్యం, ఉద్యమం. భారత స్వతంత్ర సాధనకు ఆయన మహోద్యమం నడిపారు. ఆజాద్ హింద్ ఫౌజ్ (ఇండియన్ నేషనల్ ఆర్మీ)కి నేతృత్వం వహించి అనంతర క్రమంలో సింగపూర్ వేదికగా కదన శంఖం పూరించారు. అదే ప్రభుత్వంగా ప్రకటించి, ఆంగ్లేయులందరినీ గడగడలాడించేలా ప్రచారభేరి మోగిస్తూనే వచ్చారు. ఆనాటి పరిణామాల నేపథ్యంలో మన దేశం నుంచి అఫ్ఘనిస్థాన్, రష్యా, ఇటలీ మీదుగా తొలుత జర్మనీకి చేరి 'ఆజాద్ హింద్ రేడియో' ప్రసారాలతో అంతటా హోరెత్తించారు. దమననీతిని నిరసిస్తూ, భారతదేశంలోని లక్షలాది ప్రజలను ప్రచార జోరుతో ఒక్కటి చేశారు సుభాష్‌చంద్రబోస్. ఎనభై సంవత్సరాల నాటి స్వరచరిత్ర. ప్రసారోద్యమం తీరు జర్మనీలో మొదలైనా అటు తర్వాత సింగపూర్, మయన్మార్‌లకు బదలాయింపు అయింది. సరిగ్గా అదే మయన్మార్ (నాటి బర్మా) నుంచి రేడియో ప్రసారాలను నిరాఘాటంగా, అంతకుమించి అత్యంత రహస్యంగా అందించిన స్వరయోధ ఎవరో తెలుసా? ఆ వనితా ప్రభంజని ప్రతిభాబోస్. నిండు నూరేళ్లూ జీవించి, ఆ జీవితకాలంలో ధీరురాలిగా ప్రభవించి, విస్తరించిన జనోద్యమం తేజం. 1923లో జననం, 2023లో మరణం. ఇది గణాంక చరిత్ర. నిజానికి 'ప్రతిభ'కు జయంతి, వర్ధంతి ఏదీ ఉండదు. చిరంజీవిని. ఆరంభం, కొనసాగింపు తప్ప ముగింపు అంటూ ఉండని ఆ గళవీర గురించి....

సార్థక నామ

శతం అంటే వంద అని మనందరికీ తెలుసు. పది పదులు. అనేక విధాలు, బంగారం అనే అర్థాలు కూడా ఉన్నాయి. ప్రతిభా బోస్‌ది పలు విధాల సామర్థ్యం. కర్తవ్య నిర్వహణలోనూ స్వచ్ఛ సువర్ణం. అలా స్వర్ణ లలన ఎలా అయ్యారంటే, గీతాలాపన ద్వారా. అది మన జాతీయగీతానికి పూర్వ రచన విశ్వకవి రవీంద్రనాథ టాగూర్ విరచితం. 'భారత భాగ్య విధాతా' అనేది. బెంగాలీ నుంచి అనువదించింది మరెవరో కాదు...నేతాజీ నాయకత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్ సేనాధికారుల్లో ఒకరు – సఫ్రానీ. స్వరకర్తృత్వం వహించిందీ, దర్శకత్వం నిర్వహించిందీ స్వాతంత్ర్య సమరయోధుడిగా నాడు ఎంతో పేరున్న రామ్‌సింగ్. ప్రసారకర్త– ప్రతిభ. భారతావనికి స్వేచ్ఛ కోరుతూ, విదేశంలోని తనదైన ప్రభుత తరపున రేడియో ప్రసారాన్ని సాగించారు.

జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

ప్యారా దేశ్ హమారా

'జనగణమన' అనేది రవీంద్రుడి బెంగాలీ గీతంలోని మొదటిభాగం. ఇది అలనాడే తత్వబోధిని పత్రికలో వెలువడింది. పశ్చిమంతో పాటు ద్రావిడ, ఉత్కళ, బెంగాలీ ప్రాంతాలు; పర్వతాలు, నదులు, సముద్ర తరంగాలు అన్నీ శుభనామాన్నే తలుస్తున్నాయని గీతం సారాంశం. జయగాథను పాడుకుంటూ, ఆశీస్సులు కోరుకుంటూ ఉన్నాయనీ భావం. ప్రజా సమూహాలలోని మనసులలో నెలకొన్న అధినాయకత్వానికి జయం పలకడమే అంతరార్థం. విముక్త భారత సంబంధిత తాత్కాలిక ప్రభుత్వం పక్షాన రూపొందిన గీతిక 'శుభసుఖ్ చైన్‌కి బరసే భారత్ భాగ్య హై జగా' అని మొదలై, 'సూరజ్ బనేకర్ జగపర్ చమ్మే భారత్ నామ్ శుభగా – జయహో జయహో జయ జయ జయహో' అంటూ కొనసాగి, 'ప్యారాదేశ్ హమారా'గా ముగిసి శ్రోతలందరికి వీనులవిందు చేస్తుంది. బ్రిటిష్ పాలనను తీవ్రంగా ప్రతిఘటిస్తూ, సంపూర్ణమైన స్వతంత్ర సముపార్జనను అభిలషిస్తూ, ఆజాద్‌హింద్ ఫౌజ్ వెలువరించిన రేడియో గీతం. అనువాదక సఫ్రానీ–ఐక్యతా చిహ్నమైన కాషాయాన్ని తన పేరుకు జోడించుకున్న అబిద్ హసన్. పోరాటపటిమకు మరో పేరు రామ్‌సింగ్ విలక్షణ రీతిన స్వరశైలి సమకూర్చి శభాష్ అనిపించుకున్నారు.

ప్రసారకర్తగా ప్రతిభాబోస్ తనను తాను సర్వసమర్థంగా నిరూపించుకున్నారు. అధి'నేతాజీ' నుంచి పొందిన స్ఫూర్తిని శక్తిగా మలుచుకున్నారు. విశ్వదీప్తి మంతమైన గీతికగా–బాహాటంగా కాదు, భారతీయ హృదయాల్లో పొందు పరిచారు. అధినేత గురించిన తన గౌరవ ప్రపత్తిని ఎంతగా పదిలపరచుకున్నారో ఈ పద్యమాలిక అక్షరబద్ధం చేస్తుంది.

దినదినగండాన దిక్కెరుంగక దేశ
నాయకుల్ జైళ్లలో నవయునాడు
భరతపుత్రులు వట్టి పిరికి పందలటంచు
ఆంగ్లేయులెకసెక్క మాడునాడు
ప్రాణాలనరచేతబట్టి దేశీయులు
దేవుడా యంచు వాపోవనాడు
పరదాస్య శృంఖలాబద్ధ భారతమాత
కంట నీర్వెట్టుచు కందునాడు
'చావలేదింక భారత శౌర్య పటిమ
వచ్చుచున్నాడ భండన ప్రాంగణము"న
కంచు గర్జించి శత్రువులదలిపోవ
దుమికినావటే స్వాతంత్ర్య సమరమందు!

'అతులిత విక్రమక్రమ మహత్తర మూర్తివయై స్వతంత్ర భా/రతమునకై మహోద్ధతి స్వరక్తము దీసి ప్రతిజ్ఞ చేసి స/మ్మతిమెయి స్వీయ జీవిత సమర్పణజేసెడు త్యాగశీలురన్ /వెతకి–స్వతంత్ర సేన గణనీయము గాగ తయారుజేసితీ!' అనేలా స్వరార్చన



ధీయురాలు 'ప్రతిభా'బోస్

చేశారు తన మనోమందిరంలోనే. మూర్తి దాల్చిన పౌరుషాన్ని, అఖండ ఆత్మవిశ్వాసాన్ని, సాహసోత్సాహ సత్య తేజస్సును నేతాజీలో చూశారామె. దీక్షాదక్షతలతో వ్యవహరించారు.

నిరంతర ప్రసార స్రవంతి

ప్రతిభ స్వస్థలం మయన్మార్ అయినా, వివాహం చేసుకుంది భారతీయుడిని. కెమిస్టుగా పనిచేస్తుండే వారు. ఆయనకి నాటి రంగూన్‌లో ఫార్మసీ సంస్థ ఉండేది. తరచూ అక్కడికి వెళ్లి వస్తుండేవారు. ఆమెతో అప్పటి పరిచయం, స్నేహమే పరిణయానికి దారితీసింది. మోల్మెన్ నగరంలో జన్మించిన ఆమె తొలి నుంచీ సాహసి. నిర్ణయాలలను వేగంగా తీసుకునేవారు. తన ఊళ్లోని కాన్వెంటులో చదువుకుంది. ఆ తర్వాత రంగూన్‌కి చేరి అనంతర విద్య అభ్యసిం చింది. పెళ్లి జరిగింది యుద్ధ సమయంలో. ప్రతికూల పరిస్థితులు మరెన్నో ఎదురైనా, వెరవకుండా దంపతులయ్యారు. ఆమె పుట్టిన తేదీ మార్చి 19. సేవాభావంలో తనకు స్ఫూర్తిప్రదాత – తండ్రి! వైద్యుడిగా ఉంటుండేవారు. తదుపరి కాలంలో నేతాజీ కలిగించిన దీప్తి అనంతం. రేడియో బ్రాడ్‌కాస్టర్‌గా చేరి, భారత స్వాతంత్ర్య ఉద్యమ వార్తలన్నింటినీ రహస్యంగా ప్రసారం చేశారామె. ఆ సమాచారమంతా ఉద్యమకారులకే పరిమితం. పరపాలకులకు తెలియకుండా, వివరాలు పరాయివారి చెవినపడకుండా, అవసరమైన వారికి అవసరమైనంతగా చేరవేయడం అసామాన్యం, అసాధారణం. అంతటి అసాధారణతనే సాధారణ నిత్యకృతంగా మలచుకుని, భారత ప్రజల్లో స్వేచ్ఛా పిపాస రగిలించారు ప్రతిభ. మహిళాశక్తి

ప్రతిభ స్వస్థలం మయన్మార్ అయినా, వివాహం చేసుకుంది భారతీయుడిని. కెమిస్టుగా పనిచేస్తుండే వారు. ఆయనకి నాటి రంగూన్‌లో ఫార్మసీ సంస్థ ఉండేది. తరచూ అక్కడికి వెళ్లి వస్తుండేవారు. ఆమెతో అప్పటి పరిచయం, స్నేహమే పరిణయానికి దారితీసింది. మోల్మెన్ నగరంలో జన్మించిన ఆమె తొలి నుంచీ సాహసి. నిర్ణయాలలను వేగంగా తీసుకునేవారు. తన ఊళ్లోని కాన్వెంటులో చదువుకుంది. ఆ తర్వాత రంగూన్‌కి చేరి అనంతర విద్య అభ్యసిం చింది. పెళ్లి జరిగింది యుద్ధ సమయంలో.

కావాలన్న నేతాజీ పిలుపునందుకుని ముందు నిలిచిన రీతి ఏ విధంగా ఉందంటే....

అంచిత సత్త్వల్ మహిళలాహవభూమికి జీవితమ్ములర్పించెడువారు కాపలయు వేపురు నాకిపుడన్న మాత్ర ని

శ్చంచల శౌర్యమూర్తులు విశాల యశస్వినులెందరో విజ్ఞం / భించిరటే! భవద్ హృదయవేల్లిత విప్లవ విశ్వదీప్తిలో!

అదీ నాటి స్త్రీ చేతన! పుణికి పుచ్చుకున్న ప్రతిభ – తన వ్యూహ చతురతకు పదును పెట్టారు. వార్తలు, విశేషాలు, సూచనలు, ఆదేశాలు, మాటలు, పాటలు అన్నింటినీ రేడియో మాధ్యమంలో విస్తృతపరిచారు. **'తీర్చుకున్నావు నీ మాతృదేవి రుణము/ధర్మరణమున దాస్య బంధాలు తెరిచి / అలరులే నీదు నా మహేమాక్షర ములు/ భరతజాతీయ విప్లవచరిత మందు'** అంటూ సేన అధినేతను ప్రస్తుతించారు హృదయాంతరాళంలో. అంతటి ప్రపత్తి, ధర్మనిరతి ఉన్నందునే సుస్థిర యశస్సు వరించింది.

విస్తృత ప్రభ, ప్రతిభ

అదంతా రెండో ప్రపంచ యుద్ధ సమయం. 1939 మొదలు 1945 వరకు ఏళ్ల తరబడి కొనసాగంపు. వివిధ దేశాల మధ్య పోరు. నడుమ కాలంలో, అనేకానేక పరిణామాల పరంపర. మరోవైపు, నేతాజీ ఉద్యమం ఎంత రహస్యమో అంత ప్రభావాత్మకం. 'భారత ప్రజలారా! స్వేచ్ఛాగానం మారుమోగించండి. వ్యూహ ప్రతివ్యూహాలతో రణదుందుభి ప్రతిధ్వనించేలా చేయండి' అన్నదే ఇండియన్ నేషనల్ ఆర్మీ నినాదం, విధానం. అనుగుణంగానే రేడియో మాధ్యమాన్ని ఆయుధంగా వినియోగించారు ప్రతిభాబోస్. సేన ముందడుగును నిరంతర వార్తా స్రవంతిగా రూపుదిద్దడంతోపాటు, మూడో కంటికి తెలియకుండా ఎంత ఉద్యమాగ్ని రగిలించాలో అంతా రగిలించారు. ఆ ధీరపడతి తనయ మాటల్లో చెప్పాలంటే– ఆమెది దృఢ నిశ్చయం, కఠోరదీక్ష. ఎప్పుడు ఏ సమాచారం ఫౌజ్‌కు అందాలో, ఏ తరుణంలో ఏ వివరం భారత ప్రజల దరిచేరాలో, ఏ సందర్భంలో ఆంగ్ల పాలకులకు ఎటువంటి దడ పుట్టించాలో ప్రతిభకు బాగా తెలుసు. ఈ అన్నింటిలోనూ తాను కృతకృత్యురాలయ్యారు. ఎన్నెన్నో సేవలను అనేక విధాలుగా అందించి, భారత దాస్య శృంఖలాలను తనవంతు పటిమతో తెగతెరిచి, నూరేళ్లూ సగర్వంగా ఆరోగ్య భాగ్యంగా జీవించి, ఈ మధ్యనే మన అందరినీ వీడివెళ్లిన 'ప్రతిభ'కు అక్షరాంజలి. ఆమె విస్మృత కాదు.... విస్తృత నాయిక. ప్రసార శక్తిని శతవిధాలా వినియోగించి ఫలప్రద అయిన జనోద్యమ నగారా! ★

'అన్ని గుడ్లూ ఒకే గంపలో పెట్టరాదు' (Do not Put all your eggs in one basket). అన్న ఆంగ్ల సామెత పెట్టుబడుల విషయంలో చాలావరకు సరిపోతుంది. పెట్టుబడులు వివిధ రూపాలలో, వివిధ పథకాలలో దశలవారీగా ప్రణాళికాబద్ధంగా పెట్టాలి.

ఎ) బ్యాంకులలో దీర్ఘకాలిక డిపాజిట్స్ (ఎఫ్.డి.) లేదా రికరింగ్ డిపాజిట్స్ (ఆర్.డి.)
బి) ప్రభుత్వరంగ సంస్థల బాండ్లు
సి) మ్యూచ్యువల్ ఫండ్స్
డి) బంగారం, వెండిలాంటి లోహాలు
ఈ) భూమి (ఇంటి స్థలాలు, పొలాలు, విల్లాలు, అపార్టుమెంట్లు మొదలైనవి)
ఎఫ్) షేర్‌మార్కెట్లలో పెట్టుబడులు, తదితరాలు.

వివిధ మార్గాలలో పెట్టుబడుల వల్ల, ఏదైనా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఎదురైతే, అధిక మొత్తంలో నష్టపోకుండా మనం బయటపడతాం. కేవలం ఒకే పథకంపై నమ్మకంతో సాగితే, అధిక నష్టాలు తప్పక పోవచ్చును.

'చేరవలసిన గమ్యం' గురించి పూర్తిగా తెలుసుకొని వరుగు తీయటంవల్ల క్షేమంగా గమ్యం చేరగలుగుతాం.

బ్యాంకులలో 20శాతం, బాండ్లలో 10శాతం, మ్యూచువల్ ఫండ్లు 10 శాతం బంగారం, వెండి తదితర లోహాలలో 20శాతం, ఇండ్ల స్థలాలు 20 శాతం షేర్ మార్కెట్లలో 20శాతం పెట్టుబడులు పెట్టడంవల్ల గరిష్ఠమైన లాభాలను సమకూర్చుకోగలుగుతారు.

ఫోర్ట్‌పోలియో నిర్వహణ

పెట్టుబడులను సక్రమ మార్గంలో పెట్టగలిగితేనే సరైన రాబడులకు తగిన అవకాశాలుంటాయి. 'రిస్క్' తక్కువగా ఉన్నవాటిలో వృద్ధి కేవలం 12 శాతం నుండి 15 శాతంకు మించి ఉండదు. అధిక నష్టభయంతో ఉన్న కొన్ని రకాల పెట్టుబడులకు రాబడులు ఎక్కువ స్థాయిలో 30శాతం నుండి 50శాతం వరకు వస్తాయి.

అయితే, మన వద్ద ఉన్న ఆర్థిక వనరులను వివిధ గ్రూపులుగా విభజించి తగిన 'పోర్ట్‌ఫోలియో'ను నిర్వహించటం ద్వారా గరిష్ఠ మొత్తంలో రాబడులను పొందగలుగుతాం.

ఏ వ్యక్తి అయినా తన వద్దనున్న పెట్టుబడిని ఏదో ఒక్క పథకంలో పెట్టడం వల్ల ఎలాంటి దీర్ఘకాలిక లాభం చేకూరదు.

నూతనంగా ఉపాధి పొందిన వ్యక్తులు, వెంటనే గృహరుణాలు పొంది, నెలసరి ఈఎంఐల చెల్లింపు ద్వారా స్థిర ఆస్తులు కూడబెట్టగలుగుతున్నారు. అయితే, ఎంతమేరకు దానివల్ల రాబడులు సాధ్యం?

దీర్ఘకాలంలో వివిధ మార్గాలలో రాబడులను సృష్టించుకోవాలి అంటే దానికి తగిన ఆర్థిక విద్య అత్యవసరం. కేవలం, సామాజిక హోదా పెంపునకు లేదా నలుగురు చేస్తున్న ఆర్థిక కార్యకలాపాలను అనుకరించటం వల్ల లాభం లేదు.

పొదుపు - బీమాల జత

సాధారణంగా బ్యాంకులతో పొదుపు

నీవు ఏం చేస్తున్నావో తెలియని స్థితి నుంచే రిస్క్ జనిస్తుంది.
–వారన్ బఫెట్

ఇవాళ నీకు తన నీడలో చోటిచ్చిన ఆ చెట్టు మరొకరు ఎప్పుడో నాటినది.
– వారన్ బఫెట్

చేయాలనుకునే వినియోగదారులు 'ఫిక్స్‌డ్ డిపాజిట్స్' చేసే సమయంలో, బ్యాంకు మేనేజర్లు లేదా సిబ్బంది రకరకాల పథకాలవైపు 'దృష్టి' మరలేలా సలహాలు ఇస్తుంటారు.

పొదుపుతోపాటు జీవిత బీమా లేదా ప్రమాద బీమా మొదలైన అనేక పథకాలను ఎఫ్‌డిలతోపాటు 'లింక్' లేదా జత చేసేలా ప్రోత్సహిస్తారు.

ఆచితూచి

బ్యాంకు మేనేజర్లు కదా, మన మంచికోసమే సలహాలు ఇస్తున్నారు అనే భ్రాంతిలోకి జారకూడదు.

ఏ వ్యక్తి అయినా, సంస్థ అయినా, వారి స్వార్థం కోసం 'మేధావి ముసుగు'లో 'జనాల సొమ్ము'తో ఆటలు ఆడుకుంటారు.

తెలివైనవారి మాటల మర్మాన్ని గ్రహించటం తేలికైన విషయం కాదు.

పొదుపు ఖాతాలతో ఎలాంటి బీమా పథకాలను జత చేయకండి. ఒకవేళ మీకు బీమా అవసరం ఉంటే దానికి ప్రత్యేకంగా బీమా సంస్థలలో విడిగా పాలసీలపై పెట్టుబడులు పెట్టటం ఉత్తమం.

బ్యాంకులలో సిబ్బంది ఇచ్చే అప్లికేషన్స్, లావాదేవీల కాగితాలలోని విషయాలు అర్థం చేసుకున్న తర్వాత మీరు మీ సమ్మతిని చెప్పండి. లేదా సంతకాలు చేయండి. అవగాహన లేకుండా ఖాళీ పేపర్లపై సంతకాలు చేయడంవల్ల 'ఆర్థిక నష్టాలకు' గురి అవుతారు.

బాధ్యతాయుత రుణాలు

గృహాల కొనుగోలు కోసం, విద్యా సముపార్జన కోసం, గృహ స్థలాల కోసం, వ్యాపార అవసరాల నిమిత్తం ఆస్తులపై పెట్టుబడుల కోసం చేసే అప్పులు

'కార్టూన్ పోటీ - 2023'లో ప్రోత్సాహక బహుమతికి ఎంపికైనది



పెట్టుబడులు

భారతదేశంలో బంగారం కొనుగోళ్లు, అమ్మకాల జోరు చాలా ఎక్కువగా కొనసాగుతుంది. దీర్ఘకాలంలో బంగారంవల్ల అత్యధిక లాభం చేకూరుతుంది. స్వల్పకాలంలో నిదానంగా బంగారం ధరలు పెరుగుతున్నట్లు కనిపించినా, దీర్ఘకాలంతో తగిన మొత్తంలో 'ఆర్థిక ప్రయోజనా'న్ని బంగారం అందిస్తుంది.

లేదా రుణాలను 'బాధ్యతాయుత రుణాలు'గా పరిగణించవచ్చు. వీటివలన, దీర్ఘకాలంలో మదుపరులకు 'క్యాపిటల్ గెయిన్స్' సంప్రాప్తిస్తాయి.

వైయక్తిక అవసరాల కోసం, విందులు, ఆర్భాటాల కోసం, పెళ్లి పేరంటాల కోసం, సామాజిక హోదాల ప్రదర్శన కోసం చేసే రుణాల వల్ల స్వల్ప కాలికంగా సంతోషించినా, దీర్ఘకాలంలో నష్టాలను చవి చూడాల్సి ఉంటుంది.

ఆర్థిక క్రమశిక్షణ లేక అనేకమంది యువకులు రుణాలు – వాటివల్ల సంప్రాప్తించే పర్యవసానాలు అంచనా వేయకుండా విచ్చలవిడిగా చేతిలో ఉన్న బ్యాంకుల అప్పుల సౌకర్యాలను 'క్రెడిట్ కార్డుల'తో దీర్ఘకాలిక రుణాలను చేయటం వల్ల నష్టాల ఊబిలోకి చేరతారు. అప్పులపై ఆధారపడి జీవించటంవల్ల దీర్ఘకాలంలో అప్పులు పెరిగి, తిరిగి చెల్లింపులు భారంగా మారతాయి. ఆర్థిక స్థోమత, తిరిగి చెల్లించే సామర్థ్యాలను పరిగణలోకి తీసుకోతగిన రీతిలో తక్కువ వడ్డీరేట్లకు బాధ్యతాయుతంగా రుణాలు చేయాలి.

బంగారం, ద్రవ్యత్వ లాభాలు

భారతదేశంలో బంగారం కొనుగోళ్లు, అమ్మకాల జోరు చాలా ఎక్కువగా కొనసాగుతుంది. దీర్ఘకాలంలో బంగారంవల్ల అత్యధిక లాభం చేకూరుతుంది. స్వల్పకాలంలో నిదానంగా బంగారం ధరలు పెరుగుతున్నట్లు కనిపించినా, దీర్ఘకాలంతో తగిన మొత్తంలో 'ఆర్థిక ప్రయోజనా'న్ని బంగారం అందిస్తుంది.

దేశంలో 'డిజిటల్ గోల్డు' పథకంలో 20 మిలియన్లమంది కష్టమర్లు ఉన్నారు.

ఐదు సంవత్సరాల కాలంలో బంగారంపై 11శాతం మేరకు 'రిటర్న్'లు వస్తాయి. అదే సంవత్సరంలో 10, ఆపై కాలంలో 17 శాతం మేరకు లాభాలను బంగారంపై పెట్టుబడులు సమకూరుస్తాయి.

అతి స్వల్ప మొత్తంలో అనగా 1/2 గ్రాము రూపంలో, గ్రాము రూపంలో నెలవారీ 'పొదుపు' చేయవచ్చును. బంగారం అమ్మకం – కొనుగోళ్లపై ఎలాంటి డి– మాట్ అకౌంటు లేదా షేర్లు కోసం కావలసిన ట్రేడింగ్ సాంకేతికతలు అవసరం లేదు.

భారతీయులకు బంగారం 'భరోసా'ను కల్పించటంలో, సంస్కృతి సంప్రదాయంలో, భవిష్యత్‌పై భద్రత కోసం ఉపకరిస్తుంది. కనుక, బంగారం ఎన్నటికైనా బంగారమే.

బాధ్యతాయుతమైన రుణసేకరణ - పెట్టుబడులు

వ్యక్తి జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి ఎలా సంపద సృష్టించాలి అన్నదే ప్రధాన ఆర్థికాంశం.

సంపద మాత్రమే సంపదను సృష్టించి, పెంపొందింపజేస్తుంది కనుక ప్రాథమికంగా సంపదపై స్పష్టమైన దృష్టిపెట్టవలసిన ఆవశ్యకత ఉంది.

గృహాల కొనుగోలు కోసం రుణాలు తీసుకొని, ఈఎంఐల ద్వారా దీర్ఘకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా సంపదను సృష్టించవచ్చు.

అదేవిధంగా, ఉన్నత విద్యకోసం రుణాలు తీసుకొని, ఉపాధి పొందిన తరువాత తిరిగి చెల్లింపులు చేయటంవల్ల అధిక వేతనాన్ని పొందేందుకు, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొనేందుకు మార్గం సులభతరమౌతుంది.

వేటికోసం 'అప్పులు' చేస్తే అధిక ప్రయోజనం పొందుతాం? ఎటువంటి అవసరాల కోసం అప్పులు చేయకూడదు? అప్పులను ఎంతమేరకు చేయాలి? తిరిగి చెల్లింపు సామర్థ్యం ఎంత? వంటి అంశాలను అవగాహన చేసుకోవాలి.

ఆర్థిక నేరాలు - మోసాలు

అధిక రాబడులను 'ఎర'గా చూపి అధిక మొత్తంలో 'డిపాజిట్లు' సేకరించి తెలివిగా మోసగిస్తున్న పథకాలపట్ల తగిన అప్రమత్తత చాలా అవసరం. ఇలాంటి వారి వలలో పరిస్థితులలో ఆకర్షితులు కాకూడదు.

కె. గోపీకృష్ణ

విశ్రాంత ఉపన్యాసకులు

ప్రభుత్వ రంగ బ్యాంకులకన్నా తక్కువ వడ్డీలకు రుణాలు అందచేస్తామనే ఆర్థిక సంస్థలు లోపాయకారిగా వడ్డీరేట్లను తక్కువచేసి చూపుతూ, రుణాలను ప్రాసెసింగ్ ఫీజులు పేరుతో అధిక వడ్డీలను రుణగ్రహీతల నుండి వసూలు చేస్తాయి.

అంకెల గారడీలు, ప్రకటనలు, రంగురంగుల ఊహాచిత్రాలు, మాటల గారడీలు మొదలైన వాటి పట్ల జాగరూకులై మెలగటం వల్ల ఆర్థిక సంరక్షణ పొందగలరు.

ఆర్థిక మాంద్యం

ప్రపంచం నేడు 'ఆర్థిక మాంద్యాన్ని' ఎదుర్కొంటోంది. మనం అందరం దాని ప్రభావానికి ఎంతో కొంత గురికాకుండా తప్పించుకోలేం.

ఆర్థిక మాంద్యం అంటే 'ఆర్థిక కార్యకలాపాలు' సన్నగిల్లటం వల్ల దేశాల 'ఆర్థిక వృద్ధి' తగ్గి ఉపాధి కల్పన జరగక, ఒక అస్థిరమైన స్థితిని పొందటంగా చెప్పవచ్చు.

దేశీయ స్థూల ఉత్పత్తి (జిడిపి)లు తగ్గటంవల్ల, మరొకవైపు తీవ్రమైన 'ధరల పెరుగుదల' ఫలితంగా జీవన ప్రమాణాలు పడిపోతాయి.

'ద్రవ్యోల్బణ' స్థితి నియంత్రించేందుకు బ్యాంకుల వడ్డీరేట్లకు 'రిజర్వుబ్యాంకు' 'రెపోరేట్లు' పెంచటంవల్ల ద్రవ్య సరఫరా తగ్గుతుంది. ఫలితంగా ధరల పెరుగుదలను నియంత్రించవచ్చు.

బ్యాంకుల వడ్డీరేట్లు పెరగటంవల్ల, వివిధ వ్యక్తిగత, గృహావసరాలు, నిర్మాణం కోసం, చదువుల కోసం చేసిన అప్పులపై వడ్డీలు పెరుగుతాయి. అందువల్ల, ద్రవ్య సరఫరా తగ్గి, వస్తువుల ధరలు నియంత్రణలో ఉంటాయి.

ఈ పరిస్థితులలో, స్టాక్‌మార్కెట్లలో పెట్టుబడుల వల్ల లాభాలు ఆర్జించ గలుగుతారు. ఆర్థిక స్థితిగతులపై ఆధారపడి షేర్ల ధరల పెరుగుదల, తగ్గుదలలు ఉంటాయి కనుక, తగిన పెట్టుబడులు పెంచుకోవాలి.

(సశేషం)

చరిత్ర వక్రీకరణ

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ... భారతీయ జనతాపార్టీ జాతీయ నాయకత్వం తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. వాస్తవానికి దాదాపు గడిచిన ఐదారేళ్లుగా ఇక్కడ దృష్టి సారించినప్పటికీ.. ఇప్పుడు దానిని మరింత నిశితం చేసింది. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్‌లో నిర్వహించినప్పటి నుంచీ తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. తరచూ జాతీయ స్థాయి నాయకుల కార్యకలాపాలు, పర్యటనలు, సభలు, సమావేశాలు ఉండేలా చూసుకుంటోంది. అయితే, ఇదే సమయంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రత్యేకంగా భావించి చేపట్టింది. సాక్షాత్తూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించింది.

వాస్తవానికి తెలంగాణలో సెప్టెంబర్ 17వ తేదీ పరిణామంపై భిన్న, విభిన్న వాదనలు ఉన్నాయి. మొదటినుంచీ అలాంటి వేర్వేరు వాదనలు కొనసాగుతున్నాయి. పార్టీలను బట్టి నినాదాలు, వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, బీజేపీ తొలి నుంచీ 'హైదరాబాద్ సంస్థానం విమోచన దినోత్సవం' అనే పిలుస్తోంది. అధికార బీఆర్ఎస్ తొలినాళ్లలో దీనిని 'విలీన దినోత్సవం'గా పేర్కొంది. ఈ ఏడాది 'జాతీయ సమైక్యతా దినోత్సవం' అని కొత్త నినాదం ఎత్తుకుంది. అంతేకాదు.. పాతబస్తీలో ఎంఐఎం పార్టీతో కలిసి వేడుకలు నిర్వహించింది. ఇక కాంగ్రెస్ పార్టీ, తొలినుంచీ తనదైన వాదనను వినిపిస్తోంది. ఈ క్రమంలోనే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారికంగా హైదరాబాద్ గడ్డపై తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించింది.

నిజానికి గతేడాది నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినవేడుకలను చేపడుతోంది. నిరుడు ఢిల్లీ వేదికగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు జరిగాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నీ తానై ఆ వేడుకలను నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పలువురు కేంద్రమంత్రులు పాల్గొన్నారు. ఈసారి సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ విమోచన దినోత్సవం, బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్రస్థాయి బీజేపీ నేతలందరూ ఈ సభను విజయవంతం చేయడానికి శ్రమించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీ ఎత్తున బీజేపీ శ్రేణులు ఈ సభకు తరలివచ్చాయి.

పటేల్ చొరవతోనే విమోచనం : అమిత్ షా

హైదరాబాద్ సంస్థానాన్ని భారత ప్రభుత్వంలో విలీనం చేసేలా, హైదరాబాద్ సంస్థానానికి స్వతంత్రం, విముక్తి కల్పించేలా జరిగిన పరిణామాలకు సంబంధించి చరిత్రను వక్రీకరించారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆక్షేపించారు. అలాంటి వక్రీకరణను ప్రజలు ఎప్పటికీ క్షమించరని వ్యాఖ్యానించారు. చరిత్రను తొక్కిపెట్టిన వాళ్లకు ప్రజలే బుద్ధి చెబుతారని కూడా ఎన్నికల నేపథ్యంలో పరోక్షంగా అస్త్రాన్ని ఎక్కుపెట్టారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం గత పాలకులు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించలేదని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం 399 రోజులపాటు రజాకార్ల అరాచక పాలనలో మగ్గిందని, నాటి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చొరవతోనే విమోచనం లభించిందని, ఆయనే లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదని అన్నారు. 'సర్దార్ పటేల్ ఆదేశాలతో కేఎం మున్షీ నేతృత్వంలో చేపట్టిన సైనిక చర్యలతో హైదరాబాద్ స్టేట్‌కు విమోచనం కలిగింది. ఆపరేషన్ పోలో ప్రారంభించిన తర్వాత రక్తం చుక్క చిందకుండా నిజాం పాలన అంతమైంది' అని తెలిపారు.

ఆనాడు తెలంగాణ విముక్తి ఉద్యమంలో ఆర్య సమాజ్, హిందూ మహాసభ వంటి ఎన్నో సంస్థలు పనిచేశాయని, ఉస్మానియా యూనివర్సిటీలో వందేమాతర నినాదంతో నిజాం గుండెల్లో రైళ్లు పరిగెత్తాయని ఆయన అన్నారు. రావి నారాయణరెడ్డి, రామనంద తీర్థ, బద్దం ఎల్లారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, నారాయణరావు పవార్, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు వంటి ఎంతో మంది పోరాటంలో పాల్గొన్నారని గుర్తుచేస్తూ వారికి నివాళులు అర్పించారు. ఇప్పటిదాకా దేశంలోని ఏ ప్రభుత్వం కూడా తెలంగాణ స్వాతంత్ర్య పోరాటాన్ని గురించి చెప్పేందుకు ప్రయత్నించలేదని, ఈ పోరాటానికి సరైన గౌరవాన్ని అందించక పోగా తెలంగాణ చరిత్రను కొందరు వక్రీకరించారని అమిత్ షా మండిపడ్డారు. తెలంగాణ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినందించే లక్ష్యంతో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాకే చరిత్రను సరిచేశారని చెప్పారు. మోదీ ఆదేశాలతో అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, పోరాట స్ఫూర్తితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని అమిత్ షా అన్నారు.

జలియన్‌వాలాబాగ్‌ను గుర్తు చేసిన పరకాల

నిజాం పాలనలో పరకాలలో 1500మంది జాతీయ జెండాను ఎగరేసినందుకు వారిపై జలియన్‌వాలాబాగ్ తరహాలో కాల్పులు జరిపారని, ఇందులో పలువురు అమరులుకాగా.. మరికొందరు గాయపడ్డారని అమిత్ షా గుర్తు చేశారు. ఇదే తరహాలో మహారాష్ట్రలోని పర్భణిలో, కర్ణాటకలోని బీదర్‌లోనూ సామాన్య జనాలపై కాల్పులు జరిగాయని అన్నారు. వీటినుంచి విముక్తి కల్పించేందుకు 1948 ఆగస్టు 10నాడు సర్దార్ వల్లభాయ్ పటేల్

క్షంతవ్యం కాదు!

సంకల్పించారని, సెప్టెంబర్ 17 నాటికి మిషన్ పూర్తి చేసి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించారని ఆయన చెప్పారు.

మోదీకి జన్మదిన శుభాకాంక్షలు

సెప్టెంబర్ 17నే ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజని, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అమిత్ షా అన్నారు. "ప్రపంచవ్యాప్తంగా దేశ గౌరవాన్ని ఇనుమడింపజేసేలా మోదీ కృషిచేస్తున్నారన్నారు. ఆయన కృషి ఫలితంగానే.. ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే 5వ స్థానానికి చేరింది. జీ20 సమావేశాల ద్వారా భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి మరోసారి తెలియ చేశాం. జీ 20లో ఆఫ్రికన్ యూనియన్‌కు స్థానం కల్పించి ఢిల్లీ డిక్లరేషన్‌తో భారత కీర్తిని ప్రపంచానికి చాటారు. భారతదేశం సాధిస్తున్న ప్రగతిని నేడు ప్రపంచమంతా ప్రశంసిస్తున్నది. మోదీ పాలనలో దేశం అభివృద్ధిలో దూసుకు పోతున్నది" అని అమిత్ షా చెప్పారు.

లోక్‌సభలో తెలంగాణ ఆవిర్భావ జ్ఞాపకాలు

మరోవైపు.. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సందర్భంగా ప్రధాని మోదీ లోక్‌సభలో కీలక ప్రసంగం చేస్తూ, ఆంధ్రప్రదేశ్ విభజన అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పాటు ఎంతో ప్రయాసతో జరిగిందన్నారు. 2000వ సంవత్సరంలో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో మూడు ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పాటు చేసినప్పటి పరిస్థితులను కూడా మననం చేసుకున్నారు. అప్పటికి, తెలంగాణ ఇచ్చినప్పటి పరిస్థితులను బేరీజు వేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశాలు తొలిరోజు పార్లమెంట్ పాత భవనంలో జరగగా, రెండోరోజు నుంచి కొత్త భవనంలోకి మారాయి. పార్లమెంటు 75 ఏళ్ల ప్రస్థానంపై పాత భవనంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ లోక్‌సభలో ప్రసంగించారు. పాత భవనానికి వీడ్కోలు పలుకుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ, 'తెలంగాణ ఏర్పాటు ఈ పార్లమెంట్ భవనంలోనే జరిగింది. కానీ, ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లా ఏపీ, తెలంగాణ విభజన జరగలేదు. వాజ్‌పేయ్ హయాంలో మూడు రాష్ట్రాల విభజన ప్రణాళికాబద్ధంగా జరిగింది. అప్పుడు అన్ని చోట్లా సంబరాలు జరిగాయి. కానీ, ఆంధ్రప్రదేశ్ విభజన ఏపీ, తెలంగాణ ఇరువర్గాలనూ సంతృప్తిపర్చలేక పోయింది. తెలంగాణ ఏర్పాటు ఎంతో ప్రయాసతో జరిగింది. కొత్త రాష్ట్రం వచ్చినా తెలంగాణ సంబరాలు చేసుకోలేకపోయిందని మోదీ తెలిపారు.

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రధానంగా మంత్రి కె.తారకరామారావు ఇతర నేతలు.. నరేంద్రమోదీని లక్ష్యంగా చేసుకున్నారు. అయితే బీఆర్ఎస్ నేతల విమర్శలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇస్తూ, ప్రధాని మోదీ ఎవరినీ విమర్శించ లేదని, రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా నిలిచిన అంశాలనే ప్రస్తావించారని స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో పెప్పర్ స్ప్రేను వాడలేదా? పార్లమెంట్ తలుపులు మూయలేదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కుటుంబం దేనిని అర్థం చేసుకునే పరిస్థితిలో లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం... నీళ్లు, నిధులు, నియామకాలు అనే తెలంగాణ లక్ష్యాన్ని దెబ్బతీసిందన్నారు. గతంలో ఇదే బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీతో అధికారం పంచుకుందన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వడంలో ఆలస్యం చేసిందని ఆరోపించారు.

త్వరలో తెలంగాణకు ప్రధాని

మరోవైపు.. తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిన బీజేపీ అక్టోబర్‌లో మరో కీలక పర్యటన చేపట్ట బోతోంది. ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణలో పర్యటించబోతున్నారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రధాని రాష్ట్రానికి రాబోతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో రాష్ట్ర పర్యటనకు ప్రణాళికలు రచిస్తోంది. 2,3,4వ తేదీల్లో ఏదో ఒకరోజు ఈ పర్యటన ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసే అవకాశం ఉందని వివరిస్తున్నారు. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ప్రారంభోత్సవంతో పాటు రోడ్ షో నిర్వహించాలని బీజేపీ అక్కడి నేతలు నిర్ణయించారని చెబుతున్నారు. అలాగే మహబూబ్ నగర్ లేదా నిజామాబాద్‌లో బహిరంగ సభ కూడా ఏర్పాటు చేయాలని యోచి స్తున్నారని సమాచారం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

అరుణాచల్‌ప్రదేశ్: సేవికా సమితి ఆధ్వర్యంలోని ట్రస్టు ద్వారా సెప్టెంబర్ 13 నుంచి 17వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో మత్తుమందుల వ్యసనానికి వ్యతిరేకంగా ప్రజా చైతన్యాన్ని కలిగించే దిశలో 438 మంది విద్యార్థులకు క్రీడ, యోగ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు.

కథ

‘కిచ.. కిచ..’మని సవ్వడి చేసింది పంజరంలోని చిలుక.

బాల్కనీలో కూర్చుని పొద్దుటి కాఫీ తాగుతూ ఆలోచనల్లో ఉన్న అతడు తలతిప్పి పంజరం వైపు చూశాడు. అది అటూ ఇటూ తిరుగుతూ హడావిడి చేస్తోంది.

అతడు చెయ్యెత్తి పంజరాన్ని తట్టాడు. అది అలవోకగా దాని కిటికీ తెరుచుకుని బయటకు గెంతింది.

వచ్చి భుజంపై వాలిన చిలుకను ప్రేమగా నిమిరాడు.

అతడు ఎప్పటి నుంచో చిలకలను పెంచుతున్నాడు. అనేక కారణాల వల్ల అవి తరచూ మృత్యువాత పడుతూ ఉన్నాయి. అయినా, ఆయన చిలకలను తేవడం మానలేదు.

అందుకే కొందరు ‘ఈయనకు చిలుకల పిచ్చి’ అని వ్యంగ్యంగా కామెంట్స్ విసురుతూ ఉంటారు.

అతడి భుజం మీంచి ఎగిరిన చిలుక బాల్కనీ అంతా చక్కబెట్టింది. మొక్కల్లో ఏవో తింది. కాసేపు దిక్కులు చూసింది. దానికక్కడేమీ ఊసు పోలేదేమో రివ్వున ఇంట్లోకి దూసుపోయింది.

కామన్ కిచెన్‌లో ఫ్రిజ్జు పక్కన ఉన్న నేప్కిన్ హేంగర్ మీద వాలింది.

“తేవడానికి ఆయనకు బుద్ధిలేదు. తగుదునమ్మా అంటూ ఎగరడానికి నీకు సిగ్గులేదు. మధ్యలో నేను ఛస్తున్నా–ఆయనతోపాటు నీకూ సేవలు చేయలేక” అని విసుక్కుందావిడ టిఫిన్ సిద్ధం చేస్తూనే.

పాపం కాన్వెంటు పిల్లల్లాగా అది కూడా తెలుగు లాంగ్వేజిలో వీక్ కావడం వల్ల ఆవిడ ఘోష అర్థం కాక, కదలక మెదలక అలాగే ఉండిపోయింది.

“అమ్మా.. పేరట్టు మీరు సెప్పినట్టే ఇంటాది” అంది, వంటలో సహాయం చేస్తున్న పని మనిషి.

‘‘వింటుందే, అది మనుషులంత మూర్ఖురాలు కాదు. చదివిస్తే అది కూడా నీలా టెన్త్ పాసైపోయేది” అందావిడ, ఎవరిని తిడుతోందో తెలియకుండా.

“ఎందుకమ్మా.. అంత కోపం?” అంది పనిమనిషి.. ఆమె తనను కూడా అంటోందనిపించి.

‘‘కోపం కాకపోతే మరేంటే? ఆయన కంటే ఎలాగూ తప్పదు. దీని తిండీ తిప్పలు చూడాలి, ఆ పంజరం శుభ్రంచేయాలి, ఇంట్లో ఎక్కడైనా పాడుచేస్తే నువ్వు సాయం కూడా చెయ్యవు. నేనొప్పుకోలేదుగా అమ్మా అంటావు. అన్నీ ఎవరు చేస్తారు?” అంది ఆమె టిఫిన్ సంగతి చూస్తూనే.

ఇంతలో కిందనేవో పెద్దగా చప్పుళ్లు, అరుపులు వినిపించడంతో ఆవిడ బెడ్ రూమ్‌లోకి వెళ్లి కిటికీలోంచి బయటకు చూసింది.

ఏదో టెంపో వచ్చింది. సామానులు దించుతున్నారు.

“ఏందమ్మా హడావిడి” అంది పని మనిషి, ఆవిడ తిరిగి వంటింట్లోకి రాగానే.

“వినాయక చవితి కదే” అంది సమాధానంగా ఆవిడ.

* * *

సుమారు రెండు కిలోమీటర్లు దూరం ఉన్న మెయిన్ గేట్‌దగ్గర నుంచి మూడు టవర్లనీ కలుపుతూ లైట్లు అలంకరించారు. అడుగడుక్కీ కాషాయం జెండాలుకట్టారు. ఆ గేటెడ్ కమ్యూనిటీలోని రోడ్ల న్నిటినీ తుడిచి శుభ్రంచేశారు హౌస్ కీపింగ్ సిబ్బంది. సాంస్కృతిక కార్యక్రమాల కోసం పెద్ద వేదికను సిద్ధంచేశారు.

దానికి ఇరువైపులా అంతెత్తున భారీ స్పీకర్లు అమర్చారు. ఓ పక్కన కరవోకేతో సహా భక్తులు కోరిన ఏ పాటనైనా వినిపించగలిగే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మ్యూజిక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. వెనుక వినాయకుడి బొమ్మతోపాటు, దానికి ఒకవైపు హిందీలో, మరోవైపు ఇంగ్లీషులో ‘శుక్లాం బరధరం’ రాసిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

ఆ శ్లోకం తెలుగులో లేకపోవడంపై కమిటీలో ముందే చర్చ జరిగింది. తల్లిభాషను కాపాడుకోవాలని వాదించిన ఓ పెద్దాయన మాటను ఎవరూ పట్టించుకోలేదు.

చిలుక

దేశరాజు

‘మన దగ్గర నార్త్ ఇండియన్సే ఎక్కువ. హిందీ, ఇంగ్లీషులో ఉంటే అందరికీ అర్థమవుతుంది. మీరన్నట్టు చాలామంది తెలుగు మాట్లాడతారు. కానీ, వారిలో తెలుగు చదవగలిగేవారు తక్కువ. మీ పిల్లలకు వచ్చేమోగానీ, మీ మనవలు తెలుగు చదవ గలరా?’ అని అందరూ నిలదీసే సరికి, పాపం ఆయన తోక ముడవక తప్పలేదు.

“భాష ఏదైతేనేం.. భక్తి ముఖ్యం” అని ఆ భాషా ప్రియుడు తనకుతాను నచ్చజెప్పుకున్నాడు.

రేకులతో వేసిన విశాలమైన పందిరిలో ఐదడుగుల మట్టి గణపతిని కొలువుదీర్చారు. పూజలు చేయించుకునేవారు కూర్చోవడానికి వీలుగా కార్పెట్ పరిచారు. క్లబ్ హౌస్‌కీ, స్విమ్మింగ్ పూల్‌కీ మధ్యలో మిగిలిన ఖాళీస్థలంలో పొద్దున్న ప్రసాదాలు, సాయంత్రం అందరికీ ఫలహారాలు వండడానికి వీలుగా గ్యాసు పొయ్యిలు, వంట సామానులు సిద్ధంగా వున్నాయి.

ఆడిదాస్ అని పెద్దగా రాసున్న షార్ట్, పోలో టీ షర్ట్ వేసుకుని ఆయన అన్నింటినీ జాగ్రత్తగా పర్య వేక్షిస్తూ బాస్కెట్ బాల్ కోర్టు దగ్గరకు వచ్చాడు. చిన్నపిల్లలు ఒక బాస్కెట్ దగ్గర, ఇంకొంచెం పెద్ద పిల్లలు మరో బాస్కెట్ దగ్గర గోలగా ఆడుకుంటు న్నారు. ఇంతలో వాళ్ల బాల్ కోర్టులోంచి బయటకు వచ్చింది.

రెండడుగులు వేగంగా వేసి దాన్ని అంది పుచ్చుకుని నడుం దగ్గర చేత్తో బాల్‌ను అదిమి పెట్టుకుని ఏమీ ఎరగనట్టు వక్కనవారితో మాట్లాడుతూ వెళ్లిపో సాగాడు ఆయన. పిల్లలు మొదట కంగారు పడ్డారు. కానీ, బాల్ సొంతదారైన పిల్లాడు పరిగెట్టుకు వచ్చి..

“అంకుల్ బాల్ ప్లీజ్” అని బతిమిలాడాడు.

“అంకులేంట్రా.. అంకుల్” అని పిల్లాడ్ని గదమా యించాడు.

ఆయన పక్కనున్నవాళ్లు నవ్వుతూ చూస్తున్నారు. మళ్లీ ఆయనే “ఇవాళే లాస్ట్. రేపటి నుంచి ఆడ్డానికి వీల్లేదు. ఆ పక్కన వంటలు చేస్తారు. ఇక్కడ జనాలు తిరుగుతూంటారు. మీరు ఇలా ఆడితే ఎలా?” అని బాల్‌ని కుడిచేత్తో గిరగిరా తిప్పుతూ ప్రశ్నించాడు.

దానికి పిల్లాడేమీ సమాధానం చెప్పకుండా బాల్ వైపే చూస్తూ వున్నాడు.

“ఫ్రం టుమారో ఆన్‌వర్డ్స్..” అని ఆయన అంటుండగానే,

“ఉయ్ డోన్ట్ ప్లే” అన్నారు పిల్లలంతా.

“గుడ్” అని వారిని అభినందించి బాల్‌ని బలంగా బాస్కెట్‌లోకి విసిరాడు. అది అంత వరకూ పోకుండానే కింద పడిపోయింది.

పిల్లలు గోలగా అరుస్తూ బాల్ కోసం పరిగెట్టారు.

‘ఇంతకు రెట్టింపు దూరం నుంచీ కూడా గురి తప్పకుండా బాస్కెట్‌లో వేసేవాడినే, ఈసారేమైంది?’ అని అతను ఆశ్చర్యపోయాడు.

ఆయన భుజం మీది చిలుక మౌనంగా దిక్కులు చూస్తూ ఉంది.

* * *

వినాయక చవితి రోజు మండపంలో పూజా కార్యక్రమం సాయంత్రం పెట్టారు.

ఆమె పట్టుచీర కట్టుకుంది. ఆయన పట్టు పైజామా, లాల్చీ వేసుకున్నాడు. బయల్దేరబోతుంటే ఆమె దగ్గరకు వచ్చి, ఆయన పక్కనే నిలబడి.. తన మొబైల్‌తో సెల్ఫీలు తీసింది. వారిద్దరితోపాటు వెనుక గోడకు తగిలించిన పెద్ద గిటార్ కూడా ఫొటోలో రావడంతో మంచి లుక్ వచ్చింది. దానికి తోడు ఆయన భుజంపై చిలుక ఉండనే ఉంది.

ఆమె మంచి ఫొటోను ఎంపిక చేసుకుంటూ “మీరు పదండి.. నేను వస్తాను” అంది.



మండపంలో వినాయకుడి పూజ పూర్తయ్యేసరికి తొమ్మిదయ్యింది. అందుకే తొలి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దగా జరగలేదు. ఒకరిద్దరు పిల్లలు శ్లోకాలు చదివారు. ఒక పెద్దాయన భగవద్గీతలో శ్లోకాలకు తాత్పర్యం చెప్పాడు.

ఆడవాళ్లంతా ప్రత్యేకంగా తయారయ్యారు. ఖరీదైన చీరల జిలుగులు, అంతకంటే ఖరీదైన నగల మెరుపులు, లిప్టిక్ నవ్వులు.. విద్యుత్ కాంతులతో పోటీపడ్డాయి. కానీ, ఇంట్లో పూజ కోసం ఏ తెల్లవారు జామునో లేచి, వంటలు అవీ చేసుకుని ఉండటం వల్ల అందరి ముఖాల్లో అలసట కొట్టొచ్చినట్టు కనిపి

స్తోంది.

"ఈ మాత్రానికే వీళ్లింత అలిసిపోతే, నిన్నటి నుంచి ఎన్ని పనులు చేయడం లేదు నేనూ" అన్నాడు చిలుకతో.

అది ఏదో అంది. కానీ, అక్కడి హడావిడిలో అతడికి అర్థం కాలేదు.

* * *

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్పోర్ట్స్ కాంపిటీషన్స్ నిర్వహించడం ఈ గేటెడ్ కమ్యూనిటీ ప్రత్యేకత. మూడు టవర్లలో ఇరవైకి పైగా ఉన్న బ్లాక్స్ లోని అయిదారు వందల ఫ్లాట్లలోని జనాలంతా కలిసి సామూహికంగా నిర్వహించుకునే కార్యక్రమం ఇదొక్కటే కావడం ఇందుకు ప్రధాన కారణం. అందుకే వీలైనంత ఘనంగా నిర్వహించడానికి, అందరినీ కలుపుకొని పోవడానికి వీలుగా ఉట్టి కొట్టడం సహా అనేక కార్యక్రమాలను ఈ ఉత్సవాలలో కలిపేశారు.

ఆటల పోటీల్లో భాగంగా ఆ రోజు పొద్దున్నే బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. రెగ్యులర్‌గా బ్యాడ్మింటన్ ఆడేవారితోపాటు సరదాగా పోటీల్లో పాల్గొనాలను కునేవారు అనేకమంది వచ్చారు. దాంతో ఆ ప్రాంతమంతా విజిల్స్, చప్పట్లు, అరుపులు, కేకలతో సందడి నెలకొంది.

బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఆయన టీమ్ గెలుపునకు దగ్గరగా వుంది. అటువైపు వాళ్లు కూడా పోటీగా ఆడుతున్నారు. ఇంతలో అటు నుంచి వచ్చిన కాక్ కరెక్ట్‌గా బ్యాట్‌కు అందేలా పైకి వచ్చింది. అతను మరింత ఎగిరి దాన్ని స్మాష్ కొట్ట బోయాడు. కానీ, కాక్ మిస్సయ్యింది.

అతను ముందుకు తూలి పడబోయాడు.

"ఇదేం ఇంటర్నేషనల్ మ్యాచ్ కాదు, జాగ్రత్త" అన్నాడు పక్కాయన, దగ్గరగా వచ్చి.

'ఫర్వాలేదు' అని సైగ చేశాడు. కానీ, వాళ్లు మ్యాచ్ ఓడిపోవాల్సి వచ్చింది.

అతడు నిరుత్సాహపడ్డాడు. ఎప్పుడూ చురుగ్గా అటూఇటూ పరిగెడుతూ, ముందుకు గెంతుతూ హుషారుగా ఆడేవాడు. ఓడిపోయేది అరుదు. ఎప్పుడైనా ఓడినా ఒకట్రెండు పాయింట్ల తేడాతోనే.

'ఈసారేమైందబ్బా' అనుకున్నాడు.

అప్పటి వరకు పక్క పోల్‌పై వాలిన చిలుక తిరిగొచ్చి ఆయన భుజంపై వాలింది.

* * *

బ్లాక్ కలర్ టైట్ నిక్కర్‌పై వైట్ షర్ట్‌తో స్విమ్మింగ్‌కు రెడీ అయి వచ్చాడాయన.

"ఏంటి రెచ్చిపోతున్నారు? తగ్గరా అసలు.." అంటూ పలకరించాడు బ్యాడ్మింటన్‌లో ఓడించి నాయన.

వెంటనే "ఎందుకు తగ్గాలి?" అని బదులిచ్చి, గట్టిగా నవ్వేశాడు.

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్పోర్ట్స్ కాంపిటీషన్స్ నిర్వహించడం ఈ గేటెడ్ కమ్యూనిటీ ప్రత్యేకత. మూడు టవర్లలో ఇరవైకి పైగా ఉన్న బ్లాక్స్ లోని అయిదారు వందల ఫ్లాట్లలోని జనాలంతా కలిసి సామూహికంగా నిర్వహించుకునే కార్యక్రమం ఇదొక్కటే కావడం ఇందుకు ప్రధాన కారణం. అందుకే వీలైనంత ఘనంగా నిర్వహించడానికి, అందరినీ కలుపుకొని పోవడానికి వీలుగా ఉట్టి కొట్టడం సహా అనేక కార్యక్రమాలను ఈ ఉత్సవాలలో కలిపేశారు.

స్విమ్మింగ్ పూల్ చుట్టూ రెయిలింగ్‌కి ఆనుకుని ఆడామగా అందరూ ఉత్సాహంగా పోటీలు చూస్తు న్నారు. అప్పుడే పిల్లల పోటీ పూర్తవడంతో అంతా సెల్ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీస్తూ బిజీగా కనిపించారు.

కాసేపటికి వాళ్ల రౌండ్ మొదలైంది.

విజిల్ ఊదగానే ముందుకు ఉరికి ఈత కొట్టడం ప్రారంభించాడు. కానీ, సగం వరకూ వెళ్లే సరికే ఆయాసం వచ్చింది. అయినా, పట్టుదలగా వేగంగా ముందుకు కదిలాడు.

ఆయన మానసిక ఉత్సాహానికి శరీరం సహక రించనని మొండికేసింది. ముక్కలోకి నీళ్లు పోయాయి. ఇక తట్టుకోలేకపోయాడు. పెద్దగా దగ్గుతూ పైకి లేచిపోయాడు. చూస్తే.. అప్పటికే నలుగురు గమ్యం చేరుకున్నారు. ఇంకో ముగ్గురు వస్తున్నారు. దగ్గు ఎక్కువ కావడంతో ఒకరిద్దరు ముందుకు వచ్చి ఆయనను పైకి తీసుకొచ్చారు.

వరుసగా నిన్న, ఇవాళ కూడా ఓడిపోవడం–సరదాగా పాల్గొన్నప్పటికీ–ఇబ్బందిగానే అనిపించింది ఆయనకి.

మామూలుగా అతడు నీళ్లలో తల ముంచి, చేతులు బార్లజాపి ఈత మొదలెట్టాడంటే గమ్యం చేరాకే పైకి లేచేవాడు. అంతసేపు దమ్ము పట్టడం చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. అతనికి దాదాపు పోటీ అనేదే ఉండేది కాదు. అందరికంటే చాలా ముందే గమ్యం చేరుకునేవాడు.

'అలాంటిది ఈసారేమైందబ్బా' అనుకున్నాడు ఆయన.

ఇంతలో చిలుక వచ్చి భుజంపై వాలింది. ఆయన చిరాగ్గా చేయి విదిలించాడు. అది వెంటనే ఎగిరిపోయి, గాలిలోనే ఆయనను అనుసరించ సాగింది.

* * *

ఉత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. ఆటల పోటీలు పిల్లల్లో, పెద్దల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. స్కూలు నించి వచ్చిన పిల్లలు, ఆఫీసుల నుంచి వచ్చిన పెద్దలు, ఇళ్లలోనే ఉండే వారు.. అంతా సాయంత్రం అయ్యేసరికి మండపం దగ్గరకు చేరుకుంటున్నారు. ఆటల పోటీలు, డ్యాన్స్‌ల్లో ఉత్సాహంగా పాల్గొంటు న్నారు. తరువాతి రోజుల్లో చేయబోయే కార్యక్రమాల కోసం ఎవరో ఒకరి ఇంట్లో చేరి అందరూ ప్రాక్టీసు కూడా చేస్తున్నారు. మొబైల్స్, గేమ్స్, టీవీ సీరియళ్ల నుంచి వాళ్లకు తెలియకుండానే విముక్తి పొందడంతో చాలామంది ముఖాల్లో కొత్త వెలుగు గోచరిస్తోంది.

ఇందుకోసమే.. అదరిలో ఇటువంటి సంతోషం కోసమే.. ఆయన ఈ ఉత్సవాల కోసం పట్టుబట్టాడు.

ఎప్పటి నుంచో సమష్టిగా జరుగుతున్న ఉత్స వాలు రెండు మూడేళ్ల క్రితం ఆగిపోవాల్సి వచ్చింది.

'తాగి తందనాలు ఆడుతున్నారు.. ఇదేం భక్తి'

'అడ్డమైన సినిమా పాటలకు, బూతు పాటలకు సైతం డ్యాన్స్‌లు చేస్తున్నారు' ఇవి ప్రధానమైన ఆరోపణలు.

ఇంకా.. కార్యక్రమాల నిర్వహణ సరిగా లేదని, హోమంలో ఎక్కువమంది పాల్గొనే అవకాశం కల్పించ డం లేదని, ప్రసాదాల రుచి అంతంత మాత్రమేనని.. అవి కూడా చివర్లో వచ్చిన వారికి అందడం లేదని–ఒకటా రెండా, ఎన్నెన్నో అభ్యంతరాలు.

ఒక టవర్ వారికీ, మరో టవర్ వారికీ పడకపోతే ఎవరి టవర్ దగ్గర వాళ్లే విగ్రహాలు పెట్టుకునే వారు. కానీ, ఈ అభిప్రాయ భేదాలు టవర్లు, బ్లాకులతో సంబంధం లేకుండా అందరి మధ్యనా ఉండటంతో రెండు వర్గాలు అయ్యాయి.

అప్పుడు ఆయన ముందుకొచ్చి 'వందలాది మందిని కలిపే ఉత్సవాలను ఇలాంటి చిన్నచిన్న సాకులతో ఆపేయడం సరికాద'ని నచ్చజెప్పాడు.

"మన చుట్టూ వున్న జనాలు తమ సరదాలు తీర్చుకోవడానికి ఏదో ఒక సాకు కావాలి. ఈ రోజుల్లో భక్తి కూడా అందుకు మినహాయింపు కాదు. అలాని వీళ్లందరికీ భక్తి లేదనుకుంటే పొరపాటు. పండుగ పూట పొద్దున్నే లేచి వారివారి కుల, వంశాచారాల ప్రకారం నిష్ఠగా ఇంట్లో పూజావిధులు నిర్వహించు కున్నవారే. సమష్టి కార్యక్రమం అన్నప్పుడు కొన్ని సర్దుబాటులు తప్పవు" అని ఒప్పించాడు.

అందుకే ఆయనంటే అందరికీ ప్రత్యేకమైన గౌరవం. 'ప్యారెట్ మాన్' అని అభిమానంగా పిలుచు కుంటారు. ఆ గౌరవాభిమానాలకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా కాపాడుకుంటూ వస్తున్నాడాయన.

ఎప్పటిలాగే ఈసారి కూడా చివరి రోజు చాలా మంది వచ్చారు. మళ్లీ ఏడాది దాకా కలిసే అవకాశం

ఉండదని కాబోలు చాలా ఫ్లాట్లలోని వాళ్లు ఫ్యామిలీ లతో సహా కిందకు దిగారు. సాంస్కృతిక కార్య క్రమాలు ఎడతెరిపి లేకుండా సాగు తున్నాయి. పిల్లలు సింగిల్స్‌గా, గ్రూపులుగా రకరకాల పాటలకు డ్యాన్స్‌లు చేస్తున్నారు. వాటిని తమ సెల్ ఫోన్లలో బంధించడానికి తంటాలు పడుతున్నారు తల్లులు.

సమయం పది దాటుతుండగా మొదలైంది అసలైన హడావిడి. ఈ తొమ్మిది రోజులూ రోజుకో డ్రెస్ కోడ్ నిర్ణయించుకుని ఆ ప్రకారం అలంక రించుకుని హడావిడి చేసిన లేడీస్ అంతా ఆ రోజు నెమలి పింఛం రంగు చీరలతో వేదిక పైకి వచ్చారు. రోజూ లెగ్గిన్లు, షార్ట్స్, టీ షర్ట్స్, ఫ్రాక్స్‌లో మాత్రమే చూసే వీళ్లని ఈ మేకప్పుల్లో చూస్తే సులువుగా గుర్తు పట్టడం కష్టమే.

'ఈమెలో ఇంతందం ఉందా' అని భర్త సైతం ఆశ్చర్యపోయేలా మెరిసిపోతున్నారు వాళ్లు.

'రానురానంటూనే చిన్నదో..' దగ్గర మొదలు పెట్టి 'బుల్లెటు బండి' దాటి లేటెస్ట్ సినిమా సాంగ్స్ పల్లవుల వరకూ రెచ్చిపోయి డాన్స్‌లు చేసారు. అలా రెచ్చిపోవడానికి మొహమాటమో, సిగ్గో అడ్డం పడినవాళ్లు వెనుక వరుసల్లో నిలబడి చేతులు ఊపుతూ తమ సరదా తీర్చుకున్నారు. వాళ్లు ఇబ్బంది పడకూడదని మగవాళ్లందరూ ముందే అక్కడ్నించి వెళ్లిపోయారు. పిల్లలందరూ సెల్ ఫోన్లు పట్టుకుని మమ్మీల డాన్స్‌లు రికార్డ్ చేయడంలో బిజీగా ఉన్నారు.

సుమారు గంట వరకు ఆ కోలాహలం సాగింది. అందరికీ అలసట వచ్చాక, ఒకరిపై ఒకరు వాలి పోతూ సెల్ఫీలు తీసుకున్నారు. చివరకు ఊరేగింపు నకు సిద్ధమైన విగ్రహం దగ్గరకు వచ్చి పెద్ద గ్రూప్ ఫోటో దిగారు.

ఇంతలో డప్పుల వాళ్లు అక్కడికి చేరుకున్నారు.

భార్యలు డ్యాన్సుల్లో మునిగి ఉండగా, డ్రింకుల్లో మునిగిన భర్తలు కూడా తిరిగొచ్చారు.

డప్పులు ఊపందుకుంటున్నాయి.

అప్పుడే ఆయన కూడా రంగంలోకి దిగాడు. మిలట్రీ గ్రీన్ ప్యాంట్, బ్లాక్ కలర్ టీ షర్ట్ వేసుకుని, తలకు కాషాయం రంగు రిబ్బన్ కట్టుకుని.. రావడం రావడమే డాన్స్ అందుకున్నాడు. దాంతో చుట్టూ ఉన్న వారందరూ ఉత్సాహంతో విజిల్స్ వేశారు. చప్పట్లు కొట్టారు. 'ఓ..' అంటూ కేకలు పెట్టారు. తాము ఆయనతో కలిపి చిందేయడం మొదలు పెట్టారు. ఆ గోల భరించలేని చిలుక కాస్త దూరంగా వాలి ఆయననే గమనిస్తోంది.

అలా మొదలైన ఆ ఊరేగింపు మొత్తం కమ్యూ నిటీలోని మూడు టవర్లను చుట్టుకుని బయటకు వెళ్లడానికి రెండు గంటలకు పైగానే పడుతుంది.

ఊరేగింపు మొదటి టవర్లోని రెండు బ్లాకులు దాటగానే ఆయనకు అలసటొచ్చింది. డ్యాన్స్ ఆపేసి పక్కనే వున్న బెంచీ మీద కూర్చున్నాడు. దగ్గర్లోని ఫ్లాట్‌లో ఉండే లెక్చరర్ బాటిల్ తీసుకొచ్చి మంచి నీళ్లు ఇచ్చాడు.

"ఈ ఉత్సవాలు ఇక ఈ ఏడాదితో ముగిసినట్టే. మేనేజింగ్ కమిటీలో చాలా గొడవ అయ్యింది. ఎప్పుడూ ఉండే ఆరోపణలకు తోడు ప్రసాదాలు, భోజనాలకు సరుకుల కొనుగోళ్లలో వేలకు వేలు మింగేస్తున్నారని కొట్టుకునేవరకూ వచ్చారు. మీరేమో ఈ ఉత్సవాల సందట్లో మునిగిపోయి ఉన్నారు. ఈ విషయాలన్నీ మీ వరకూ వచ్చాయో లేదో.." అన్నాడు ఆ లెక్చరర్ గడ్డం గొక్కుంటూ.

ఆయన నెమ్మదిగా బాటిల్ ఎత్తి నీళ్లు తాగాడు. కానీ ఏం మాట్లాడలేదు.

ఆయనకు తెలుసు, నలుగురు కలిసే ఏ కార్యక్రమాన్నైనా విచ్ఛిన్నం చేయడానికి అనేక మంది కాసుకుని ఉంటారని.

"ఉత్సవాల్లో క్రమేపీ రాజకీయ ప్రాబల్యం కూడా పెరుగుతోంది. మన దగ్గరనే కాదనుకోండి.." ఇంకా ఏదో చెప్పబోయాడు గడ్డపాయన.

అవేవీ వినిపించుకోకుండా "మళ్లీ మాట్లాడదాం" అని లేచిపోయాడు.

మతాన్ని విశ్వాసంగా కాక, రాజకీయంగా చూస్తే తలెత్తబోయే పరిణామా లేంటో ఆయనకు తెలుసు.

ఆయాసం తగ్గిందిగానీ, డ్యాన్స్ చేసే ఊపు రావడం లేదు. అయినా, లేచి ఊరేగింపుతో నడవడం ప్రారంభించాడు. చాలామంది ఉత్సాహంగా గెంతుతున్నారు. డప్పులు వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ మోగుతున్నాయి. తానుండే బ్లాక్ వరకూ వచ్చాక ఇక ముందుకు నడవాలని అనిపించలేదు. నెమ్మదిగా లిఫ్ట్ దగ్గరకు చేరుకున్నాడు.

మామూలుగా అయితే, మధ్యలో అప్పుడప్పుడు కాసేపు విరామం తీసుకున్నా ఊరేగింపు చివరి వరకూ ఆయన డ్యాన్స్ చేసేవాడు. చివర్లో బాణసంచా కూడా కాల్చేవాడు. అంతా అయ్యాక ఏ రెండు గంటల రాత్రో హుషారుగా ఇంటికి వెళ్లేవాడు.

'రానురానంటూనే చిన్నదో..' దగ్గర మొదలు పెట్టి 'బుల్లెటు బండి' దాటి లేటెస్ట్ సినిమా సాంగ్స్ పల్లవుల వరకూ రెచ్చిపోయి డాన్స్‌లు చేసారు. అలా రెచ్చిపోవడానికి మొహమాటమో, సిగ్గో అడ్డం పడినవాళ్లు వెనుక వరుసల్లో నిలబడి చేతులు ఊపుతూ తమ సరదా తీర్చుకున్నారు. వాళ్లు ఇబ్బంది పడకూడదని మగవాళ్లందరూ ముందే అక్కడ్నించి వెళ్లిపోయారు. పిల్లలందరూ సెల్ ఫోన్లు పట్టుకుని మమ్మీల డాన్స్‌లు రికార్డ్ చేయడంలో బిజీగా ఉన్నారు.

'అలాంటిది ఈసారి నాకేమైందబ్బా?' అనుకున్నాడు.

ఆ మాట తనలో తాను అనుకున్నాననుకున్నాడు. కానీ అప్పుడే తలుపు తీసిన ఆవిడకు వినబడింది.

"ఏమవుతుంది. వయసై పోతుంది. డెబ్భై ఏళ్లు దాటాకా కూడా కావాలంటే నవ మన్మథుడిలా అలంకరించుకోవచ్చు. కానీ, శరీరంలో ఓపిక ఉండొద్దూ.. ఆ ఎగురుళ్లకీ, గెంతులకీ? ఎంతసేపని కాసుకుని ఉండాలి నేనిక్కడ" అని అంటున్న ఆమె మాటలు ఊరేగింపులోని డప్పుల శబ్దాన్ని మించి మార్మోగుతున్నాయి.

ఆమె మాటలతో తనకేమీ సంబంధం లేదన్నట్టు ఆయన పక్క నుంచి ఎగురుకుంటూ లోపలికిపోయి తన స్థానం చేరుకుంది చిలుక.

ఆయన హాల్లోకి వచ్చి సోఫాలో కూలబడ్డాడు. ఎదురుగా ఖరీదైన పెద్ద ఫ్రేమ్‌లోని ఫొటోలో ఆయనా, ఆవిడా నవ్వులు చిందిస్తున్నారు. సప్తతి మహోత్సవం సందర్భంగా తీసిన ఫొటో అది.

ఇంతలో ఆవిడ వచ్చి "అలా ఎక్కడంటే అక్కడ కూర్చుని ఆ రంగులూ అవీ అన్నిటికీ అంటించకండి. బాత్రూమ్‌కు వెళ్లి చేతనైతే రెండు చెంబులు పోసుకోండి. లేదంటే కనీసం ఆ బట్టలు అక్కడే వాషింగ్ మిషన్‌లో పడేసి వేరేవి కట్టుకు రండి" అని తువ్వాలు మీద పడేసింది.

తువ్వాలు తీసుని వెళ్తూ గోడకు ఉన్న గిటార్‌ని తాకాడు. దానికి తీగలు లేవు.

అందుకే ఆ గిటార్ మూగగా చూసిందిగానీ, మోగలేదు.

తలవంచుకుని, సాలోచనగా ఓ నిట్టూర్పు విడిచాడాయన.

నింపాదిగా బాల్కనీలోకి వెళ్లాడు. పంజరంలోని చిలుక కళ్లుమూసుకుని ఉంది.

"నిద్రపోతున్నావా? మై ఓల్డ్ పాల్?" అని లోపలకు వేలు పెట్టి దాని ముక్కుని తట్టాడు.

అది కళ్లు తెరిచి చూసిందిగానీ, పలుకరించ లేదు.

ఆయన ఫ్రెష్ అయ్యి బెడ్రూమ్‌లోకి వెళ్లి పడుకున్నాడు.

* * *

ఆ పొద్దు ఆమెకు మెలుకవ వచ్చేసరికి బాగా తెల్లారిపోయింది.

హడావిడిగా లేచి, ఆయన వైపు చూసింది. మంచి నిద్దట్లో ఉన్నట్టున్నాడు. రాత్రంతా డ్యాన్స్‌లు చేసి అలిసిపోయాడుగా, లేపడం ఎందుకులే అనుకుని ఆమె బాల్కనీలోకి వెళ్లింది.

అక్కడి పంజరం ఖాళీగా వుంది.

చిలుక ఎగిరిపోయింది. ★

కొత్త అడుగా? చివరి

సెప్టెంబర్ 9,10 తేదీలలో దేశ రాజధానిలో భారత కీర్తి రెపరెపలాడింది. కారణం జి 20 సదస్సు. దీనికి పాకిస్తాన్ సాధారణ పౌరులు సంతోషించారు. అంతక్రితం విజయవంతంగా సాగిన చంద్రయాన్ ప్రయోగం కూడా అక్కడి వారిని ఆనందపరిచింది. కానీ పాకిస్తాన్ ప్రభుత్వం మాత్రం తన కుక్కతోక బుద్ధిని మార్చుకోవడానికి సిద్ధంగా లేదు. ఉగ్రవాదాన్నే నమ్ముకుంటున్నది. ఇందుకు ఉదాహరణ సెప్టెంబర్ 13 నాటి కొకెర్‌నాగ్ కాల్పుల ఘటన. కశ్మీర్‌లో కనీసం కొన్ని ప్రాంతాలలో అయినా మళ్లీ ఉగ్రవాదం తలెత్తుతున్నదేమోనన్న ఆందోళనలోకి దేశాన్ని ఆ ఘటన నెట్టివేసింది. కానీ ఇవన్నీ ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అన్న సామెతనే గుర్తు చేసేలా ఉన్నాయి కూడా.

అనంత్‌నాగ్ జిల్లాలోని కొకెర్‌నాగ్ ప్రాంతంలోని గడోలె అటవీప్రాంతంలో జరిగిన తాజా ఎదురుకాల్పులు ప్రశ్నార్థకమవుతున్నాయి. ఆ అటవీప్రాంతంలో నక్కిన ఉగ్రవాదులను ఏరివేసేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో ఆర్మీ కర్నల్ మన్‌ప్రీత్ సింగ్, మేజర్ అశిష్ ధొనక్, జమ్ము-కశ్మీర్ పోలీసు విభాగానికి చెందిన డి.ఎస్.పి.హుమాయూన్ భట్‌లు ముష్కరుల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందడం దేశవ్యాప్తంగా విషాదం నింపింది. మరో జవాను చికిత్స పొందుతూ మరణించడంతో ఈ ఆపరేషన్‌లో అసువులు బాసినవారి సంఖ్య నాలుగుకు చేరింది. 13వ తేదీ నుంచి కనిపించకుండా పోయిన మరో జవాను మృతదేహం లభ్యమైనట్టు వార్తలు వచ్చాయి. ప్రాణత్యాగం చేసిన వీరజవాన్లకు దేశం ఒకవైపు శ్రద్ధాంజలి ఘటిస్తుండగా, మరోవైపు ఈ ఘటనకు కారకులైన లష్కరే తాయిబాకు చెందిన ముగ్గురు తీవ్రవాదులతో పాటు స్థానికంగా రిక్రూట్ అయిన 28ఏళ్ల ఉజైర్‌ఖాన్ కోసం సైన్యం, పోలీసుల వేట కొనసాగుతోంది. ఈ సంఘటన నేపథ్యంలో జమ్ములో పాక్ వ్యతిరేక ర్యాలీలు జరిగాయి. కఠినమైన భౌగోళిక పరిస్థితులతో పాటు, ఉగ్రవాదులకు ఈ అడవులపై పూర్తి అవగాహన ఉండటమే ఎన్‌కౌంటర్లు దీర్ఘకాలం కొనసాగడానికి కారణం.

సెప్టెంబర్ 12వ తేదీన రాజౌరీలోని నర్లా ప్రాంతంలో ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టిన దగ్గరి నుంచి ఉగ్రవాదుల ఏరివేత మొదలైంది. ఈ సంఘటనలో ఒక జవాను అమరుడయ్యాడు. లాబ్రెడార్ సైనిక జాగిలం కూడా చనిపోయింది. సెప్టెంబర్ 8న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో తమ నేత రియాజ్ అహ్మద్‌ను హతమార్చినందుకు ప్రతీకారంగా ఈ దాడులకు పాల్పడినట్టు లష్కరే తాయిబాకు చెందిన నిషేధిత ది రెసిస్టెన్స్ ఫ్రంట్ పేర్కొంది. రాష్ట్రంలో ఉద్రిక్తతలను కొనసాగించడమే ఈ సంస్థ లక్ష్యమని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం దీనికి లష్కరే తాయిబా సంస్థ ఛానెళ్ల ద్వారా నిధులందుతున్నాయి. సెప్టెంబర్ 16న బారాముల్లా జిల్లాలోని ఉరిసెక్టార్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమవడం మరో తాజా సంఘటన. వీరు నియంత్రణ రేఖను దాటి మనదేశంలో ప్రవేశించేందుకు యత్నిస్తున్న సమయంలో అప్రమత్తమైన మన సైన్యం జరిపిన కాల్పుల్లో వీరు మరణించారు. దీనితోనే ఒక వర్గం మీడియా కొన్నిచోట్ల ఉగ్రవాదం తలెత్తుతున్నదని అనుమానాలు వ్యక్తం చేసింది.

ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అంటే?

2019లో 370వ అధికరణాన్ని రద్దు చేసిన తర్వాత ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) ఏర్పాటైంది. పాక్ ప్రభుత్వ మద్దతుతో శరవేగంగా కశ్మీర్ లోయలో చురుగ్గా మారింది. సెప్టెంబర్ 13న జరిగిన ఎన్‌కౌంటర్ టీఆర్ఎఫ్ ఎంత చురుగ్గా ఉన్నదో తెలిజెప్పేందుకు ఉదాహరణ. 2019లో ఏర్పాటైన టీఆర్ఎఫ్‌ను భారత ప్రభుత్వం ఈ ఏడాది ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం (యూపీఎఫ్ఏ) కింద నిషేధించింది. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సంజయ్‌శర్మ (26) ఈ ఏడాది ఫిబ్రవరి 26న పుల్వామాలోని స్థానిక మార్కెట్‌కు భార్యతో కలిసి వెళ్లినప్పుడు టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు కాల్చి చంపారు. సంజయ్ శర్మ కశ్మీరీ పండిట్ కావడమే హత్యకు ప్రధాన కారణం. ఉనికిలోకి వచ్చిన తర్వాత టీఆర్ఎఫ్ డజన్ల కొద్దీ ఉగ్రదాడులకు పాల్పడింది. ఆ దాడులు లోయలో మైనారిటీలైన కశ్మీరీ పండిట్‌లే లక్ష్యంగా కొనసాగాయి. ఈ సంస్థను నిషేధించినప్పటికీ జమ్ము-కశ్మీర్ భద్రతా యంత్రాంగానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఇది ప్రముఖ ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబాకు ఫ్రంట్‌లైన్ ఆర్గనైజేషన్‌గా పనిచేస్తున్నదనేది ప్రభుత్వ వర్గాలు చెబుతున్న మాట. దీనికి పాక్ ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది. గత జనవరిలో ఈ సంస్థను నిషేధించిన కేంద్రం, టీఆర్ఎఫ్ కమాండర్ షేక్ సజ్జద్ గుల్‌ను యుపీఎఫ్ఏలోని నాల్గవ షెడ్యూలు కింద ఉగ్రవాదిగా ప్రకటించింది. ఇతను శ్రీనగర్‌లోని రోజ్ ఎవెన్యూ కాలనీకి చెందినవాడు. 2018 జూన్ నెలలో కశ్మీర్‌కు చెందిన జర్నలిస్ట్ సుజ్జద్ బుఖారీ హత్యకు కుట్ర పన్నింది ఇతడేనని ప్రభుత్వ వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి. కేంద్రం నిషేధించిన మరునాడే తాము దాడులు జరుపబోయేవారి జాబితాను టీఆర్ఎఫ్ విడుదల చేయడం దాని తెంపరితనానికి నిదర్శనం. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కేంద్రం నిషేధించిన 44 ఉగ్రవాద సంస్థల్లో టీఆర్ఎఫ్ కూడా ఒకటి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొనాలంటూ సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో విషాన్ని నింపేందుకు ప్రయత్నించడమే కాదు, తమ సంస్థలో చేరాలంటూ కోరుతోంది. టీఆర్ఎఫ్ జమ్ము-కశ్మీర్‌లోని సిక్కు వర్గాల ప్రజలపై కూడా బెదిరింపులకు పాల్పడుతోంది. స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీఓ)లుగా పనిచేస్తున్న సిక్కు

మన్‌ప్రీత్ సింగ్, అశిష్ ధొనక్, డి.ఎస్.పి.హుమాయూన్ భట్

యువకులను ఆర్.ఎస్.ఎస్.ఏజెంట్లుగా పరిగణిస్తామని గత జనవరిలో హెచ్చరికలు జారీ చేసింది కూడా. ఇదే సమయంలో భద్రతా బలగాలతో సంఘర్షణకు దిగుతోంది. 370వ అధికరణాన్ని రద్దుచేసిన తర్వాత టీఆర్ఎఫ్ ఆన్‌లైన్‌లో కార్యకలాపాలను మొదలుపెట్టి, లష్కరే తాయిబాతో సహా ఇతర నిషేధిత సంస్థలకు చెందిన ఉగ్రవాదులను చేర్చుకోవడం ద్వారా ఆరునెలల తర్వాత తన ఉనికిని ప్రదర్శించడం ప్రారంభించింది.

టీఆర్ఎఫ్ పాక్ సృష్టే!

ఉగ్రవాదులకు ఆర్థిక సహాయం అందించడంపై ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) నుంచి పాకిస్తాన్‌కు తీవ్రస్థాయి వత్తిళ్లు మొదలయ్యాయి. ప్యారిస్ కేంద్రంగా పనిచేస్తున్న ఎఫ్ఏటీఎఫ్ ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, మనీ లాండరింగ్ కారణాలతో పాకిస్తాన్‌ను గ్రే లిస్ట్‌లో

వెలుగా?

చేర్చినా పాక్ తన దుష్టబుద్ధిని మార్చుకోవడంలేదు. ఎల్ఇటి అధినేత హఫీజ్ సయీద్, లష్కరే తోయ్‌బాలను అంతర్జాతీయ ఉగ్రవాద జాబితాలో చేర్చడంతో, వీరికి ఏ విధంగాను ఫండింగ్ చేయడం పాక్‌కు సాధ్యం కాదు కాబట్టి దీనికి నిధులు సమకూర్చేందుకు పాక్ యంత్రాంగం టీఆర్ఎఫ్ అనే కొత్త సంస్థను ముందుకు తెచ్చింది. దీని ఏర్పాటులో, మతపరంగా ఏవిధమైన అనుమానం రాని రీతిలో జాగ్రత్తలు తీసుకొని ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అని పేరుపెట్టింది.

ఇదిలా ఉండగా చంద్రయాన్-3 విజయం, జి-20 అధ్యక్షురాలిగా భారత్ దౌత్యం ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకోవడం, అంతర్జాతీయంగా చైనాను ఏకాకిని చేయడంలో విజయం సాధించడం, ఆర్థిక ప్రగతిలో దూసుకు పోతుండటం పాక్‌కు ఎంతమాత్రం మింగుడు పడటంలేదు. వీటికి తోడు పాక్ రావాల్సిన సౌదీ యువరాజు భారత్‌లో జి-20 సమావేశంలో పాల్గొని నేరుగా వెళ్లిపోవడంతో దానికి పుండుమీద కారం చల్లినట్లైంది. నిజం చెప్పాలంటే పతన పథంలో వేగంగా పయనిస్తున్న పాకిస్తాన్ ప్రస్తుతం అంతర్జాతీయంగా ఒక చెల్లని నాణెం! 'వెయ్యి గాయాలతో' భారత్‌ను రక్తమోడేలా చేయాలని శపథం చేసిన పాక్‌కు, తాను పెంచిన ఉగ్రవాదమే 'ఎద్దు పుండు కాకికి రుచి' అన్న చందగా మారి ప్రస్తుతం 'లక్ష గాయాలతో' రక్తం చిందిస్తోంది.

పాక్ ఉగ్రవాదులే అధికం

2022లో జమ్ముకశ్మీర్ పోలీసులు విడుదల చేసిన నివేదిక ప్రకారం, రాష్ట్రంలో అదే ఏడాది నిర్వహించిన 90 ఆపరేషన్లలో 172 మంది ఉగ్రవాదులు హతులు కాగా, వీరిలో 42 మంది విదేశాలకు చెందినవారు. వీరిలో అత్యధికులు అంటే 108మంది టీఆర్ఎఫ్, లష్కరే తాయిబాకు చెందిన వారు. అదేవిధంగా ఉగ్రవాదంలో చేరిన 100 మందిలో 74 మంది టీఆర్ఎఫ్ రిక్రూట్ చేసుకున్న వారే. ఈ పరిణామాలు పాకిస్తాన్ మద్దతుతో నడుస్తున్న ఈ ఉగ్రవాద సంస్థ వల్ల పొంచి ఉన్న ప్రమాదాన్ని వెల్లడిస్తున్నాయి. అయితే ఈ సంస్థలో చేరే స్థానికుల సంఖ్య గణనీయంగా తగ్గడం ఆశావహ పరిణామం. ఉదాహరణకు గత 8 నెలల్లో 46మంది ఉగ్రవాదులు మరణించగా, కేవలం ఎనమండుగురు స్థానికులు. మిగిలిన వారంతా పాక్ ఉగ్రవాదులే.

దట్టమైన అడవులే అనుకూలం

2003 ఏప్రిల్-మే మధ్యకాలంలో మన సైన్యం ఆపరేషన్ సర్ప్‌వినాశ్ పేరుతో పీర్‌పంజల్ పర్వతాల్లోని హిల్‌కాక పూంచ్-సురాంకోట్ ప్రాంతంలో ఆపరేషన్‌ను నిర్వహించిన తర్వాత ఇక్కడ మిలిటెన్సీ తగ్గి శాంతి నెలకొంది. ఈ ప్రాంతంలో వేసవిలో గొర్రెలు కాసుకునేవారు తాత్కాలికంగా ఉండటానికి డోకే నిర్మాణాలు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి ఉగ్రవాదులకు ఉపయోగపడుతున్నట్టు 2003 సర్ప్‌వినాశ్ సందర్భంగా గుర్తించారు. 2020 తర్వాత రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో మళ్లీ ఉగ్రవాద కార్యకలాపాలు ఊపిరి పోసుకోవడం మొదలైంది. రాజౌరీ-పూంచ్ జిల్లాల్లో 4304 చదరపు కిలోమీటర్ల మేర దక్షిణ పీర్‌పంజల్ పర్వత ప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. వీటి ఎత్తు 15వేల అడుగులు. ఇక్కడ సైనిక కార్యకలాపాలు జరపడం కష్టంతో కూడిన పని. ఈ కఠిన భౌగోళిక పరిస్థితులకు తోడు

'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది



వాస్తవాధీన రేఖకు అనుకొని ఉన్న నేపథ్యంలో ఈ జిల్లాలు ప్రస్తుతం ఉగ్రవాదుల చొరబాట్లకు అనుకూలంగా మారాయి. ముష్కర కార్య కలాపాలు పెరగడానికి ముఖ్యంగా పాక్ నుంచి ఉగ్రవాదులు ప్రవేశించడానికి ఈ సానుకూలతే ప్రధాన కారణం. వీరు పోలీసులను దూరం నుంచే గుర్తించే వ్యవస్థను ఏర్పాటు చేసుకొని అటవీ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు స్థావరాలను మారుస్తూ, ఎత్తయిన ప్రదేశాల్లో తిష్టవేస్తూ భద్రతా బలగాలపై దాడులకు పాల్పడుతున్నారు.

పీఓకేపై పాక్‌కు ఎదురుదెబ్బలు!

జి-20 సమావేశాల తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, పీఓకే భారత్‌లో అంతర్భాగంగా గుర్తించడం దౌత్యపరంగా పాక్‌ను కోలుకోలేని దెబ్బతీసింది. ఇందుకు సంబంధించి యు.ఎ.ఇ. డిప్యూటీ ప్రధాని సైఫ్ బీన్ జయాద్ అల్ నహ్యాన్ జి-20 సమావేశం సందర్భంగా తీసిన వీడియోను విడుదల చేయడం తాజా పరిణామం. కశ్మీర్ అంశంపై పాకిస్తాన్‌కు ఇక తన మిత్రదేశాల నుంచి మద్దతు లభించబోదన్న సత్యాన్ని ఈ వీడియో వెల్లడిస్తోంది. ఇదిలావుండగా ''నరిహద్దును తెరవాలన్న పీఓకేలోని షియా ముస్లింల డిమాండ్‌పై మీ స్పందన ఏంటి?'' అని రాజస్తాన్‌లోని దౌసాలో ఇటీవల జరిగిన విలేకర్ల సమావేశంలో కేంద్రమంత్రి, మాజీ ఆర్మీ చీఫ్ వి.కె.సింగ్‌ను ఒక విలేకరి అడిగినప్పుడు, ''పాక్ ఆక్రమిత కశ్మీర్ తనకు తానే భారత్‌లో కలిసిపోతుంది. కొంచెం ఓపికపట్టండి'' అని అన్నారు. బీజేపీ నిర్వహించిన పరివర్తన్ సంకల్ప యాత్రలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను ఆషామాషీగా తీసుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే ఆయన మంత్రి మాత్రమే కాదు, గతంలో ఆర్మీ చీఫ్‌గా పనిచేశారు. సరిహద్దు దేశాల భౌగోళిక రాజకీయాలపై ఆయనకు అపారమైన అవగాహన ఉంటుంది. అందువల్లనే ఆ వ్యాఖ్యలకు అంతటి ప్రాధాన్యం. ఆయన వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ డోగ్రా సదార్ సభ (డీఎస్ఎస్)కు అంతర్జాతీయ సమన్వయకర్త మహమ్మద్ సజ్జద్ రాజా, జమ్ము సెంట్రల్ డీఎస్ఎస్ అధ్యక్షుడు ఠాకూర్ గుల్‌ఛైన్ సింగ్ ఛరక్‌కు లేఖ రాస్తూ...పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజల హక్కుల

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

అంశాన్ని భారత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరడం తాజా పరిణామం. ప్రస్తుతం పీఓకే జనాభాలో 99శాతం మంది స్థానిక డోగ్రా జాతి ప్రజలే కావడం విశేషం. అక్టోబర్ 26, 1947న జరిగిన విలీన ఒప్పందంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం పీఓకే, గిల్గిట్ బాల్టిస్తాన్ ప్రాంత ప్రజల బాగోగులు చూడాల్సిన బాధ్యత, జమ్ము-కశ్మీర్, భారత ప్రభుత్వాలదేనని ఆయన స్పష్టం చేయడం ఇక్కడ కీలకం. ముఖ్యంగా ఈ ప్రాంతాలు జమ్ము-కశ్మీర్ రాజ్యాంగ పరిధిలోనివి. అందువల్ల భారత ప్రభుత్వం దీని విషయంలో తుది పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ముజఫరాబాద్‌కు, శ్రీనగర్‌కు పోలికెక్కడ?

2022లో జమ్ము-కశ్మీర్‌ను 1.8 కోట్లమంది పర్యాటకులు సందర్శించగా, ఈ ఏడాది ఆ సంఖ్య 2.25 కోట్లకు చేరుతుందని అంచనా. పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతానికి చెందిన ముజఫరాబాద్, కోట్లీ, మీర్‌పూర్, దదియాల్, తాతాపాని, చక్సావరి, ఖుయ్‌రట, నక్యాల్ ప్రాంతాల్లో పెంచిన విద్యుత్ టారిఫ్‌లు, గోధుమల కొరత, పవర్‌కట్‌లు, లోడ్ షెడ్డింగ్‌లు, సబ్సిడీల కోత వంటి అంశాలపై పీఓకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తీవ్రస్థాయిలో ఆందోళనలు చేస్తున్నారు. ఇవి గత ఆగస్ట్‌లో పరాకాష్టకు చేరుకున్నాయి. పీఓకే మొత్తం జనాభా 4.5 మిలియన్లు కాగా వీరిలో 7 లక్షలమంది నిరుద్యోగులు, రెండు మిలియన్ల మంది విదేశాల్లో ఉపాధి పొందుతున్నారు. పీఓకేలో మొత్తం 78 ట్రిలియన్ రూపాయల (పాక్) విలువైన ఖనిజాలు, ఖరీదైన రాళ్లు, గ్రానైట్, లైమ్‌స్టోన్ మొదలైన వాటి నిల్వలు ఉన్నాయని అంచనా. కాగా గిల్గిట్ బాల్టిస్తాన్ జనాభా 2 మిలియన్లు. అవినీతిపరులైన రాజకీయ వేత్తలు, కేటాయింపుల్లో కోతలు, పేదరికంతో పీఓకే ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, జమ్ముకశ్మీర్‌లోని ప్రజల పరిస్థితి అందుకు పూర్తి భిన్నం. పీఓకే రాజధాని ముజఫరాబాద్‌ను శ్రీనగర్ లేదా జమ్ముతో సరిపోల్చలేం. జమ్ము, శ్రీనగర్‌లను ప్రస్తుతం ముంబయి, కోల్‌కతా వంటి మెట్రోపాలిటన్ నగరాలతో పోల్చవచ్చునని ఆసియన్ లైట్ ఇంటర్నేషనల్ పేర్కొనడం గమనార్హం. జమ్ము-కశ్మీర్‌లో నాలుగు ఎయిర్‌పోర్ట్‌లుంటే, పీఓకే లో రెండు మాత్రమే ఉన్నాయి. జమ్ము-కశ్మీర్‌లో 35 యూనివర్సిటీ లుంటే, పీఓకేలో కేవలం ఆరు ఉన్నాయి. జమ్ము-కశ్మీర్‌లో 2812 ఆసుపత్రులు పనిచేస్తుండగా పీఓకేలో కేవలం 23 ఉన్నాయి. పీఓకేలో ఎంతో మంది ప్రజలు సరైన మందులు లేక మరణిస్తున్నారు. 2022-23 బడ్జెట్‌లో కేంద్రం జమ్ము-కశ్మీర్‌కు రూ.1.12 లక్షల కోట్లు (13.31 బిలియన్ యుఎస్ డాలర్లు) కేటాయించింది. విద్య, గృహాలు, ప్రజారోగ్యం, విద్యుత్ వంటి అంశాలకు పెద్దఎత్తున నిధులు కేటాయించింది. 2021-22 ధరల ప్రకారం వర్తమాన సంవత్సరం జమ్ము-కశ్మీర్ ప్రగతి 7.5% ఉంటుందని అంచనా. అదే పీఓకే ప్రభుత్వం 2021-22లో కేటాయించిన బడ్జెట్ 141 బిలియన్ పాకిస్తాన్ రూపాయిలు. ఇది 78.55 మిలియన్ యు.ఎస్. డాలర్లకు సమానం. పీఓకే ప్రజలు తాము చెల్లించే పన్నుల ప్రకారం బడ్జెట్‌లో న్యాయమైన వాటాను కూడా పొందడంలేదు.

హతమవుతున్న ఉగ్రవాద నేతలు

కొద్ది సంవత్సరాలుగా, భారత్ వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న కరుడుగట్టిన తీవ్రవాదులు ఒక్కరొక్కరుగా గుర్తుతెలియని వ్యక్తుల చేతుల్లో హతమవుతుండ టం గమనార్హం. ఐక్యరాజ్య సమితి గ్లోబల్ టెర్రరిస్టుగా ప్రకటించిన హఫీజ్ సయీద్ ఇంటిముందు 2021 జూన్‌లో శక్తిమంతమైన బాంబు పేలుడు సంభవించింది. అంతకుపూర్వం ఇతని కుమారుడు తల్హా సయీద్ లాహోర్‌లో జరిగిన పేలుడులో గాయపడ్డాడు. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్‌కు చెందిన హర్‌దీప్‌సింగ్ నిజ్జర్‌ని కెనడాలోని సుర్రేలో

గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. అల్ బదర్ కమాండర్ సయ్యద్ ఖలీద్ రాజా, జైషే మహమ్మద్‌కు చెందిన జహూర్ ఇబ్రహీంలు కరాచీలో వేర్వేరు సంఘటనల్లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించారు. జహూర్ ఇబ్రహీం ఐ.సి.184 భారతీయ విమానాన్ని హైజాక్ చేసిన వారిలో ఒకడు. ఖలిస్తాన్ కమెండో ఫోర్స్ చీఫ్ పరంజిత్ పంజ్‌వార్ (మాలిక్ సర్దార్ సింగ్ అనే మరోపేరు కూడా ఉంది)కు లాహోర్‌లో ఇదే గతి పట్టింది. లాల్ మహమ్మద్ ఐ.ఎస్.ఐ. అనుమానిత ఏజెంట్, గత ఏడాది నేపాల్ రాజధాని ఖాట్మండులో హత మయ్యాడు. సెప్టెంబర్ 8న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ది రెసిస్టెన్స్ ఫ్రంట్ నేత రియాజ్ అహ్మద్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చడం తాజా సంఘటన. భారత్‌కు ముప్పు తేవాలన్న ఉద్దేశంతో పాక్ సైన్యం ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వేతర ముష్కర గ్రూపుల అస్తిత్వం ప్రస్తుతం ప్రమాదంలో పడిందనేది పై సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ముఖ్యంగా అధికారం, గుర్తింపుకోసం అవి పోరాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తాజా ఎన్‌కౌంటర్ ఇందులో భాగమేననుకోవాల్సి వస్తోంది.

పాక్‌లో పెరిగిన ఉగ్రదాడులు

గత ఆగస్టు నెలలో పాకిస్తాన్‌లో ఉగ్రదాడులు ఏకంగా 83 శాతం పెరిగినట్టు పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాన్‌ఫ్లిక్ట్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ (పీఐసీఎస్ఎస్) ను ఉటంకిస్తూ జియోన్యూస్ వెల్లడించింది. ఈ నెలలో పాక్ మొత్తం మీద 99 ఉగ్రదాడులు జరిగాయి. 2014 నుంచి ఇప్పటివరకు దేశంలో ఒక నెలలో జరిగిన తీవ్రవాదుల దాడుల్లో ఇవే అధికం. ఈ దాడుల్లో అత్యధికం బెలూచిస్తాన్, పూర్వపు సమాఖ్యపాలనలో ఉన్న గిరిజన ప్రాంతాలు (ఫతా)లోనే నమోదు కావడం పాక్‌లో వేర్పాటువాదం ఏ స్థాయిలో ఉన్నదో తెలియచేస్తున్నది.

ఇదిలావుండగా చైనీయులపై పెరుగుతున్న దాడులతో చైనా–పాకిస్తాన్ ఆర్థిక నడవా పనులు ముందుకెళ్లడం లేదు. దాడులకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చైనా ఎంతగా హెచ్చరించినా, వీటిని అరికట్టడం పాక్‌వల్ల కావడం లేదు. అంతేకాదు తమ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై దాడులు పెరగడం చైనాకు ఆందోళన కలిగిస్తోంది. కాగా, గత ఆగస్టు 14ను బ్లాక్ డేగా పేర్కొంటూ సింధీ–బెలూచ్ ఫోరానికి చెందిన మానవహక్కుల ఉద్యమకారులు యు.కె.లో ప్రదర్శనలు జరిపారు. బెలూచిస్తాన్‌లోని దెరా బుక్తీ ప్రాంతంలో వారం క్రితం అపహరణకు గురైన ఫుట్‌బాల్ క్రీడాకారుల ఆచూకీ ఇంతవరకు తెలియలేదు. పాక్–అఫ్ఘనిస్తాన్ సైన్యాల మధ్య సెప్టెంబర్ 6న జరిగిన ఘర్షణ నేపథ్యంలో పాకిస్తాన్ తోర్ఖమ్ సరిహద్దును మూసివేయడంతో వందలాది



గత ఆగస్టు నెలలో పాకిస్తాన్‌లో ఉగ్రదాడులు ఏకంగా 83 శాతం పెరిగినట్టు పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాన్‌ఫ్లిక్ట్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ (పీఐసీఎస్ఎస్) ను ఉటంకిస్తూ జియోన్యూస్ వెల్లడించింది. ఈ నెలలో పాక్ మొత్తం మీద 99 ఉగ్రదాడులు జరిగాయి.

ట్రక్కులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. ఈ సరిహద్దులో కొత్త పోస్ట్ నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదం ఈ ఘర్షణకు కారణం. ఇంతవరకు సమస్యకు పరిష్కారం లభించ లేదు. రెండు దేశాల మధ్య తెహ్రిక్ ఎ తాలిబాన్ పాకిస్తాన్ ఉగ్రవాదుల విషయంలో విభేదాలు కొనసాగుతున్నాయి. పాకిస్తాన్‌తో విభేదాలు ముదర డంతో ఇక పాక్ కరెన్సీని ఉపయోగించకూడదని అఫ్ఘాన్ ప్రభుత్వం నైరుతి ప్రాంత ప్రజలను కోరింది. త్వరలోనే పాక్ కరెన్సీని బ్యాన్ చేస్తున్నట్టు ప్రకటించడం తాము పెంచి పోషించిన తాలిబన్లే తమను ద్వేషించే దౌర్భాగ్యం పాకిస్తాన్‌ది! సెప్టెంబర్ 12న కరాచీలో షేక్ జియా ఉర్ రహమాన్ అనే మతబోధకుడు కరాచీలో దారుణ హత్యకు గురయ్యాడు. ఇదే నెల మొదట్లో సలీం ఖత్రి అనే మతపెద్దను బిలాల్‌కు సమీపంలో నలుగురు గుర్తుతెలియన వ్యక్తులు కాల్చి చంపారు. మతమౌఢ్య దేశంలో, మతపెద్దలకే భద్రతలేని దుస్థితి! పాక్ విమానయాన సంస్థ లీజులు ఇతరత్రా బకాయిలకింద 20 బిలియన్ రూపాయిలు (పాక్) బకాయి పడటంతో, 15 పాక్ అంతర్జాతీయ విమానాలు ఇక గ్రౌండ్‌కే పరిమితమయ్యే దుస్థితి నెలకొంది. ఇన్ని విపరిణామాలకు తోడు పాక్ జాతీయ అసెంబ్లీ రద్దయిన నేపథ్యంలో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అక్టోబర్ 21న పాక్‌కు తిరిగి రానున్నారని, ఆయన తమ్ముడు, మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించడం కొసమెరుపు. సైన్యంతో విభేదాల నేపథ్యంలో కేసుల్లో ఇరుక్కొని జైల్లో కొంతకాలం గడిపి 2019 నుంచి ఆయన లండన్‌లో అజ్ఞాతవాసం గడుపుతున్నారు. నేలపై పడిన ఏనుగులాంటి పాకిస్తాన్‌ను ఆయనే కాదు ఎంతటి బాహుబలి ఆయినా లేపడం కష్టం. ★

'కార్టూన్ పోటీ - 2023'లో ప్రోత్సాహక బహుమతికి ఎంపికైనది



ప్రపంచ సమీకరణాలు అనూహ్యంగా, అత్యంత వేగంగా మారుతున్నాయి. ఎవరూ ఊహించని రీతిలో భారతదేశం జి20 ద్వారా దౌత్యపరమైన విజయాలతో నాయకునిగా ఉద్భవిస్తున్న తరుణంలో, ప్రపంచంలోని వేరొక దిక్కున భిన్న పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రష్యా సహా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపవలసిన ఆవశ్యకతను సూచించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్'పై జి20లో పాల్గొన్న అన్ని దేశాలూ ఆమోదించాయి. అయితే, ఈ సమావేశం ముగిసిన మూడవ రోజునే ఉత్తర కొరియాకు చెందిన కిమ్ జాంగ్ ఉన్ రష్యాకు చేరుకుని, ఉక్రెయిన్‌తో రష్యా చేస్తున్నది 'పవిత్ర యుద్ధం' అని ప్రకటించడంతో ప్రపంచం ఉలిక్కి పడింది. ముఖ్యంగా ఇద్దరు నాయకుల మధ్య సమావేశం పూర్తి అయిన రెండు రోజుల తర్వాత కూడా కిమ్ రష్యా పర్యటనలోనే ఉండడం ప్రపంచానికి మింగుడు పడడం లేదు. వాస్తవానికి 2011లో అధికారాన్ని చేపట్టిన తర్వాత కిమ్ తన దేశం నుంచి కాలు బయట పెట్టడం ఇది ఏడవసారేనట! అందులో రష్యాకే రెండుసార్లు రావడం కూడా ప్రపంచాన్ని తెలియని భయంలోకి నెడుతోంది.

అందరికీ కల ఆ దేశాల

వీరిరువురి మధ్య స్నేహం ఈ సమయంలో బలపడడం గురించి భిన్న వాదనలు ప్రారంభమయ్యాయి. ఒంటరి దేశమైన ఉత్తర కొరియా నాయకుడు అత్యంత అరుదుగా స్వదేశం బయట పర్యటిస్తాడు. కొవిడ్ మహమ్మారి అనంతరం మొదటిసారిగా స్వదేశం నుంచి కాలు బయట పెట్టి నేరుగా ఆయన రష్యాకు వెళ్లడమే కాదు, రష్యా చేస్తున్న యుద్ధాన్ని సమర్థించడాన్ని ప్రపంచం అప్రమత్తతో గమనిస్తోంది. సెప్టెంబర్ 13వ తేదీన ఉత్తర కొరియా నాయకుడు కిమ్ రష్యా తూర్పులో సైబీరియా ప్రాంతంలోని ఆమూర్ ఒబ్లాస్ట్‌లో గల వోస్టోచ్నీ కాస్మోడ్రోమ్ స్పేస్‌పోర్ట్‌లో తన ప్రత్యేక రైలు దిగారు. ఉపగ్రహాలను ప్రయోగించే ప్రాంతంలో రష్యా నాయకుడు వ్లాదమిర్ పుతిన్‌ను కలుసుకున్నారని, ఇద్దరు నాయకులూ ఒకరినొకరు 'కామ్రేడ్' అంటూ సంబోధించుకున్నారని మీడియా వార్తలు వెల్లడించాయి. ఈ సందర్భంగా కిమ్, షరతులు లేని, సంపూర్ణ మద్దతును రష్యాకు ప్రకటించినట్టు మీడియా నివేదికలు చెప్తున్నాయి. స్పేస్‌పోర్ట్‌లో గల భవనంలోని వివిధ విభాగాలను సందర్శించిన అనంతరం నాయకులిద్దరూ దాదాపు నాలుగు గంటలపైన సమావేశమైనట్టు వార్తలు చెబుతున్నాయి.

ఉత్తర కొరియా అధికారిక నామం, 'డెమొక్రెటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా' కాగా, అక్కడ ఉన్న ఏకైక పార్టీ 'వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా – డబ్ల్యుపికె'. ఆ దేశాన్ని పాలించిన, పాలిస్తున్న, పాలించబోతున్న ఏకైక పార్టీ అది. కాగా, ఈ సమావేశం సందర్భంగా 75 సంవత్సరాల కిందట ఉత్తర కొరియా అవతరించినప్పుడు దానిని తొలుత గుర్తించింది తామేనన్న విషయాన్ని పుతిన్ పదే పదే కిమ్‌కు గుర్తు చేశారట. అయితే, ఉత్తర కొరియా పై కొత్త ఆంక్షలు విధించాలన్న యుఎస్ నేతృత్వంలోని ప్రతిపాదనను వ్యతిరేకించడంలో చైనాతో రష్యా కూడా కలసికట్టుగా పని చేశాయి. దీనితో పాటుగా, 2006లో అమెరికా ప్యాంగ్ యాంగ్‌ను శిక్షించడం మొదలుపెట్టిన తర్వాత తొలిసారి ఐరాస భద్రతా మండలిలో చీలికను తీసుకువచ్చాయి. అందుకే, చైనా విదేశాంగ శాఖ ఈ సమావేశంపై వ్యాఖ్యానిస్తూ, 'చైనా, ఉత్తర కొరియా నదులు, పర్వతాలతో అనుసంధానమైన స్నేహపూర్వక పొరుగుదేశాలని, ప్రస్తుతం చైనా – ఉత్తర కొరియా సంబంధాలు సానుకూలంగానే అభివృద్ధి చెందుతున్నాయి' అని ప్రకటించింది.

సమావేశ నేపథ్యం

ప్రచ్ఛన్న కాలం నుంచీ అమెరికా, రష్యా మధ్య సంబంధాలు ఉద్రిక్త స్థాయిలను చేరినప్పుడల్లా రష్యా వైపు మొగ్గడం ఉత్తర కొరియాకు ఆనవాయితీగా వస్తోందన్నది వాస్తవమని భౌగోళిక రాజకీయ వ్యూహాత్మక పరిణామాలను అధ్యయనం చేసే మేధావులు అంటున్నారు. అందుకే, ఉక్రెయిన్ యుద్ధం మొదలు కాగానే, ప్యాంగ్‌యాంగ్ తన వైఖరిని స్పష్టం చేసింది. ఐరాసలో 2022 మార్చి మొదట్లో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తోసిపుచ్చిన ఐదు దేశాలలో ఉత్తర కొరియా కూడా ఒకటి. అలాగే, తూర్పు ఉక్రెయిన్‌లో రష్యా ఆక్రమించిన దొనెత్స్క్ పీపుల్స్ రిపబ్లిక్‌ను, లుషాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్ స్వాతంత్ర్యాన్ని గుర్తించిన తొలి మూడు దేశాలలో ఉత్తర కొరియా ఒకటి.

ఒకరి నుంచి ఒకరు ఏం కోరుకుంటున్నారు

మూడేళ్ల కొవిడ్ -19 మహమ్మారి లాక్‌డౌన్ కారణంగా దాదాపు ఖాళీ అయిపోయిన ఆహార, ఇంధన, మందుల సరఫరాలను ఉత్తర కొరియా కోరుకుంటోంది. ఇందుకోసం, శతఘ్నుల గుండ్లు, మందుగుండు, రాకెట్లను రష్యాకు అమ్మడం ద్వారా తనకు కావలసిన సరుకును పొందవచ్చని భావిస్తోంది.

దీనితో పాటుగా, 2019లో నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన హనోయ్ సదస్సు అవమానం తర్వాత ప్రపంచ వేదికపై తన ప్రతిష్ఠను నిలబెట్టుకునేందుకు ఇది ఒక ప్రయత్నంగా చూసేవారు లేకపోలేదు. అలాగే, ఈ ప్రాంతంలో విజయవంతంగా ద్వైపాక్షిక, త్రైపాక్షిక దౌత్యపరమైన సంబంధాలను ఏర్పరచుకుంటున్న బైడెన్‌కు ఆటంకాలు కల్పించేందుకే పుతిన్‌తో సంబంధాలను కిమ్ నెరపుతున్నాడని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక ఆయుధాల సాంకేతికత, ఆయుధాల విషయంలో సహకారం ద్వారా ఐరోపా, ఆసియా దేశాలను అనుసంధాన పరుస్తూ ఒక భద్రతా కవచాన్ని ఏర్పాటుచేయాలన్న బైడెన్ యత్నాలకు గండి కొట్టేందుకు అవకాశం ఉంది. అలాగే, సుదీర్ఘకాలం రష్యా యుద్ధాన్ని సాగించేందుకు మందుగుండును సరఫరా చేయడం ద్వారా అమెరికా పరిస్థితిని కొరియాలోనే కాదు ఉక్రెయిన్‌లో కూడా కిమ్ కష్టతరం చేయగలడు. అలాగే ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైళ్లను (ఐసిబిఎమ్) నిర్మించడంలో ఉత్తర కొరియాకు తోడ్పడడం ద్వారా అమెరికా చేస్తున్న కృషిని పుతిన్ సంక్లిష్టం చేయవచ్చు.

ఈ పర్యటన సందర్భంగా ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జాంగ్ ఉన్ తమ దేశంలో పర్యటించవలసిందిగా పుతిన్‌ను ఆహ్వానించారు. దానిని మన్నించిన రష్యా అధ్యక్షుడు, రష్యా–డిపిఆర్‌కె స్నేహ సంప్రదాయాన్ని, చరిత్రను ముందుకు తీసుకువెడతానంటూ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారట. ఈ క్రమంలోనే ఉత్తర కొరియా నాయకుడైన కిమ్ ఇప్పుడు మాస్కోతో తమ సంబంధాలు విదేశాంగ విధాన ప్రాధాన్యతను సంతరించుకుందంటూ వ్యాఖ్యానించడాన్ని పాశ్చాత్య దేశాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

సన్నిహితులతో ప్రయాణం:

ఈ ప్రయాణంలో కిమ్ తన అధికారగణం,

వరం మధ్య స్నేహం

ఆయుధాల నిపుణులతో పాటు తనకు అత్యంత విశ్వసనీయమైన వ్యక్తి అయిన చిన్న సోదరి కిమ్ యో-యాంగ్‌ను కూడా వెంట తీసుకు బయలు దేరారు. తమ దేశ ప్రసార, ప్రచార అధిపతి పాత్రను ఆమె పోషిస్తున్నారు. తండ్రి హఠాన్మరణానంతరం అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన కిమ్ ఊబకాయం, పొగతాగడం వంటి కారణాల వల్ల అతడి ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నదని అప్పుడప్పుడు వదంతులు పుట్టుకు రావడం మనందరికీ తెలుసు. అయితే, తన తర్వాత తన సోదరికి పదవిని అప్పచెప్తాడా, కుమార్తెకా అంటూ ఊహాగానాలు కూడా సాగుతున్నాయి. ఎందుకంటే, గత నవంబర్‌లో ఉత్తర కొరియా క్షిపణిని పరీక్షించినప్పుడు కుమార్తె జూ-యే కూడా అందుకు హాజరుకావడం ఈ వదంతులకు ఆస్కారమిచ్చింది. అయితే, కేవలం 12 లేదా 13 ఏళ్ల కుమార్తెకు ఇప్పటి నుంచే శిక్షణ నిస్తున్నాడా? అన్నదీ సహేతుకమైన ప్రశ్నే.

అమెరికా, ఇతర దేశాల స్పందన

ఒకవైపు ఈ సమావేశాన్ని పుతిన్ తెంపరితన మంటూ ఖండించినప్పటికీ, ఉక్రెయిన్‌పై యుద్ధానికి మందుగుండు సామాగ్రిని క్రెమ్లిన్‌కు ఇస్తే కిమ్ అందుకు మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందంటూ అమెరికా హెచ్చరించింది. అంతేకాదు, అమాయకులైన ఉక్రెయినన్లను చంపేందుకు ఈ భూగోళంపై ఎవరూ కూడా పుతిన్‌కు సాయపడకూడదంటూ వైట్‌హౌజ్ జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి జాన్ కిర్బీ ప్రకటించారు. ఒకవేళ ఏదైనా దేశం లెక్కచేయకుండా ముందుకు వెడితే, అమెరికా దానికి తగిన సమాధానం చెబుతుందంటూ హెచ్చరిక జారీ చేశారు. అంతేకాదు, ఇరు దేశాలపై మరిన్ని ఆంక్షలు విధిస్తామంటూ అమెరికా హెచ్చరించింది

కేవలం అమెరికా, దక్షిణ కోరియానే కాదు, జపాన్, ఇయు దేశాలు రష్యా, ఉత్తర కొరియా మధ్య ఆయుధాల ఒప్పందాన్ని ఐరాస భద్రతా మండలి తీర్మానాల ఉల్లంఘనగా అభివర్ణిస్తూ ఖండించాయి. రాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గూటెర్స్ ఈ పరిణామంపై స్పందిస్తూ, ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జాంగ్ ఉన్‌పై గల ఐరాస ఆంక్షలను గౌరవించాలంటూ అన్ని దేశాలకూ పిలుపిచ్చారు.

సందిగ్ధంలో చైనా?

రష్యా, ఉత్తర కొరియాల మధ్య ఈ సంబంధాలు చైనాకు పెద్ద సందిగ్ధ స్థితినే సృష్టించనున్నాయి. ఉత్తర కొరియాను చైనా కొంత ప్రభావితం చేయగలదని ప్రపంచం నమ్ముతున్నందున, కిమ్ ప్రవర్తనను నియంత్రించాలని, ఐరోపాలో యుద్ధం తీవ్రతరం కాకుండా నిరోధించమని కోరుకుంటుంది. అయితే, ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలోను, మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలలోనూ చైనా తన ఆస్తిత్వాన్ని నిలుపుకునేందుకు రష్యా, ఉత్తర కొరియాలతోనే సంత్సంబంధాలను కోరుకునే అవకాశం ఉంది. ఈ మూడు దేశాలూ కలిస్తే ఐరోపా, ఆసియాలో బైడెన్ కోరుకుంటున్న భద్రతా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం ఉందని చైనా నాయకులు భావించవచ్చు. ముఖ్యంగా, తైవాన్ విషయంలో చైనాకు వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న అల్లరి నుంచి దృష్టి మళ్లించేందుకు అవకాశం లభిస్తుంది. ఈ రెండు దేశాలతో కలిసి ఎటువంటి సైనిక విన్యాసాలలోనైనా చైనా పాల్గొనడం అంటే, అది అమెరికా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో తన సంబంధాలను వణంగా పెట్టడమేనని అంతర్జాతీయ విశ్లేషకులు అంటున్నారు.

ఇది ఇలా ఉండగా, సున్నితమైన సైనిక

'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది



సాంకేతికతలను ప్యాంగ్‌యాంగ్‌తో పంచుకునే విషయంలో సంప్రదాయంగా మాస్కో అప్రమత్తంగా ఉంటూ వచ్చిందని, ఉత్తర కొరియా అణ్వాయుధాలతో కొంత ఇబ్బందికి కూడా రష్యా గురవుతోందని, దక్షిణ కొరియాకు చెందిన రష్యా మాజీ రాయబారి వీ సుంగ్ లాక్ వ్యాఖ్యానించారు. రష్యా ఇప్పటికీ అణ్వాయుధ, క్షిపణుల వ్యాప్తి నిరోధకతకు కట్టుబడి ఉందని ఆయన అభిప్రాయం. అయితే, వారు భౌగోళిక రాజకీయ, వ్యూహాత్మక అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉండటంవల్ల, పరిణామాలు చెప్పలేమని ఆయన వ్యాఖ్యానించారు.

విమానం కాదు రైలు ప్రయాణం

సాధారణంగా దేశాధినేతలు ఇతర దేశాలలో పర్యటనలకు వెళ్లినప్పుడు ప్రత్యేక విమానాలలో ప్రయాణించడం మనం చూస్తుంటాం. కానీ ఉత్తర కొరియా నాయకులు మాత్రం ఇందుకు పూర్తిగా విరుద్ధంలా కనిపిస్తారు. వారు ఏ దేశ పర్యటనకు వెళ్లినా రైలులోనే ప్రయాణిస్తారు. ప్రస్తుత నాయకుడు కిమ్ కూడా ఇందుకు భిన్నం కాదు. తన తండ్రి, తాతలలాగే రైలులోనే ప్రయాణిస్తాడు.

తాజాగా, ఉత్తర కొరియా నాయకుడు కిమ్ తన బుల్లెట్ ప్రూఫ్ రైలులో ప్రయాణించి రష్యా చేరుకున్నారు. ముదురు ఆకుపచ్చ రైలు పెట్టెలపై పసుపు పచ్చటి గీతలు కలిగిన రైలు రష్యా , చైనా, ఉత్తర కొరియా కలిసే ప్రాంతంలో కనిపించిందిట. దానిని చూసీ చూడగానే అది అత్యంత ప్రత్యేకమైన వాహనమని ఎవరైనా చెప్పగలరు. ఈ రైలుపై ' నూతన విజయం దిశగా...' అన్న నినాదం కొరియా భాషలో రాసి ఉంటుందిట.

బుల్లెట్ ప్రూఫ్ రైలు

రైలును అత్యంత భారీగా, ఆడంబరంగా, బుల్లెట్ ప్రూఫ్ తలుపులతో తయారు చేశారు. దక్షిణ

కొరియాకు చెందిన ఒక పత్రిక ప్రకారం కిమ్ తండ్రి కిమ్ జాంగ్ 2 ప్రయాణించిన రైలు ఇంజన్ తన వెనుకాల 90 కార్లను లాక్కొని వెళ్లగలిగేదిట. తాజా అంచనాల ప్రకారం ఆ సంఖ్య 21 ఒకటి పడిపోయి ఉండవచ్చు. కొన్ని కథనాల ప్రకారం కిమ్ ప్రధాన రైలుతో పాటు మరొక రెండు రైళ్లు కూడా ప్రయత్నిస్తాయి. ఒకటి పట్టాలను పరీక్షించేందుకు కిమ్ రైలుకు ముందు వెడుతుంది, మరొకటి అతడి భద్రతా సిబ్బందిని మోసుకొని వెనుక అనుసరిస్తుంది.

కిమ్ ప్రయాణించే రైలులో వడకగదులు, అధికారిక వ్యవహారాలను చూసేందుకు కాన్ఫరెన్స్ గదులు ఉన్నాయిట. నాయకుడితో పాటు వ్యక్తిగత భద్రతా సిబ్బంది, వైద్యులు కూడా ఇందులో వారికి కేటాయించిన పెట్టెలలో ప్రయాణిస్తారు. రైలులోని అంతర్గత భాగాలకు సంబంధించిన చిత్రాలను కొన్ని ఏళ్ల కిందట విడుదల చేశారు. 2018లో విడుదలైన వీడియోలో కిమ్ తన విశాలమైన రైలు పెట్టెలో చైనాకు చెందిన అగ్ర నాయకులను కలుసుకోవడం కనిపిస్తుంది.

బుల్లెట్ ప్రూఫ్ గోడలు కలిగిన ఈ రైలు అనేక ఆధునిక రైళ్లతో పోలిస్తే అత్యంత వేగంగా పరుగులు తీయదట. ఉత్తర కొరియాలోని పట్టాలపై గంటకు 28 నుంచి 50 మైళ్లవరకు ప్రయాణించే ఈ రైలు, చైనా రైలు నెట్‌వర్క్‌పై పని చేస్తున్నప్పుడు వేగాన్ని పెంచుకోగలదట. ఈ రైలులోని బోగీలన్నీ అనుసంధానమై ఉండటమే కాదు. శాటిలైట్ సమాచార వ్యవస్థను అమర్చి ఉంటాయిట.

మంచి ఆహారం, వినోదం

ఈ ప్రత్యేక రైలులో ఆహారం, వినోదాన్ని కూడా అందిస్తారు. పీతలు రొయ్యలు సహా రష్యన్, చైనీస్, కొరియన్, ఫ్రెంచి వంటకాలు వండి వేడివేడిగా వడ్డిస్తారు. దానితో పాటు బార్డాక్స్, బర్గండీ నుంచి వచ్చిన రెడ్ వైన్ కూడా అందిస్తారుట. ప్రయాణంలో విసుగు చెందకుండా తమ నాయకుడితో ప్రయాణించే అతిథులకు ఆట,పాటలతో వినోదాన్ని అందించేందుకు కళాకారులు కూడా ఉంటారు. ఒకరకంగా చెప్పాలంటే, విమాన ప్రయాణం కన్నా అత్యంత వినోదకరమైన ప్రయాణ అనుభవాన్ని ఈ రైలు ప్రయాణంలో పొందవచ్చు.

కుటుంబ సంప్రదాయం

రైళ్లల్లో ప్రయాణించాలన్న కిమ్ కుటుంబ కోరిక ఉత్తర కొరియా స్థాపకుడు కిమ్ 2 సుంగ్ కాలంలో మొదలైందిట. ఆయనకు సోవియట్ నాయకుడు జోసెఫ్ స్టాలిన్ ఒక రైల్వే కారేజీని బహుకరించడం, కుమారుడు కిమ్ జాంగ్ 2కు విమానంలో ప్రయాణించడం అంటే తీవ్రమైన భయం కావడంతో రైళ్లలోనే ప్రయాణించేందుకు ఇష్టపడడంతో ఈ సంప్రదాయం మొదలైంది. తాను విమానంలో ప్రయాణిస్తే శత్రువులు ఎక్కడ కాల్చి చంపేస్తారో అన్న భయపడిన కిమ్ 2011 గుండె ఆగి మరణించారు. ఆయన రైలులో ప్రయాణిస్తుండగానే మరణించారని ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా అనంతరం వెల్లడించింది. ప్రస్తుత నాయకుడు కిమ్ జాంగ్ ఉన్ తన కుటుంబ సంప్రదాయాన్ని అనుసరించాడు. అతడు 2019లో చైనా గుండా దాదాపు 4,500 కిలోమీటర్లు ప్రయాణించి, నాటి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను కలుసుకునేందుకు వియత్నాం చేరుకున్నారు. ఈ ప్రయాణానికి రెండున్నర రోజులు పట్టిందట. ★

'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది



చైనాలోని హాంగ్జు నగరం వేదికగా తెరలేచిన 19వ ఆసియా క్రీడల బరిలో భారీ సంఖ్యలో పతకాలు సాధించడమే లక్ష్యంగా 651 మంది సభ్యుల బృందంతో భారత్ పోటీపడుతోంది. గత ఏషియాడ్ కంటే మెరుగ్గా ప్రతిభను కనబరచాలన్న పట్టుదలతో భారత అథ్లెట్లు పూర్తిస్థాయిలో సిద్ధమై వెళ్లారు.

ఆసియా క్రీడల్లో భారత్ 'బంగారు' వేట!

ఆసియాఖండ దేశాల నడుమ నాలుగేళ్ల కోమారు జరిగే క్రీడల పరంపరలో భాగంగా 19వ ఆసియాక్రీడలు చైనా నగరం హాంగ్జు వేదికగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గత ఏడాదే జరగాల్సిన ఈ క్రీడలను కరోనా భయంతో సంవత్సరం పాటు వాయిదా వేశారు. మొత్తం 45 దేశాలకు చెందిన 4 వేల మందికిపైగా అథ్లెట్లు వివిధ క్రీడల్లో తలపడబోతున్నారు.

38 క్రీడాంశాలలో భారత్ పోటీ...

2018లో ఇండోనేషియాలోని పాలెమ్ బ్యాంగ్ నగరం వేదికగా ముగిసిన 18వ ఆసియాక్రీడల పతకాల పట్టికలో 8వ స్థానంలో నిలిచిన భారత్. ఈసారి మరింత మెరుగైన ప్రతిభను కనబరచడానికి వీలుగా అథ్లెట్లను సమాయత్తం సింది. భారత అథ్లెట్లు గత ఏషియాడ్ లో 16 స్వర్ణాలతో సహా మొత్తం 70 పతకాలు సాధించగలిగారు.

2018 జకార్తా ఆసియాక్రీడల్లో 572 మంది అథ్లెట్ల బృందంతో పాల్గొన్న భారత్ ఈసారి రికార్డు స్థాయిలో 651 మంది సభ్యుల బృందంతో పోటీకి దిగుతోంది. భారత అథ్లెట్లు మొత్తం 38 క్రీడాంశాలలో పతకాల వేటకు దిగుతున్నారు.

క్రికెట్, ఫుట్ బాల్ క్రీడల్లోనూ భారత్ పోటీ..

దశాబ్దకాలం విరామం తర్వాత తిరిగి ప్రవేశ పెట్టిన క్రికెట్ సహా చదరంగం, ఫుట్ బాల్ క్రీడల్లో సైతం భారత్ పోటీకి దిగుతోందిఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా సహా 34మంది పురుషులు, 31మంది మహిళలు భారత అథ్లెటిక్స్ జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఫుట్‌బాల్ పురుషుల, మహిళల విభాగాలలో 44మంది, హాకీ పురుషుల, మహిళల విభాగాలలో 36మంది, క్రికెట్ పురుషుల, మహిళల విభాగాలలో 30మంది సభ్యులు భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు.సెయిలింగ్ జట్టులో 33మంది క్రీడాకారులున్నారు. వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్, రగ్బీ, కురాష్ క్రీడల్లోనూ భారత అథ్లెట్లు పోటీకి దిగనున్నారు.

క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

చెస్ జట్లలో తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు...

ఆసియా క్రీడల క్రీడాంశాలలో భాగంగా 13 ఏళ్ల విరామం తర్వాత నిర్వహిస్తున్న చదరంగ క్రీడ పురుషుల, మహిళల విభాగాలలో 10మంది సభ్యుల జట్లతో భారత్ పోటీకి దిగుతోంది. పురుషుల, మహిళల జట్లలో ఇద్దరేసి తెలుగు రాష్ట్రాల గ్రాండ్ మాస్టర్లకు చోటు దక్కింది.

మహిళల జట్టులో కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, పురుషుల జట్టులో పెంటేల హరికృష్ణ, అర్జున్ ఇరగేసి సభ్యులుగా ఉన్నారు. ప్రపంచకప్ రన్నరప్ ప్రజ్ఞానంద్, గుకేశ్, విదిత్ గుజరాతీ సభ్యులుగా ఉన్నారు. మహిళల విభాగంలో రెండుసార్లు ఆసియా స్వర్ణ పతక విజేత కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక పోటీ పడుతున్నారు. 2010 గ్వాంగ్జు ఆసియా క్రీడల్లో చివరిసారిగా చదరంగ క్రీడను నిర్వ హించారు.

హాకీ.. ఒకే గ్రూపులో భారత్, పాక్!

హాకీ పురుషుల విభాగం ఒకే గ్రూపులో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాక్ తలపడనున్నాయి. ఎనిమిదిసార్లు ఆసియాక్రీడల హాకీ గోల్డ్ మెడలిస్ట్ పాకిస్థాన్, మూడుసార్లు స్వర్ణ విజేత భారతజట్లకు గ్రూపు-ఏలో చోటు దక్కింది. జపాన్, బంగ్లాదేశ్, సింగపూర్, ఉజ్బెకిస్థాన్ జట్లు సైతం ఇదే గ్రూపులో ఉన్నాయి. సెప్టెంబర్ 30న జరిగే కీలకపోరులో భారత్, పాకిస్థాన్ అమీతుమీ తేల్చుకో నున్నాయి. భారతజట్టు సెప్టెంబర్ 26న సింగపూర్, 28న జపాన్ జట్లతో తలపడనుంది. ఆసియాక్రీడల హాకీ పోటీలకు గాంగ్సు కెనాల్ స్పోర్ట్స్ పార్క్ స్టేడియం ఆతిథ్యమిస్తోంది. పురుషుల గోల్డ్ మెడల్ మ్యాచ్ అక్టోబర్ 6న, మహిళల స్వర్ణ పతకం పోరును అక్టోబర్ 7న నిర్వహిస్తారు. భారత్ చివరిసారిగా 2014 ఇంచెన్ ఆసియాక్రీడల్లో హాకీ బంగారు పతకం సాధించింది.

చైనా ప్రధాన ప్రత్యర్థిగా భారత్ పోరు...

ఫుట్‌బాల్‌లో భారత్ గ్రూప్-ఏ నుంచి తన అదృష్టం పరీక్షిం చుకోనుంది. నిర్వాహక సంఘం విడుదల చేసిన డ్రా ప్రకారం.. గ్రూప్-ఏ లీగ్‌లో ఆతిథ్య చైనా, బంగ్లాదేశ్, మియన్మార్ జట్లతో భారత పురుషులజట్టు తలపడ నుంది.మహిళల గ్రూప్ - బీ లీగ్‌లో థాయ్ లాండ్, చైనీస్ తైపీ జట్లతో భారత జట్టు పోటీపడనుంది. మొత్తం 24 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ దశలో మొదటి రెండుస్థానాలు సాధించిన జట్లు క్వార్టర్ ఫైనల్లో తలపడాల్సి ఉంది. మొత్తం ఆరుజట్లలోని నాలుగు అత్యుత్తమ మూడోస్థానం సాధించిన జట్లకు సైతం క్వార్టర్స్ లో చోటు కల్పిస్తారు. పురుషుల గ్రూపు-ఏ నుంచి చైనా, భారతజట్లు క్వార్టర్ ఫైనల్స్ చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

రెండుసార్లు ఏషియాడ్ విజేత భారత్....

భారత ఫుట్‌బాల్ జట్టుకు ఆసియాక్రీడల్లో రెండుసార్లు బంగారు పతకం సాధించిన ఘనత సైతం ఉంది. 1951లో తొలిసారిగా నిర్వహించిన ఆసియా క్రీడల తొలిపోటీల ఫుట్‌బాల్‌లో స్వర్ణపతకం సాధించిన భారతజట్టు తిరిగి 1962 గేమ్స్‌లో సైతం బంగారు పతకం సంపాదించింది.

2002 ఆసియాక్రీడల నుంచి 23 సంవత్సరాల లోపు వయసున్న వారికి మాత్రమే ఫుట్‌బాల్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. అయితే..గతేడాది జరగాల్సిన 2022 ఆసియాక్రీడలు కరోనదెబ్బతో ఏడాది వాయిదా పడటంతో.. ప్రస్తుత ఆసియాక్రీడల్లో 23 సంవత్సరాలు పైబడిన ముగ్గురు ఆటగాళ్లకు ఆడే అవకాశం ఇచ్చారు.దీంతో సునీల్ ఛెత్రీ, గోల్ కీపర్ గురుప్రీత్ సింగ్ సంధు, డిఫెండర్ సందేశ్ జింగాన్‌లకు ఆసియాక్రీడల్లో పాల్గొనే అవకాశం దక్కింది. ★

ఊరూ వాడా త్రివర్ణ పతాకం రెపరెపలు!

తెలంగాణలో నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల ముగింపు కార్యక్రమం వైభవంగా ముగిసింది. నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17, 2022 నుంచి సెప్టెంబర్ 17, 2023 వరకు కొనసాగిన ఈ ఉత్సవాల చివరి రోజు సంబరాలు ఆకాశాన్నంటాయి. ఎక్కడ చూసినా త్రివర్ణ పతాకం రెపరెపలు ఊరూవాడా కొత్త కాంతులు నింపాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సమితి ఆధ్వర్యంలో ఏడాది పొడవునా యువత, మేధావులు, సాహితీవేత్తలు తదితరులకు రకరకాల కార్యక్రమాలు జరిగాయి. నిజాం కర్కశాలను, రజాకార్ల రక్తపాతాలను గుర్తుచేసుకొని అందరి రక్తం మరిగింది. అదే సమయంలో స్వేచ్ఛావాయువుల కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలిన ఎందరో వీరుల త్యాగాలను, ధైర్యసాహసాలను భావితరాలకు స్ఫూర్తిని నింపాయి.

పాలమూరు బాలాజీనగర్ బస్తీలో జాతీయ జెండా ఆవిష్కరణ, సభా కార్యక్రమం.

ఇందూరు సంకటమోచన ఆలయ బస్తీలో

నల్గొండ గాంధీనగర్ బస్తీలో

సంగారెడ్డి జిల్లా ఈశ్వరాపురంలో

సికింద్రాబాద్ విభాగ్ సూరారం బస్తీలో

కరినగర్ అశోక్‌నగర్ బస్తీలో

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో

మానుకోట జిల్లా దేవుని సంకీన గ్రామంలో రజాకార్ల దాడికి బలైన ఎమ్.పట్టాభిరామయ్య కుమారుడికి సన్మానం

కామారెడ్డి జిల్లా రామారెడ్డి గ్రామంలో

హనుమకొండ సహకార బస్తీలో



భాగ్యనగర్ నింబోలి అడ్డ బస్తీలో

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి నగరం శివాజీ బస్తీలో

బాల జాగృతి

తెలుసుకుందాం

వేంకటేశ్వరస్వామి దేవాలయం-తిమ్మాపూర్

తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా, బీర్కూరు మండలం, తిమ్మాపూర్ గ్రామంలో ఈ ఆలయం కొలువుదీరింది. ఈ ఆలయంలో ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. 2016 ఏప్రిల్ 1న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ దేవాలయాన్ని సందర్శించి అభివృద్ధికి రూ.23 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో దేవాలయం చుట్టూ రాజగోపురాలు, మాడ వీధులు, ప్రాకారాలు నిర్మించారు.

కథ

జంతుస్వామ్యం



అనగనగా ఓ అడవి. అందులో చాలా జంతువులు ఉండేవి.

అవి మొదట్లో కొంతకాలం సఖ్యతగానే ఉన్నా.. రానురాను వాటి మధ్యలో కీచులాటలు మొదలయ్యాయి.

'ఈ అడవికి నేనే రాజును' అని సింహం అనుకుంటూ ఉండేది.

కానీ అది ఇతర జంతువులకు నచ్చేది కాదు. 'ఎప్పుడూ ఈ సింహానిదే పైచేయిగా ఉంటోంది. ఎంతకాలం ఇలా?' అని మిగతా జంతువులు ఆలోచించసాగాయి.

ఈ విధంగా కాకుండా ఒక్కొక్క జంతువు కొంత కొంత కాలం రాజుగా ఉండాలని కొన్ని జంతువులు భావించాయి. కానీ అది కూడా కుదరలేదు.

సింహం తన దుర్మార్గంతో అందరినీ భయపెడుతోంది. కాబట్టి అది రాజుగా పనికిరాదు అనుకున్నాయి.

నక్క జిత్తులమారి, ఎప్పుడూ కుట్రలు పన్నుతూ ఉంటుంది. అందువల్ల అది

పద్యం

నిండు నదులు పాఱు నిచ్చి గంభీరమై
వెఱ్ఱివాగు పాఱు వేగబోర్లి
అల్పుడాడు రీతి నధికుండు నాడునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

భావం : ఓ వేమనా! గొప్ప నదులు నిదానంగానూ, గంభీరంగానూ ప్రవహించును. కానీ చిన్న వాగు, అతి వేగంగా గట్లుదాటి పొర్లి ప్రవహించును. అట్లే యోగ్యుడు నిదానంగా, గంభీరంగా మాట్లాడును. నీచుడు వాగుచూ ఉండును.

శ్లోకం

'నా విష్ణుః పృథివీ పతిః'

నా దేవాంశో దదాత్యన్నం నా రుద్రో రుద్రమర్చయేత్
నా నృషిః కురుతే కావ్యం నా విష్ణుః పృథివీ పతిః'

భావం : దేవాంశ లేనివాడు అన్నదానం చేయలేడు. ఈశ్వరాంశలేని వాడు శివునికి అర్చనాదులు నిర్వహించ లేడు. రుషి కానివాడు కావ్య రచన చేయలేడు. విష్ణువు అంశలేనివాడు భూమిని పాలింపలేడు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

కాంగ్రెస్	బాణం
బీజేపీ	ఫ్యాను
శివసేన	కారు
బీఆర్ఎస్	సైకిల్
వైసీపీ	కమలం
టీడీపీ	హస్తం

ఫ్యాక్షనిజం-రాష్ట్రీయ సమితి; ఎన్డీఏ-ఎన్నికల గుర్తు; ఐఎన్డీఐఏ-రాష్ట్రీయ లోక్‌దళ్; ఎన్డీఏ-ఎన్నికల గుర్తు : ఐఎన్డీఐఏ

నిర్వహణ : నయనశ్రీ

భారత స్వాతంత్ర్య సమరయోధులు

భజహరి మహతో

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 1911లో పశ్చిమ బెంగాల్‌లోని పుర్లియా జిల్లా జితన్ గ్రామంలో జన్మించారు. శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాల్లో కీలకంగా పనిచేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నందుకు 1941, 1942, 1954లో జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం అనంతరం రాజకీయాల్లో చేరి లోక్‌సభ సభ్యునిగానూ ఎన్నికయ్యారు. 2003లో తుదిశ్వాస విడిచారు.

కూడా రాజుగా ఉండటానికి వీలు లేదనుకున్నాయి.

జింక తన అందం చూసుకుని మురిసిపోతుంటుంది. నెమలి అస్తమానం నాట్యంలో మునిగి పోయి ఉంటుంది. కుందేలు ఎక్కడ చిన్న అలికిడి అయినా పిరికిగా పారిపోతుంటుంది. కాబట్టి ఇవేవీ రాజుగా పనికి రావనుకున్నాయి.

అప్పుడు ఒక కోతి కలుగజేసుకుని 'ఈ సమస్యను మనుషులు ఎలా పరిష్కరించుకుంటున్నారో నేను నగరంలోకి వెళ్లి చూసి వస్తాను' అని చెప్పి బయల్దేరింది.

కొన్నాళ్లకు తిరిగి వచ్చిన కోతి 'మనుషులలో రాజులంటూ ఇప్పుడు ఎవరూ లేరు. అందరూ కలిసి వాళ్లను వాళ్లే పరిపాలించుకుంటున్నారు' అని చెప్పింది. ఇదేదో చాలా బాగుందని జంతువులన్నీ ఏకగ్రీవంగా అనుకున్నాయి.

సింహం, నక్క, జింక, నెమలి, కోతి, కుందేలు అన్నీ కలిసి 'జంతుస్వామ్యం' ఏర్పాటు చేసుకున్నాయి. ★

జనరల్ నాలెడ్జ్

1. జన్యువుల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
2. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఏంజెల్ జలపాతం ఎక్కడుంది?
3. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఎక్కడుంది?

సమాధానాలు : 1. జన్యుశాస్త్రం 2. వెనిజులా 3. విశాఖపట్నం

మెదడుకు మేత

ఇల్లంతా తిరిగి మూలన కూర్చుంటుంది.. ఏమిటది?

సమాధానం : ఉమ్మెత్త

మంచిమాట

ధనాన్ని చూసి దరిచేరే బంధువులు, అందాన్ని చూసి కలిగే ప్రేమ, అవసరం కోసం కలుపుకునే స్నేహం.. ఎన్నటికీ శాశ్వతం కావు..

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంటారు. కొత్త ఇంటి నిర్మాణాలు ప్రారంభించే సూచనలు. రాబడి సంతృప్తి, కొన్ని రుణబాధలు తొలగుతాయి. వ్యాపారులు లాభాలను గడిస్తారు. ఉద్యోగులకు కొంత విశ్రాంతి దొరికే వీలుంది. రాజకీయ వేత్తలు, కళాకారులకు మరింత ప్రోత్సాహం. క్రీడాకారులు, పరిశోధకుల యత్నాలు సఫలం. 29,30 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. విష్ణు సహస్రనామ పారాయణ చేయండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ఆప్తుల సలహాలు, సూచనలతో ముందుకు సాగుతారు. కాంట్రాక్టులు దక్కుతాయి. ఆభం ణాలు, గృహోపకరణాలు కొంటారు. దైవకార్యాలలో పాల్గొంటారు. నూతన ఉద్యోగయోగం. వ్యాపారులకు భాగస్వాములతో అగ్రిమెంట్లు. రాజకీయవేత్తలు, కళాకారులకు ఆశ్చర్యకరమైన సమాచారం. రచయితలు లక్ష్యాలు సాధిస్తారు. 25,26 తేదీలలో దూర ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

అనుకున్న కార్యక్రమాలను పూర్తి చేసే వరకూ విశ్రమించరు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారస్తులు పెట్టుబడుల అన్వేషణలో విజయం, ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు సత్తా నిరూపించుకుంటారు. రచయితలకు సంతోష కరమైన సమాచారం. 27,28 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శ్రీరామరక్షాస్తోత్రం పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొన్ని సమస్యలను అత్యంత చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. కష్టానికి ఫలితం అందుకుంటారు. విద్యార్థులు, నిరుద్యోగులకు అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయవేత్తలు, కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. క్రీడాకారులకు అనుకూల సమయం. 28,29 తేదీల్లో బంధువుల నుంచి ఒత్తిళ్లు. శారీరక రుగ్మతలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆదాయం అవసరాలకు తగినంతగా లభిస్తుంది. కొత్త కార్యక్రమాలు చేపట్టి సమయానికి పూర్తి చేస్తారు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఇళ్లు, వాహనాలు కొనుగోలు చేస్తారు. రాజకీయ, పారిశ్రామికవేత్తలకు సంతోషకరమైన వార్తలు అందుతాయి. రచయితలు, క్రీడాకారులు అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. 30,1 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. మనశ్శాంతి లోపిస్తుంది. దుర్గాస్తోత్రాలు పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

అనుకున్న కార్యక్రమాలను చక్కదిద్దడంలో ముందడుగు. స్థిరాస్తి విషయంలో ఇబ్బందులు తొలగుతాయి. వ్యాపారస్తులు అనూహ్యమైన రీతిలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. పారిశ్రామికవేత్తలకు సంతోషకర సమాచారం. రచయితలు, కళాకారులు విశేష ఆదరణ లభిస్తుంది. 26,27 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

తుల: చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

నూతన పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. ప్రముఖుల నుంచి ఆశించిన సహాయసహకారాలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. వ్యాపారులకు అనుకున్న పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు ఉన్నతపోస్టులు రావచ్చు. పారిశ్రామికవేత్తలకు శుభవార్తలు. 25,26 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. శివాష్టకం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయం క్రమేపీ వృద్ధి చెందుతుంది. పలుకుబడి కలిగిన వ్యక్తులు సహాయ పడతారు. సమాజంలో ప్రత్యేక ఆదరణ పొందుతారు. పారిశ్రామికవేత్తలు, కళా కారులకు కొత్త అవకాశాలు, క్రీడా కారులకు విశేష గుర్తింపు. 28,29 తేదీల్లో దూరప్రయాణాలు. రుణఒత్తిడులు. లక్ష్మీనృసింహ స్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆదాయం కొంత నిరాశ పరుస్తుంది. అప్పుల కోసం అన్వేషణ. . విద్యావకాశాలు నిరుత్సాహ పరుస్తాయి. అనుకున్న కార్యక్రమాలలో అవాంతరాలు నెలకొంటాయి. స్థిరాస్తుల విషయంలో అగ్రిమెంట్లు వాయిదా పడతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కొంత గందరగోళంగా ఉంటుంది. 26,27 తేదీల్లో శుభవర్తమానాలు. ఆకస్మిక ధనలబ్ధి. అంగారక స్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త కార్యక్రమాలు చకచకా పూర్తి చేస్తారు. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. కొన్ని వివాదాలు అత్యంత నేర్పుగా పరిష్కరించుకుంటారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు. వ్యాపారులకు ఒత్తిడులు తొలగుతాయి. పారిశ్రామిక, రాజకీయ వేత్తలకు అనూహ్యమైన అవకాశాలు. రచయితలు, క్రీడాకారులకు అన్నింటా అనుకూలత. 30,1 తేదీల్లో దూరప్రయాణాలు. గణేశస్తోత్రాలు పఠించండి.



కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఇంతకాలం పడిన కష్టం ఫలించి ముందడుగు వేస్తారు. వాహనాలు, భూములు కొనుగోలు యత్నాలలో పురోగతి. వ్యాపారులకు పెట్టుబడులు సకాలంలో సమకూరతాయి. ఉద్యోగాలలో సమస్యలు, చికాకులు తొలగుతాయి. క్రీడాకారులు, వైద్యులకు ఆహ్వానాలు అందుతాయి. 25,26 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. స్వల్ప అనారోగ్యం. కాలభైరవాష్టకం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు కొన్ని దక్కించుకుంటారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. వ్యాపారస్తులకు లాభాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగస్తులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయ వేత్తలు, కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుంది. 29,30 తేదీల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు. ఆదిత్య హృదయం పఠించండి.

పదరసం-434

ఆధారాలు

అడ్డం

1. బహిరంగ గణేశ పూజలకు ఆద్యుడు (9)
6. చక్రవర్తి అవబోతూ చేసే క్రతువు సరిగా లేదు (5)
8. ఉజ్జయినిలో వెలసిన అమ్మ తిరగబడింది (4)
9. పరశురాముని తల్లికి ఆది లోపించింది (2)
10. కైకేయికి చెడ్డ సలహా ఇచ్చింది (3)
11. దుర్మార్గుడు ఎటు నుంచైనా రావచ్చు!(3)
14. ఏ శుభకార్యమైనా ఇది తప్పనిసరి (8)
17. దుర్యోధనుడు భంగపడినచోటు (4)
18. ఆవిర్భావం (4)
21. పుడమి (2)

నిలువు

1. వేదవ్యాసుడు (6)
2. ఈ జలం పవిత్రమైనది (4)
3. మన్మథుని భార్య (2)
4. శివుడు (5)
5. శాంతాదేవిని పెంచిన రాజు (5)
7. సమవర్తి (6)
12. తప్పనిసరిగా కావలసినది (5)
13. నమ్రత (4)
15. సాధారణంగా ఈ వాద్యాన్ని శృతి కోసం వాడతారు (3)
16. కుమారస్వామి వాహనం (3)
18. తరంగం (2)
19. మాత (2)
20. తిరగబడ్డ ఒక తంత్రీవాద్యం



పదరసం - 434

పేరు : .....

చిరునామా:.....

.....

పిన్‌కోడ్ : ..... మొబైల్ : .....

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

సమాధానాలను పైగడులలో పూరించి,కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2023 అక్టోబర్ 9 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

పదరసం - 430 సమాధానాలు



విజేతలు: ఆమంచి స్వప్న, వై.హనుమంతరావు, వీరారెడ్డి, కె.అల్లీరాణి, టి.నాగలక్ష్మి, వెంకాయమ్మ, ప్రదీప్‌కుమార్, యం.అన్నపూర్ణ, ఆర్.సి.వనమాల, రాయవరపు శేషు, పి. సీతామహాలక్ష్మి, చిం.దేవలక్ష్మి, ఆర్.ఎస్.పి.కౌముది, ఆర్.వి.నాగేశ్వరరావు, సుగుణరాజారాం, వి.భారతి, ఆర్.ఎస్.పి.కౌముది, టి.వెంకటసూర్యం, సూర్యప్రభ, ఎ.గాయత్రి, వి.రంగనాథ్, యస్.లక్ష్మిదేవి, టి.వి.విద్యానాథ్, బి.ధన్వంతరి, వై.రాధాకిషన్, సుశీలమ్మ, టి.ఝాన్సిలక్ష్మి, రాజేంద్రప్రసాద్ శర్మ, ఎస్.క్రిష్ణమూర్తి, కె.వి.ఎస్.ఎన్.గణేశ్‌కుమార్, నేమాన సుభాష్‌చంద్రబోస్, ఎస్.ఫణిమంజరి, కె.హైమావతి, ప్రదీప్, ఆర్.అంజనీదేవి, కో. ప్రవీణ్, రాములు, మ. విజయలక్ష్మి, విశ్వక్సేన్, ఎస్.పూర్ణకుమారి, గీతాప్రవంతి, భాస్కరయ్య, పి.శాంతకుమారి, శారద, జి.వి.మురళీమోహన్, కె.సత్యనారాయణ, కె.విమలాదేవి, పులికంటి రాజేశ్వరరావు, వి.శివలాస్య, వెంకటరమణమూర్తి **ఈ వారం విజేత : చెరుకు మహేశ్వరశర్మ, జగిత్యాల జిల్లా.**

సెప్టెంబర్ మాసంలో ఇంతవరకూ విడుదలైన సినిమాలను చూస్తుంటే... కోట్లు ఖర్చుపెట్టి దర్శక నిర్మాతలు ఇలాంటి సినిమాలను ఎందుకు తీస్తున్నారో? అనే ప్రశ్న ఉదయించకమానదు. పైగా అందులో కొన్ని పాపులర్ హీరోలు నటించిన సినిమాలు కావడం, మరికొన్ని పాన్ ఇండియా చిత్రాలు కావడం విశేషం. సినిమా అనేది కళాత్మక వ్యాపారం అనే విషయాన్ని దాదాపు అందరూ అంగీకరించే పరిస్థితి వచ్చింది. కానీ ఏ మాత్రం జనరంజకంగా లేని సినిమాలను తెరకెక్కించి, ప్రేక్షకుల సమయాన్ని, ధనాన్ని ఇలా వృథా చేస్తున్నారేమిటనే బాధ ఈ సినిమాలను చూస్తే కలుగుతోంది.

ప్రేక్షకులకు చుక్కలు చూపిస్తున్న సినిమాలు!

సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన సినిమాల్లో ప్రధానమైంది విజయ్ దేవరకొండ నటించిన 'ఖుషీ'. ఉత్తరాదిన 'లైగర్' చిత్రానికి ఎదురుగాలి వీయడంతో ఈ సినిమా దర్శక నిర్మాతలు తెలివిగా హిందీలో తప్ప మిగిలిన దక్షిణాది భాషల్లో దీనిని విడుదల చేశారు. బలహీనమైన కథ, పేలవమైన కథనం కారణంగా ఈ సినిమా పెద్దంతగా మెప్పించలేక పోయింది. అయినా... సినిమా తనను 'ఖుషీ' చేసిందంటూ హీరో విజయ్ దేవరకొండ ఎంపిక చేసిన వంద మంది అభిమానుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ లక్ష రూపాయల చొప్పున డబ్బులు అందించాడు. సంతోషం. ఇక రెండోవారం వచ్చిన 'జవాన్' సినిమాది ఇదే కథ. తమిళ దర్శకుడు అట్లీ రొటీన్ రొట్టకొట్టుడు కథను తీసుకుని షారూఖ్ ఖాన్, నయనతార జంటగా తెరకెక్కించాడు. ఈ యేడాది ప్రారంభంలో 'పఠాన్'తో తిరిగి సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చిన షారుఖ్ ఖాన్ కు ఈ సినిమా కూడా మంచి ఫలితాన్నే అందించింది. కానీ... సినిమా ఎలాంటి కొత్త అనుభూతిని ప్రేక్షకులకు కలిగించలేకపోయింది. కొందరైతే ఈ స్థాయి కలెక్షన్స్ ఇంత రొటీన్ చిత్రానికి ఎలా వచ్చాయా? అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. అదే వారం వచ్చిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'ది మరో విషాదాంతక కథ. పేరుకు ఇది పాన్ ఇండియా సినిమానే అయినా... దీనిని తెలుగు, తమిళ భాషల్లో మాత్రమే విడుదల చేశారు. ఆ తర్వాత కొద్ది గ్యాప్ తో మలయాళంలో విడుదల చేశారు. నవీన్ పోలిశెట్టి, అనుష్క జంటగా నటించిన ఈ సినిమా భారీ అంచనాలతో జనం ముందుకు వచ్చింది. కానీ ఆ స్థాయిలో మెప్పించలేకపోయింది. సినిమాను దర్శకుడు మహేశ్ పద్ధతిగానే తీసినా ఎంచుకున్న కథ సగటు సినీజీవిని ఆకట్టుకునేది కాకపోవడంతో ఇది కూడా పరాజయ చిత్రాల జాబితాలోకి చేరిపోయింది.

సెప్టెంబర్ మూడో వారంలో వినాయక చవితి కానుకగా బోలెడన్ని పెద్ద సినిమాలు రాబోతున్నాయని కొంతకాలంగా సినీజనాలు ఊదరగొడుతూ వచ్చారు. కానీ చివరి నిమిషంలో రామ్ -బోయపాటి 'స్కంద' మూవీని 28కి వాయిదా వేశారు. అలానే లారెన్స్, కంగనా రనౌత్‌తో పి. వాసు తెరకెక్కించిన 'చంద్రముఖి -2' సినిమానూ 28కి పోస్ట్‌పోన్ చేశారు. దాంతో నాలుగు చిన్న చిత్రాలు, అనువాద చిత్రం 'మార్క్ ఆంటోని'తో తెలుగు సినీ అభిమానులు సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పోనీ ఈ సినిమాలైనా ప్రేక్షకులను మెప్పించాయా? అంటే అదీ లేదు. వారి సహనానికి పరీక్ష పెట్టాయి.

విశాల్ ద్విపాత్రాభినయం చేసిన 'మార్క్ ఆంటోని' సినిమా చూస్తే... ఇలాంటి సినిమాలు అసలు ఎందుకు తీస్తారు? ఏ ధైర్యంతో కోట్లు ఖర్చు పెడతారు? అనే సందేహం వస్తుంది. టైమ్ ట్రావెల్ నేపథ్యం తెరకెక్కిన ఈ సినిమాలో విశాల్ మాత్రమే కాదు ఎస్. జె. సూర్య సైతం డ్యుయల్ రోల్ ప్లే చేశాడు. వీరిద్దరి ఓవర్ యాక్షన్‌తో ప్రేక్షకులకు పిచ్చెక్కిపోయిందంటే అతిశయోక్తి కాదు. దానికి తోడు సంగీత దర్శకుడు జి. వి. ప్రకాశ్ కుమార్ కర్ణకఠోరమైన నేపథ్య సంగీతాన్ని తట్టుకోవడం కూడా కష్టమే! 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ కార్తీక్ రత్నం నటించిన 'చాంగురే బంగారు రాజా' మూవీ కూడా ఇదే రోజున విడుదలైంది. పల్లెటూరి నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాను హీరో రవితేజ నిర్మించడం విశేషం. సతీశ్ వర్మ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అయ్యాడు. సహజత్వం పేరుతో ఇందులోని పాత్రలను మలిచిన తీరు చూస్తే... దర్శకుడి ఓవర్ కాన్ఫిడెన్స్‌కు ఆశ్చర్యం కలగక మానదు. ఏ ఒక్క సన్నివేశం కూడా ఆకట్టుకునే విధంగా లేదు. పైగా బ్లాక్ కామెడీని టేకిట్ గ్రాంట్ అన్నట్టుగా తెర కెక్కించడంతో పాటు అదే కథను నాలుగు వర్షన్స్‌తో చూపించడంతో ప్రేక్షకులు సహనాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అదే వారం వచ్చిన 'రామన్న యూత్', అను, సోదర సోదరీమణులారా' చిత్రాలదీ అదే తీరు.

ఇలాంటి సినిమాలను చూస్తున్నప్పుడు చాలామందికి వచ్చే సందేహం ఏమంటే... ఇలాంటి చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం వీరికి ఎలా కలుగుతుంది? కనీసం నిర్మాణ సమయంలో ఇది ప్రేక్షకాదరణ పొందదనే విషయాన్ని ఎవ్వరూదర్శక నిర్మాతల దృష్టికి తీసుకెళ్లారా?అని. నిజం చెప్పాలంటే.. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం చాలా కష్టం... రెమ్యూనరేషన్ తీసుకునే నటీనటులు, సాంకేతిక నిపుణులు తమ పని తాము చేసుకుంటూ వెళతారు తప్పితే... సినిమా ఫలితం గురించి ఎలాంటి జడ్జిమెంట్ ఇవ్వరు. ఒకవేళ ఇచ్చినా... సదరు దర్శక నిర్మాతలు వాటిని పట్టించుకోరు. వారికి కూడా సినిమా ఫలితంపై సందేశం ఉన్నా... దానిని బయటకు వ్యక్తం చేయరు. ఎందుకంటే 'రాజు గారు, ఏనుగు అంబారీ ఊరేగింపు'నకు సంబంధించిన 'నగ్నసత్యం' కథ వీరిందరికీ బాగా తెలుసు కాబట్టి! సో... థియేటర్లకు వెళ్లే ముందే ప్రేక్షకులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవడం ఉత్తమం. అప్పుడే తమ డబ్బును, సమయాన్ని ఆదా చేసుకున్న వారు అవుతారు!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

'యునెస్కో' కిరీటంలో మరో మణి శాంతినికేతన్



ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం శాంతినికేతన్ యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో చోటు దక్కించుకుంది. సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన ప్రపంచ వారసత్వ కమిటీ 45వ సమావేశంలో ఈ ప్రకటన వెలువడింది. దీంతో భారత్‌లో ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తింపు పొందిన వాటి సంఖ్య 41కి చేరినట్లయింది. పశ్చిమ బెంగాల్‌లోనే సుందర్బన్స్ నేషనల్ పార్క్, డార్జిలింగ్ మౌంటైన్ రైల్వే ఇప్పటికే ఈ గుర్తింపును పొందాయి. 'శాంతినికేతన్'కు ఈ హోదా కోసం రవీంద్రుని 150వ జయంతి (2010) సందర్భంతో పాటు గతంలో చాలాసార్లు ప్రయత్నాలు జరిగాయి. 'రవీంద్ర గురుదేవుల దార్శనికత, భారత్ అత్యున్నత సాంస్కృతిక వారసత్వానికి ప్రతి రూపమైన శాంతినికేతన్ ఈ గౌరవం పొందడం భారతీయులందరికీ గర్వకారణం' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు.

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 49

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.220/-

వెల : ₹.200/-



వెల : ₹.390/-



వెల : ₹.250/-



వెల : ₹.250/-



వెల : ₹.360/-



వెల : ₹.100/-



వెల : ₹.200/-



వెల : ₹.100/-

వెల : ₹.150/-



వెల : ₹.799/-



వెల : ₹.499/-



వెల :₹.495/-



వెల : ₹.799/-



వెల : ₹.549/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687